సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 50
శుక్రవారం 12-5-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'



**స్వల్ప నష్టాల్లో మార్కెట్లు..**
సెన్సెక్స్ 36 పాయింట్లు క్షీణత
నిఫ్టీ 18 పాయింట్లు డౌన్ - 15లో



**జై జైస్వాల్...**
జైస్వాల్ వీరవిహారంతో కోల్‌కతాపై రాజస్తాన్ ఘనవిజయం. - 14లో




**ఉద్ధవ్‌ను సీఎంగా నియమించలేం**
బలపరీక్షకు ముందే ఉద్ధవ్ స్వచ్ఛందంగా రాజీనామా చేశారని, ఆయనను తిరిగి సీఎంగా నియమించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది.
- వివరాలు 6లో



**పాలనాధికారం ఢిల్లీ ప్రభుత్వానిదే**
ఢిల్లీలో పరిపాలనా వ్యవహారాలపై శాసన, కార్యనిర్వాహక అధికారాలు ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటాయని సుప్రీం తేల్చిచెప్పింది.
- వివరాలు 6లో



**ఇమ్రాన్ అరెస్ట్ చట్టవిరుద్ధం**
ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్ చేసి ఎన్ఏబీ కస్టడీలో ఉంచడాన్ని పాక్ సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది.
- వివరాలు 6లో



**చీతాలు.. చింతలు**
భారత్‌లో అంతరించిపోయిన చీతాల సంతతిని తిరిగి పెంపొందించడానికి కేంద్రం చేపట్టిన చీతాల ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి.
- వివరాలు 6లో

## సీఎం రేసులో లేను

టీడీపీతో పొత్తు ఖాయమని పవన్‌కల్యాణ్ సంకేతాలు




- సీఎం పదవి కావాలని అడగాలి అంటే ఆ స్థాయి ఉండాలి కదా అంటూ వ్యాఖ్యలు
- జనసేన బలం తెలిశాక టీడీపీ అధ్యక్షుడి స్థానంలో నేనున్నా ఆ మాట చెప్పను
- పొత్తు కండిషను కేవలం వైఎస్సార్‌సీపీ దిగాలి అంతే..
- అభిమానులు నిరాశ పడటానికి ఇదేమీ సినిమా కాదు
- మీడియా సమావేశంలో జనసేన అధినేత వ్యాఖ్యలు - 12లో

## చంద్రబాబు పల్లకీ మోయడమే పవన్ ఎజెండా



- కాపుల ఓట్ల కోసం పవన్‌ను ఎరగా వేసిన చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్ - 12లో




## తెలంగాణ రాజకీయాల్లో కర్ణాటక కచేరీ!

### ఆ రాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇక్కడ ఎలాంటి ప్రభావం చూపుతాయనే చర్చ

**ఎవరు గెలిస్తే ఎలా ఉంటుందన్న అంచనాల్లో బీఆర్ఎస్ పెద్దలు..**
- రెండు జాతీయ పార్టీల గెలుపు అవకాశాలను బేరీజు వేస్తున్న కేసీఆర్

**కోటి ఆశల్లో కాంగ్రెస్ పార్టీ..**
- ఎగ్జిట్ పోల్స్ అనుకూలంగా ఉండటంతో నేతల్లో హుషారు
- కన్నడనాట విజయం సాధిస్తే ఇక్కడా కలసి వస్తుందనే భావన

**అక్కడా, ఇక్కడా గెలుస్తామన్న బీజేపీ**
- కర్ణాటక ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పుతాయన్న రాష్ట్ర నేతలు
- అక్కడ గెలిస్తే తెలంగాణలోనూ అధికారం వస్తుందనే ఆశాభావం




- కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ఇంకా ఒక్కరోజే ఉంది. శనివారం మధ్యాహ్నానికల్లా ఏ పార్టీ గెలుస్తుందన్న దానిపై దాదాపు స్పష్టత వస్తుంది. మరి ఆ ఫలితం ఎలా ఉంటుందన్న అంశం ఇక్కడ తెలంగాణలో వేడి పుట్టిస్తోంది. మరో 5,6 నెలల్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో.. కర్ణాటక ఫలితాల ప్రభావం ఇక్కడ ఎలా ఉంటుందన్న చర్చ జరుగుతోంది. కన్నడనాట బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోరు జరగడంతో.. ఈ రెండు పార్టీల్లో ఎవరు గెలిస్తే వారికి తెలంగాణలో కూడా ఊపు వస్తుందన్న భావన వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో ఎవరు గెలిస్తే ఎలాంటి ప్రభావం ఉంటుంది? ఎదుర్కోవడానికి ఏం చేయాలి? అన్న దానిపై బీఆర్ఎస్ లెక్కలు వేసుకుంటోంది.

3లో

## రాష్ట్రానికి పదేళ్ల పండుగ..!




- తెలంగాణ పదో ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా 'దశాబ్ది ఉత్సవాలు'
- సంవత్సరమంతా నిర్వహించేలా ప్రణాళిక.. ప్రస్తుతానికి వారం పాటు కార్యక్రమాలు
- అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ ఆలోచన
- ప్రతిష్ఠాత్మక పథకాల అమలు, మారిన స్థితిగతులపైనే ప్రధాన ఫోకస్
- సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య రంగాల్లో వచ్చిన మార్పులేమిటనే వివరాల సేకరణ
- ఎన్నికల ఏడాది కావడంతో ప్రజల మన్ననలు పొందే వ్యూహం - 8లో



సభకు హాజరైన నిరుద్యోగులు

## కేటీఆర్ రోజుకో శాఖకు మంత్రి

- అన్ని శాఖలను ఆయనే దోచుకుంటున్నారు..
- మేము అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తాం
- నిరుద్యోగ మార్చ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రంలో అన్ని ప్రభుత్వశాఖల్లో పాలన అవినీతిమయంగా ఉందని, మంత్రి కేటీఆర్ రోజుకో శాఖకు మంత్రి అవతారమెత్తి శాఖలన్నింటినీ దోచుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కేటీఆర్ సోమవారం హోంమంత్రి, మంగళవారం ఆరోగ్యమంత్రి, బుధవారం ఆర్థికమంత్రి, శుక్రవారం ఇరిగేషన్ మంత్రి, శనివారం విద్యామంత్రి అవుతున్నారని ఆదివారం మాత్రం డ్రగ్స్, మద్యం సేవించి ఇంట్లో పడుకుంటున్నారని దుయ్యబట్టారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ గురువారం సంగారెడ్డిలో బీజేపీ నిరుద్యోగ మార్చ్ నిర్వహించింది. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ముడతలు పడిన చొక్కాలు ధరించిన కేటీఆర్‌కు ఇప్పుడు రూ.వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో దోచుకున్న డబ్బును విదేశాల్లో పెట్టుబడులు పెట్టారని ఆరోపించారు. తెలంగాణను దోచుకుంటున్న నయా నిజాం గడీలను బద్దలు కొట్టేందుకే అన్ని జిల్లాల్లో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

**భోగాలు మీకు.. కడుపు మంట నిరుద్యోగులకా..**


వందలాది మంది నిరుద్యోగుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబం రాజభోగాలను అనుభవిస్తూ నిరుద్యోగ యువతను కడుపుమంటకు గురి చేస్తోందని బండి నిప్పులు చెరిగారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే జాబ్‌క్యాలెండర్ ప్రకటించి.. బిశ్వాల్ కమిటీ నివేదిక మేరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడతామని ప్రకటించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఆయా పరీక్షల అభ్యర్థులకు రూ.లక్ష పరిహారం చెల్లించే వరకు పోరాటం చేపడతామన్నారు. కేసీఆర్ ఇంకోసారి అధికారంలోకి వస్తే రూ.ఐదు లక్షల కోట్ల అప్పులకు మరో రూ.ఐదు లక్షల కోట్లు చేరతాయని ధ్వజమెత్తారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను టీఆర్ఎస్ సర్కారు కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చేందుకు కుట్ర చేస్తోందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న కరీంనగర్‌లో హిందూఏక్తా యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు, విజయశాంతి పాల్గొన్నారు.



## పాస్‌పోర్టు దరఖాస్తులకు 7,150 అదనపు స్లాట్లు

ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): పాస్‌పోర్టు దరఖాస్తుదారులు స్లాట్‌ల కోసం ఈ నెల 15వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అదనంగా 7,150 స్లాట్స్ విడుదల చేస్తున్నట్లు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీ నుంచి మే 12వ తేదీ వరకు 5,500 స్లాట్లు అదనంగా విడుదల చేశామని, అలాగే ఏప్రిల్ 29వ తేదీన శనివారం పాస్‌పోర్టు డ్రైవ్‌లో మరో 3,056 స్లాట్లు విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఇంకా దరఖాస్తుదారులు స్లాట్ల లభ్యతకు సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వస్తుండటంతో అదనంగా 7,150 స్లాట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేట, అమీర్‌పేట్, టోలిచౌకితో పాటు కరీంనగర్, నిజామాబాద్‌లలోని పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో తత్కాల్, సాధారణ, పీసీసీల కోసం స్లాట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అదనపు స్లాట్లను ప్రతి బుధ, శుక్రవారాల్లో సాయంత్రం 4.30కు విడుదల చేస్తామని వివరించారు. తమ అధికారిక పోర్టల్, ఎంపాస్‌పోర్ట్‌సేవా యాప్ ద్వారా షెడ్యూలింగ్, రీ షెడ్యూలింగ్ చేసుకుని కొత్త తేదీల్లో స్లాట్లు పొందవచ్చని తెలిపారు.



# డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ షురూ

**నోటిఫికేషన్ ఇచ్చిన ఉన్నత విద్యా మండలి**

- కొత్తగా అందుబాటులోకి 'దోస్త్'యాప్
- ఈ నెల 16 నుంచే రిజిస్ట్రేషన్లు.. 20 నుంచి వెబ్ ఆప్షన్లు
- జూన్ 16న తొలిదశ సీట్ల కేటాయింపు
- మొత్తంగా మూడు దశల్లో అడ్మిషన్ల ప్రక్రియ
- తొలిదశకు రూ.200, తర్వాతి దశలకు రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్)-2023 నోటిఫికేషన్‌ను కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిత్తల్‌తో కలసి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి గురువారం విడుదల చేశారు. ఇంటర్ ఉత్తీర్ణులైనవారు రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ నెల 16 నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. దీనికోసం ఈసారి కొత్తగా DOST అనే యాప్‌ను ప్రవేశపెట్టారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో దీన్ని డౌన్‌లోడ్ చేసుకుని దోస్త్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చు.

**మొబైల్ ద్వారా కూడా దోస్త్ రిజిస్ట్రేషన్**

- ఆండ్రాయిడ్ ఫోన్లలో గూగుల్ ప్లేస్టోర్ నుంచి DOST యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో రిజిస్ట్రేషన్ చేసేప్పుడు విద్యార్థి ఆధార్ నంబర్‌తో లింక్ అయి ఉన్న మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేసి దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయవచ్చు.
- మీ సేవ కేంద్రాల ద్వారా దోస్త్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అయితే అక్కడ బయోమెట్రిక్ ఇవ్వాల్సి ఉంటుంది.
- టీయాప్ ఫోలియో ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి.. విద్యార్థి ఇంటర్ హాల్‌టికెట్, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ నమోదు చేసుకోవాలి. టీఎస్‌బీఐఈలో లభించే విద్యార్థి ఫొటో, ప్రత్యక్షంగా దిగే ఫొటో సరిపోతే.. దోస్త్ ఐడీ సమాచారం వస్తుంది.
- రిజిస్ట్రేషన్ కోసం విద్యార్థులు రూ.200 రుసుమును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. దోస్త్ ఐడీ, పిన్ నంబర్‌ను భద్రపర్చుకోవాలి.
- రిజర్వేషన్, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు మీసేవ నుంచి పొందిన పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1, 2022 తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని కూడా అప్‌లోడ్ చేయాలి.



నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న కళాశాల విద్య కమిషనర్ నవీన్‌మిత్తల్, ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి తదితరులు

### 86 వేల సీట్లు తగ్గాయ్..

ఈ ఏడాది డిగ్రీలో దాదాపు 86 వేల సీట్లు తగ్గించినట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. డిమాండ్ లేని కోర్సుల బదులు కొత్త కోర్సులు పెడతామంటే అనుమతులు ఇస్తామన్నారు. గత ఏడాది 4,73,214 డిగ్రీ సీట్లు ఉంటే, ఈ ఏడాది 3,86,544 అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. డిమాండ్ లేని సీట్లను గత ఏడాది కూడా తగ్గించినట్లు పేర్కొన్నారు.

**'దోస్త్' ప్రక్రియ తీరు ఇదీ..**

| | |
|---|---|
| తొలిదశ రిజిస్ట్రేషన్ (రూ.200 రుసుముతో) | 16.5.23 నుంచి 10.6.23 వరకు |
| వెబ్ ఆప్షన్లు | 20.5.23 నుంచి 11.6.23 వరకు |
| ప్రత్యేక వర్గాల వారి ధ్రువపత్రాల పరిశీలన (పీహెచ్, సీఏపీ) | 8.6.23వ తేదీన |
| ఎన్‌సీసీ, ఇతర వర్గాల పత్రాల పరిశీలన | 9.6.23వ తేదీన |
| తొలిదశ సీట్ల కేటాయింపు | 16.6.23వ తేదీన |
| సెల్ఫ్ రిపోర్టింగ్ | 16.6.23 నుంచి 25.6.23 వరకు |
| రెండో దశ రిజిస్ట్రేషన్ (రూ.400 రుసుముతో) | 16.6.23 నుంచి 26.6.23 వరకు |
| రెండోదశ వెబ్ ఆప్షన్లు | 16.6.23 నుంచి 27.6.23 వరకు |
| పీహెచ్‌సీ, ఎన్‌సీసీవర్గాల పత్రాల పరిశీలన | 26.6.23వ తేదీన |
| రెండోదశ సీట్ల కేటాయింపు | 30.6.23వ తేదీన |
| ఆన్‌లైన్, సెల్ఫ్ రిపోర్టింగ్ | 1.7.23 నుంచి 5.7.23 వరకు |
| మూడో దశ రిజిస్ట్రేషన్ (రూ.400 రుసుముతో) | 1.7.23 నుంచి 5.7.23 వరకు |
| వెబ్ ఆప్షన్లు | 1.7.23 నుంచి 6.7.23 వరకు |
| ప్రత్యేక వర్గాల పత్రాల ధ్రువీకరణ | 5.7.23న |
| మూడోదశ సీట్ల కేటాయింపు | 10.7.23న |
| సెల్ఫ్ రిపోర్టింగ్ | 10.7.23 నుంచి 15.7.23 వరకు |
| మూడు దశల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు కాలేజీల్లో చేరాల్సిన గడువు | 10.7.23 నుంచి 14.7.23 వరకు |
| ఓరియంటేషన్ క్లాసులు | 11.7.23 నుంచి 15.7.23 మధ్య.. |
| డిగ్రీ తరగతుల ప్రారంభం | 17.7.23న |

## 'ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం'

సాక్షి, హైదరాబాద్: నల్సార్ యూనివర్సిటీలో 58 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామక ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. వర్సిటీకి నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్‌కు వాయిదా వేసింది. దరఖాస్తుదారులకు తగిన సమయం ఇవ్వకుండా నల్సార్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకం చేపడుతోందని సికింద్రాబాద్‌కు చెందిన డాక్టర్ ఎ.శ్రీధర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పరీక్షలకు మార్చి 15న నోటిఫికేషన్ ఇచ్చి.. దరఖాస్తు చేసుకోవడానికి 15 రోజులే సమయం ఇచ్చారని చెప్పారు. ఆర్థిక స్తోమత లేని వారు, నిరుద్యోగులు విమాన టికెట్ల ఖర్చు భరించి హైదరాబాద్‌కు రాలేరన్న విషయాన్ని వర్సిటీ అధికారులు గుర్తించలేదన్నారు. ఈ నియామక ప్రక్రియను చట్టవిరుద్ధమని ప్రకటించాలని కోరారు. అలాగే ఈనెల 13న జరగనున్న పరీక్షలపై స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# డిగ్రీలో కంప్యూటర్ సైన్స్ కోర్సు

**కొత్తగా నాలుగేళ్ల ఆనర్స్ కోర్సు**

- ఇంజనీరింగ్ సీఎస్‌సీకి ఇది సమానం
- కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది నుంచి డిగ్రీలో కొత్తగా బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సును ప్రవేశపెడుతున్నట్టు కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ ప్రకటించారు. ఇది ఇంజనీరింగ్‌లో సీఎస్‌సీ కోర్సుకు సమానమని తెలిపారు. గురువారం 'దోస్త్'(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) నోటిఫికేషన్ విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పేరుతో నాలుగేళ్ల ఆనర్స్ కోర్సును ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. ప్రస్తుతానికి 11 ప్రభుత్వ డిగ్రీ, అటానమస్ కాలేజీలు ఈ కోర్సును ప్రవేశపెట్టేందుకు ముందుకొచ్చాయని, ఒక్కో కాలేజీలో 60 సీట్లతో అనుమతులిచ్చామని తెలిపారు. ఇదే తరహాలో ప్రైవేట్ కాలేజీలు ముందుకొస్తే వాటికీ అనుమతిస్తామన్నారు.

**కోర్సు ప్రత్యేకతలివీ...**

- ప్రస్తుతానికి డిగ్రీలో బీఎస్సీ ఎంపీసీఎస్ (గణితం, ఫిజిక్స్, కంప్యూటర్) కోర్సును నిర్వహిస్తున్నారు. అంటే కంప్యూటర్ సిలబస్‌ను కేవలం ఒక సబ్జెక్టుగా చదువుతుండగా, ఇకపై ఏకంగా పూర్తిస్థాయి కంప్యూటర్ సైన్స్ కోర్సు అందుబాటులోకి వస్తుంది.
- ఈ కోర్సు సిలబస్, కరికులం అంతా బీటెక్ సీఎస్ఈ కోర్సుతో సమానంగా ఉంటుంది. బీటెక్‌లో సీట్లు దక్కించుకోలేని వారు, ఎంసెట్‌కు హాజరుకాని వారు దోస్త్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చు.
- విద్యార్థి కావాలనుకుంటే మూడేళ్లలోనే ఈ కోర్సు నుంచి వైదొలగవచ్చు. అప్పుడు ఆ విద్యార్థికి మూడేళ్ల డిగ్రీ పట్టా ఇస్తారు.
- నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసే విద్యార్థులకు ఆనర్స్ డిగ్రీ పట్టాను జారీచేస్తారు. అమెరికా, యూకే అంతటా నాలుగేళ్ల యూజీ కోర్సులు ఉండగా, విదేశాలకు వెళ్లాలనుకునే వారికి ఈ కోర్సు ఉపయుక్తంగా ఉంటుంది.
- ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్‌ను బోధిస్తున్న అధ్యాపకులే బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్ కోర్సుకు బోధిస్తారు. వారికి త్వరలోనే శిక్షణ ఇస్తారు.

**సెక్టార్ స్కిల్ కోర్సులు సైతం**

ఈ సంవత్సరం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుతో పాటు కొత్తగా సెక్టార్ స్కిల్ కౌన్సిల్ కోర్సులను సైతం ప్రవేశపెట్టనున్నారు. బీబీఏ రిటైలింగ్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీబీఏ-ఈకామర్స్ ఆపరేషన్స్, బీఏ కంటెంట్ అండ్ క్రియేటివ్ రైటింగ్, బీబీఏ లాజిస్టిక్స్ వంటి పూర్తిస్థాయి మూడేళ్ల డిగ్రీ కోర్సులను సైతం ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెట్టనున్నారు. ఈ కోర్సులను సైతం 'దోస్త్'ద్వారానే భర్తీచేస్తారు.

## సింగరేణికి జియో మైన్ టెక్ 'గ్లోబల్ రెయిన్‌బో' అవార్డు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో సింగరేణి సంస్థ మరోసారి అత్యుత్తమ జియో మైన్ టెక్ 'గ్లోబల్ రెయిన్‌బో'అవార్డును అందుకుంది. సంస్థ డైరెక్టర్ ఫైనాన్స్ బలరామ్‌కు ఉత్తమ డైరెక్టర్, కార్పొరేట్ మేనేజ్‌మెంట్, ఇన్నోవేటివ్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డును బహూకరించారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఖనిజ కంపెనీలు, అధికారులను ప్రోత్సహించే, జియో మైన్ టెక్ సంస్థ గురువారం భువనేశ్వర్‌లో జరిగిన 'నేషనల్ టెక్నాలజీ డే'ఉత్సవంలో ఈ అవార్డులను ప్రదానం చేసింది.

# ఇక భానుడి భగభగలు

సాక్షి, హైదరాబాద్: భానుడి భగభగలతో రాష్ట్రం హీటెక్కింది. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల రికార్డు స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి ప్రభావాలతో గత పక్షం రోజులుగా నడి వేసవిలోనూ సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రెండ్రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు గురువారం మరింత పెరిగి రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. కరీంనగర్ జిల్లా వీణవంక, జగిత్యాల జిల్లా జైనలో గరిష్ట ఉష్ణోగ్రత 44.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్లలో 44.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కూడా 40 డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతాయని వాతావరణ శాఖ సూచించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదు కావొచ్చని వివరించింది.

**రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)**

| కేంద్రం | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| మెదక్ | 42.0 | 24.8 |
| నల్లగొండ | 41.5 | 24.2 |
| ఆదిలాబాద్ | 41.3 | 26.8 |
| నిజామాబాద్ | 40.9 | 26.7 |
| రామగుండం | 40.2 | 26.6 |
| హనుమకొండ | 39.5 | 27.0 |
| ఖమ్మం | 39.0 | 28.4 |
| భద్రాచలం | 38.6 | 29.0 |
| హైదరాబాద్ | 36.8 | 26.8 |
| మహబూబ్‌నగర్ | 36.0 | 26.5 |
| హకీంపేట్ | 36.0 | 26.2 |
| దుండిగల్ | 36.0 | 25.9 |

## క్లుప్తంగా...

### రూ.85,000 కోట్ల పన్నుల వసూలు లక్ష్యం

వాణిజ్య శాఖకు సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ), వ్యాట్ తదితర పన్నుల ఎగవేతపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023–24లో రూ.85,000 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవాలని వాణిజ్య పన్నుల శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో గురువారం ఆమె సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆదాయాన్ని పెంచేందుకు వినూత్న సూచనలతో ముందుకు వచ్చిన శాఖ ఉన్నతాధికారులను అభినందించారు. అప్పిలేట్ జాయింట్ కమిషనర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రతి పదిహేను రోజులకోసారి సమీక్షించాలని కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ నీతూకుమారి పాల్గొన్నారు.

### రాష్ట్రంలో ప్రజా సమస్యలు గాలికి

బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికొదిలేసి, కేవలం రాజకీయాలు చేస్తూ.. కాలం వెళ్లబుచ్చుతున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మండిపడ్డారు. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయినా, తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) సమ్మె చేస్తున్నా.. సీఎం ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ పంచాయతీ కార్యదర్శులను బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే జేపీఎస్‌ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో వీఆర్వోలు తమ హక్కుల సాధనకు ఆందోళన చేస్తే అసలు ఆ వ్యవస్థనే లేకుండా రద్దుచేశారని, ఆర్టీసీ సమ్మెపైనా ఉక్కుపాదం మోపిన చరిత్ర కేసీఆర్‌దని అన్నారు. వడగళ్ల వానలతో రైతులు వరుసగా పంటలు నష్టపోతున్నా కనీసం సమీక్ష చేసి వారిని ఆదుకునే తీరికే కేసీఆర్‌కు లేకుండా పోయిందన్నారు.

### మాల్దీవుల పాత్రికేయుల పర్యటన

వివిధ సంస్థల సందర్శన

సాక్షి, హైదరాబాద్: మాల్దీవుల పాత్రికేయుల బృందం గురువారం హైదరాబాద్‌లోని రెడ్డి లాబొరేటరీస్, భారత్ బయోటెక్, టీ–హబ్, టీ–వర్క్స్ సంస్థలను సందర్శించింది. ఆయా సంస్థల ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమంతో పాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సంస్థల పనితీరు తెలుసుకున్నారు. భారత్ బయోటెక్ కార్యకలాపాలు, ఔషధాలు తయారు చేసే ప్లాంటు, టీ–హబ్ వివరాలను తెలుసుకున్నారు. టీ వర్క్స్ సీఈవో సుజయ్ కారంపూరి సంస్థ కార్యకలాపాలను వివరించారు.

### క్షమాపణ చెప్పకుంటే గాంధీభవన్ ముట్టడి

సాక్షి, హైదరాబాద్: రాజకీయ చరిత్ర తెలియని రేవంత్‌రెడ్డి ఆర్థిక, కుల అహంకారంతో యాదవ మంత్రిపై నోటికి వచ్చినట్లు మాట్లాడారని గొల్లకురుమ (యాదవ) హక్కుల పోరాట సమితి (జీకేహెచ్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బేషరతుగా యాదవులకు క్షమాపణ చెప్పకుంటే దున్నపోతులు, గొర్రెలు, పొట్టేళ్లతో గాంధీభవన్‌ను ముట్టడిస్తామని గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రధాన పార్టీకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి యాదవులను దూషించి చరిత్ర హీనుడిగా మిగిలిపోయారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

### సమయపాలనలో బెస్ట్ ఎయిర్‌పోర్టు

గ్లోబల్ ఎయిర్‌పోర్ట్స్, లార్జ్ ఎయిర్‌పోర్ట్స్ విభాగాలలో 'హైదరాబాద్'కు మొదటి స్థానం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచంలోనే అత్యంత సమయపాలన కలిగిన విమానాశ్రయంగా గుర్తింపు పొందింది. ఏవియేషన్ ఎనలిటికల్ సంస్థ 'సిరియమ్'ఇటీవల విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు వెల్లడించింది. ఈ ఏడాది మార్చిలో 90.43 శాతం ఆన్‌లైన్ పర్ఫార్మెన్స్‌ను నమోదు చేసినట్లు పేర్కొంది. సిరియమ్ మార్చి నెలలో ప్రపంచవ్యాప్తంగా 5 మిలియన్లకు పైగా విమానాలను సమీక్షించగా.. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ 'గ్లోబల్ ఎయిర్‌పోర్ట్స్', 'లార్జ్ ఎయిర్‌పోర్ట్స్' విభాగాల్లో రెండింటిలోనూ అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది నవంబర్ నాటికి 88.44 శాతంతో లార్జ్ ఎయిర్‌పోర్ట్స్ విభాగంలో 4వ స్థానంలో నిలవగా ఈసారి 90 శాతం దాటడం విశేషం. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ, ప్రయాణికులు సకాలంలో తమ గమ్యస్థానానికి చేరుకొనేలా చేయడంలో తమ నిబద్ధతకు ఇది నిదర్శనం అని వ్యాఖ్యానించారు. విమానాశ్రయ పనితీరును మరింత పెంచడం కోసం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు.

# కర్ణాటక ఫలితాలపై బీఆర్‌ఎస్‌లో ఉత్కంఠ!

రెండు జాతీయ పార్టీల విజయావకాశాలను బేరీజు వేస్తున్న కేసీఆర్

- బీజేపీకి అధికారం వస్తే రాష్ట్రంలో దూకుడు పెంచుతుందనే అంచనా
- అక్కడ కాంగ్రెస్‌కు మెజారిటీ రావొచ్చన్న ఎగ్జిట్ పోల్స్
- దీనితో తెలంగాణలో కాంగ్రెస్ సాధించే ఓట్ల శాతంపైనా లెక్కలు
- పట్టణ ప్రాంతాల్లో బీజేపీ మెరుగైందనే అభిప్రాయం
- బీజేపీ వైపు మొగ్గు చూపేందుకు అవకాశమున్న వర్గాలపై ఫోకస్




సాక్షి, హైదరాబాద్: శనివారం వెలువడనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో అప్పుడే వేడి పెంచేశాయి. జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీగా పోరాడిన కర్ణాటకలో.. కాంగ్రెస్ స్వల్పంగా పైచేయి సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడటం, అదేమీకాదు బీజేపీ మెజార్టీ సాధిస్తుందన్న అభిప్రాయాలూ వినిపించడంపై రాష్ట్రంలో ఆసక్తికర చర్చ సాగుతోంది. ముఖ్యంగా అధికార భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)లో కర్ణాటక ఫలితాలపై ఆసక్తి కనిపిస్తోంది. నిజానికి ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో తెలంగాణ శాసనసభ ఎన్నికలు జరగనుండటంతో.. కాంగ్రెస్, బీజేపీ ఇప్పటికే తమ కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. మరోవైపు కర్ణాటక ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్యే ప్రధాన పోరు జరగడంతో.. అక్కడ రాబోయే ఫలితాలు తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేయవచ్చని బీఆర్‌ఎస్ అంచనా వేస్తోంది. కాంగ్రెస్, బీజేపీలలో ఏది గెలిచినా.. తెలంగాణలో ఏ తరహా వ్యూహాన్ని అమలు చేస్తాయన్న దానిపై బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ లెక్కలు వేస్తున్నట్టు సమాచారం. కర్ణాటక ఎన్నికల ఫలితాలను అనువుగా ఎలా మలుచుకోవాలనే వ్యూహాలను సిద్ధం చేయడంపైనా దృష్టి సారించినట్టు తెలిసింది.

**బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు..**

కర్ణాటకలో బీజేపీ అమలు చేసిన పలు విధానాలు, వ్యవహరించిన తీరు ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారిందని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో నలుగురు ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ బలమున్న బీజేపీ.. ప్రధానంగా హైదరాబాద్ నగరం, శివారు నియోజకవర్గాల్లో మాత్రమే కొంత బలంగా ఉందని అంచనా వేస్తోంది. పట్టణ ప్రాంతాల్లో 8 నుంచి 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో మూడు, నాలుగు నియోజకవర్గాలు మినహా.. కాంగ్రెస్ పార్టీయే ప్రధాన పోటీదారుగా ఉంటుందని బీఆర్‌ఎస్ సంస్థాగత నివేదికల ఆధారంగా భావిస్తున్నట్టు తెలిసింది. కర్ణాటకలో బీజేపీకి మెజార్టీ వచ్చినా.. మేజిక్ ఫిగర్‌కు దగ్గరగా వచ్చినా... అక్కడ ప్రభుత్వ ఏర్పాటుకు సర్వశక్తులు ఒడ్డుతుందని బీఆర్‌ఎస్ భావిస్తోంది. అక్కడ అధికారంలోకి వస్తే తెలంగాణలో దూకుడు పెంచుతుందని అభిప్రాయపడుతోంది. ఒకవేళ కర్ణాటకలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టకుంటే.. ఇక్కడ ఆ పార్టీ దూకుడుకు అడ్డుకట్ట వేయడం సులువు అవుతుందని బీఆర్‌ఎస్ నేతలు అంటున్నారు.

**కాంగ్రెస్‌తోనే ప్రధాన పోటీ..**

గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ కాంగ్రెస్‌కు బలమైన కేడర్ ఉన్నట్టు ఆత్మీయ సమ్మేళనాలకు ఇన్‌చార్జులుగా వ్యవహరించిన బీఆర్‌ఎస్ నేతలు పార్టీ అధినేత కేసీఆర్‌కు సమర్పించిన నివేదికల్లో పేర్కొన్నట్టు తెలిసింది. హైదరాబాద్, శివారు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సాధించే ఓట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయిస్తాయని స్పష్టం చేసినట్టు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్‌కు ఉన్న ఓటు బ్యాంకు ఒక ఏడు శాతం తగ్గితే.. తాము గెలుపు కోసం శ్రమించాల్సి వస్తుందని ఓ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం పరిస్థితికి అద్దం పడుతోంది. హుజూరాబాద్ తరహాలో గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ నామమాత్ర పోటీకి పరిమితమైతే ఇబ్బంది తప్పవని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ వైపు మొగ్గుచూపే అవకాశమున్న వర్గాలపై ఫోకస్ పెట్టి.. బీఆర్‌ఎస్ వైపు తిప్పుకొనేలా వ్యూహరచన చేస్తున్నట్టు సమాచారం.

# కోటి ఆశల్లో కాంగ్రెస్!

కర్ణాటక ప్రజల తీర్పు కోసం రాష్ట్ర కాంగ్రెస్ ఎదురుచూపులు

- ఎగ్జిట్‌పోల్స్ అనుకూలంగా ఉండటంతో హుషారు
- కన్నడ నాట గెలుపు ఇక్కడా కలసి వస్తుందనే యోచన
- రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలకు బ్రేక్ పడుతుందంటున్న కాంగ్రెస్ నేతలు
- వలసల బెడద తప్పుతుందనే భావన
- ఒకవేళ ప్రతికూల ఫలితమొస్తే కుదుపులు తప్పవనే అభిప్రాయం

సాక్షి, హైదరాబాద్: ''తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకో నాలుగైదు నెలలే ఉంది. ఇలాంటి సమయంలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వస్తే.. రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త బలం వస్తుంది. బీజేపీ, బీఆర్‌ఎస్‌లలోకి పార్టీ నుంచి వలసలు తగ్గుతాయి. అసెంబ్లీ ఎన్నికలను ధైర్యంగా ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుంది''.. రాష్ట్ర కాంగ్రెస్‌లో వ్యక్తమవుతున్న అభిప్రాయమిది. కర్ణాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపవచ్చనే రాజకీయ అంచనాల నేపథ్యంలో.. రాష్ట్ర కాంగ్రెస్ కోటి ఆశలతో ఎదురుచూస్తోంది. ఎగ్జిట్ పోల్స్ అనుకూలంగా రావడంతో ఆ పార్టీలో హుషారు కన్పిస్తోంది.



బీజేపీని నిలువరించడం సులువు!

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం తామేనని కాంగ్రెస్ నేతలు అంటున్నా.. బీజేపీ పుంజుకుంటున్న తీరు వారిని కలవరపెడుతూనే ఉంది. బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్ నుంచి అడపాదడపా బీజేపీలోకి వలసలు జరుగుతుండటం, కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణపైనే దృష్టి సారించనుందనే సంకేతాలు వస్తుండటం.. కాంగ్రెస్‌లో ఆందోళన పెంచుతోంది. ఇప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే.. ఈ ఆందోళనకు చెక్‌పడుతుందని, ధైర్యంగా ముందుకెళ్లే పరిస్థితులు వస్తాయని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు కొత్త ఊపు వస్తుందని, అది తెలంగాణలోనూ టానిక్‌లా పనిచేస్తుందని అంటున్నారు. రాష్ట్రంలో బీజేపీకి బ్రేక్ పడుతుందని, వలసలు ఆగుతాయని అంచనా వేస్తున్నారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరుగుతాయని పేర్కొంటున్నారు.

**బీఆర్‌ఎస్‌కు దీటుగా నిలిచేలా..**

కర్ణాటకలో విజయం సాధిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను దీటుగా ఎదుర్కొంటామని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా పరాజయాలు, రోజురోజుకూ క్షీణించిపోతున్న పార్టీగా ముద్ర పడుతున్న నేపథ్యంలో.. కర్ణాటక గెలుపు ఆ అభిప్రాయాన్ని తొలగిస్తుందని అంటున్నారు. ఈ ఊపుతోనే రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎన్నికలను ఎదుర్కొనే ధీమా వస్తుందని వివరిస్తున్నారు. కర్ణాటకలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఎంచుకున్నట్టే.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రజలు కాంగ్రెస్‌వైపు చూస్తారని అంటున్నారు. బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్ పార్టీయే ప్రధాన ప్రత్యర్థిగా ఎన్నికలు జరుగుతాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఒకవేళ ఎగ్జిట్‌పోల్స్‌కు భిన్నంగా కర్ణాటకలో ప్రతికూల ఫలితాలు వస్తే.. రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌కు గడ్డుకాలమేనని, మనుగడ కోసం పోరాడాల్సిన పరిస్థితి వస్తుందేమోనని అంటున్నారు. ''కర్ణాటకలో మేం గెలిస్తే ధైర్యంగా తెలంగాణ ఎన్నికలను ఎదుర్కొంటాం. అలా కాకుండా కర్ణాటకలో ఓటమి ఎదురయితే ఇక్కడ బిక్కుబిక్కుమంటూ ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. దూకుడుగా ఎన్నికలకు వెళ్లకపోతే ఇక్కడా ప్రతికూల ఫలితాలు వచ్చే అవకాశముంది. అయినా కర్ణాటకలో గెలుస్తామని, తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామనే నమ్మకం మాకుంది''అని టీపీసీసీ కీలక నేత ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

# అక్కడా, ఇక్కడా మాదే విజయం!

కర్ణాటక ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పుతాయంటున్న రాష్ట్ర బీజేపీ

- అక్కడ గెలిస్తే తెలంగాణలోనూ అధికారం వస్తుందనే ఆశాభావం
- తెలంగాణ నుంచి ముఖ్యనేతలు ప్రచారం చేయడంతో.. ఆయా చోట్ల పార్టీ గెలుపుపై ఆసక్తి
- ఎగ్జిట్ కాదు.. పీపుల్ పోల్స్ నమ్ముకున్నాం: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కన్నడ ఓటరు తీర్పు ఎలా ఉంటుందనే దానిపై బీజేపీలో ఉత్కంఠ మరింత ఎక్కువగా కనిపిస్తోంది. అధికారంలో ఉన్న పార్టీ మళ్లీ గద్దెనెక్కని సాంప్రదాయం, ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్ వైపు మొగ్గడం వంటి అంశాల నేపథ్యంలో తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. అయినా కర్ణాటకలో బీజేపీ విజయఢంకా మోగించడం తథ్యమని కమలనాథులు చెప్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పుతాయని అంటున్నారు. కర్ణాటకలో గెలిస్తే.. దక్షిణాదిలో పార్టీ విస్తరణకు, తెలంగాణలో కాషాయజెండా ఎగురవేసేందుకు మార్గం సుగమం అవుతుందని పేర్కొంటున్నారు.

**ఎగ్జిట్ పోల్స్‌తో అంతర్మథనం..**

ఇప్పటికే విడుదలైన ఎగ్జిట్‌పోల్ అంచనాల్లో ఒకట్రెండు మినహా దాదాపు అన్నీ కాంగ్రెస్‌కు ఆధిక్యం వస్తుందనే పేర్కొన్నాయి. ఇది బీజేపీ వర్గాల్లో కొంత అంతర్మథనానికి దారితీసినా.. కర్ణాటక అసెంబ్లీ ఫలితాలపై రాష్ట్ర నేతలు మాత్రం పెద్ద ఆశలే పెట్టుకున్నారు. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు తప్పుతాయని, బీజేపీయే అధికారంలోకి వస్తుందని వాదిస్తున్నారు. ఇక కర్ణాటకలో తెలుగు మాట్లాడే ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలతోపాటు ఇతర చోట్ల కూడా తెలంగాణ ముఖ్యనేతలు పలువురు ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ఇతర నేతలు దాదాపు నెలరోజుల పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకరరెడ్డి తదితరులు మూడు, నాలుగు రోజులపాటు వివిధ నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ నేతలు వివిధ జిల్లాలు, నియోజకవర్గాల్లో సమన్వయ, ప్రచార బాధ్యతలు నిర్వహించిన చోట్ల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయనే ఆసక్తి కూడా పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది.

**మేం పీపుల్ పోల్స్ నమ్ముకున్నాం: కె.లక్ష్మణ్**

తాము ఎగ్జిట్ పోల్స్‌ను తప్పుబట్టడం లేదని, అవి ఎలా ఉన్నా తాము పీపుల్ పోల్స్‌ను నమ్ముకున్నామని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ కె.లక్ష్మణ్ చెప్పారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగ్జిట్‌పోల్స్ అధికశాతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్టుగా ఉంది కదా అన్న మీడియా ప్రశ్నలపై స్పందించారు. కర్ణాటకలో తాను నెల రోజుల పాటు ఉన్నానని, బళ్లారి జిల్లా ఎన్నికల ప్రచార బాధ్యతలు నిర్వహించానని చెప్పారు. యడ్యూరప్ప, బసవరాజు బొమ్మై ప్రభుత్వాలు తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కర్ణాటకకు పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు, అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు 'మోదీ ఫ్యాక్టర్'అనేది కచ్చితంగా ప్రభావం చూపుతుందని తెలిపారు. సామాజిక న్యాయ సాధన దిశలో ఎస్సీ, ఎస్టీలకు ఆరు శాతం రిజర్వేషన్ల పెంపు, అదనంగా లింగాయత్‌లు, ఒక్కలిగలకు రెండేసి శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ అమలు వంటివి ప్రజాభిప్రాయాన్ని బీజేపీకి అనుకూలంగా మార్చాయని పేర్కొన్నారు. కర్ణాటకలో కచ్చితంగా తిరిగి అధికారానికి రావడం ఖాయమన్నారు.

# మైనార్టీలంటే అధికారులకు ఎందుకు వివక్ష?

- కలెక్టర్‌పై డీఓపీటీలో ఫిర్యాదు చేస్తా
- జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది



సయ్యద్ షహజాది

ఖమ్మం మయూరి సెంటర్: 'మైనార్టీలకు అమలవుతున్న పథకాలపై సమీక్షించేందుకు ఢిల్లీ నుంచి ఖమ్మం వస్తే, సమావేశానికి హాజరయ్యేందుకు జిల్లా అధికారులకు సమయం లేదా.. ఎందుకు ముస్లిం మైనార్టీలపై అధికారులకు వివక్ష'అని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది ప్రశ్నించారు. ఖమ్మంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మైనార్టీలకు అమలవుతున్న పథకాలపై చర్చించేందుకు కలెక్టర్, సీపీకి సమయం లేదా అని ప్రశ్నించారు. దేశంలో పలు రాష్ట్రాలు, జిల్లాల్లో అధికారులతో సమావేశాలు నిర్వహించినా, ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదన్నారు. ఖమ్మంలో పర్యటించనున్నట్లు ముందుగానే సమాచారం ఇచ్చినా.. సమీక్షకు కలెక్టర్, సీపీ రాకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ విషయంలో కలెక్టర్‌పై డీఓపీటీతో పాటు రాష్ట్రపతి, రాష్ట్ర సీఎస్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఖమ్మంకు వస్తే కబరస్తాన్ లేదని ముస్లింలు చెప్తున్నారని, దీనిపై ఎవరిని ప్రశ్నించాలో చెప్పాలని అన్నారు. తనకు కాకపోయినా పదవికైనా గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని షహజాదీ పేర్కొన్నారు.

**ఉద్యోగుల నిరసన**

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది కలెక్టర్ గౌతమ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు కలెక్టరేట్‌లో మధ్యాహ్నం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కలెక్టర్, సీపీ ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఆలస్యంగా వస్తారని చెప్పినా వినకుండా ఆమె కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని వారు పేర్కొన్నారు.

## ఇకనైనా గవర్నర్ల తీరు మారాలి



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, మహారాష్ట్ర గవర్నర్ వ్యవహరించిన తీరుపై సుప్రీంకోర్టు సరైన తీర్పులు ఇచ్చిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా గవర్నర్లు తమ తీరును మార్చుకోవాలని, లేదంటే ప్రజలు తిరగబడతారని గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వాన్ని కూలగొట్టిన సమయంలో గవర్నర్ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నారాయణ సమర్థించారు.

## నా ప్రాణానికి ముప్పు



ప్రధానికి, కేంద్ర హోంమంత్రికి ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖలు

అబిడ్స్ (హైదరాబాద్): హైదరాబాద్ నగరంలో నెలకొన్న పరిస్థితులతో తనకు, తన కుటుంబానికి ఉగ్రవాద సంస్థల నుంచి ప్రాణహాని ఉందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలకు గురువారం లేఖలు రాశారు. హైదరాబాద్ వ్యాప్తంగా అల్లర్లు సృష్టించడం, తనపై, తన కుటుంబంపై మానవ బాంబులతో దాడులు జరిపేందుకు కుట్రలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి తనకు పలు బెదిరింపు కాల్స్ రావడంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. తనకు, తన కుటుంబానికి భారీ భద్రత కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# 'ప్రీయాక్టివేషన్'పై యాక్షన్!

- అక్రమ సిమ్‌కార్డుల దందాపై ఉక్కుపాదం
- తరచూ వినియోగిస్తున్న అసాంఘికశక్తులు
- చక్రధర్ గౌడ్ మోసాల్లోనూ వీటి పాత్ర కీలకం
- సరఫరా చేసేవారి అరెస్టు విధానం కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: టెన్త్ క్లాస్ విద్యార్థి అభయ్‌ను కిడ్నాప్, హత్య చేసిన నిందితులు బేగంబజార్, సికింద్రాబాద్‌ల నుంచి నాలుగు ప్రీ–యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు కొన్నారు. ఈ సిమ్స్ అన్నీ వేరే వ్యక్తుల పేర్లతో, గుర్తింపుతో ఉన్నవే. వీటిని వినియోగించే అభయ్ కుటుంబీకులతో బేరసారాలు చేశారు.

- జేకేబీహెచ్ పేరుతో హైదరాబాద్‌తో పాటు దేశ వ్యాప్తంగా విధ్వంసాలకు కుట్రపన్నిన ఉగ్రవాదులు సంప్రదింపులు జరపడానికి ప్రీ–యాక్టివేటెడ్ సిమ్‌కార్డుల్నే వినియోగించారు. 2016 నాటి ఈ ముఠాలో కీలకంగా వ్యవహరించిన ఫహద్ ఈ తరహాకు చెందిన తొమ్మిది సిమ్‌కార్డుల్ని చార్మినార్ వద్ద ఉన్న ఔట్‌లెట్‌లో ఖరీదు చేశాడు.
- పంజగుట్టలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేసి, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో ఎర వేసి, నిరుద్యోగులు, ప్రధానంగా మహిళల నుంచి డబ్బు కాజేసిన చక్రధర్ గౌడ్ సైతం పెద్ద సంఖ్యలో ప్రీ–యాక్టివెటెడ్ సిమ్‌కార్డులు వాడాడు. నేరగాళ్లతో పాటు అసాంఘికశక్తులు, ఉగ్రవాదులకు కలిసి వస్తున్న ప్రీ యాక్టివేషన్ దందాకు చెక్ చెప్పడానికి నగర పోలీసు విభాగం సిద్ధమైంది. అందులో భాగంగానే చక్రధర్ గౌడ్‌కు వీటిని అందించిన అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన కృష్ణమూర్తిని అరెస్టు చేశారు.

**నిబంధనలు పట్టించుకోని ఔట్‌లెట్స్...**

సెల్‌ఫోన్ వినియోగదారుడు ఏ సర్వీసు ప్రొవైడర్ నుంచి అయినా సిమ్‌కార్డు తీసుకోవాలంటే ఫొటోతో పాటు గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలు కచ్చితంగా సమర్పించాల్సి ఉంటుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ (డీఓటీ) నిబంధనలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. అనేక మంది సిమ్‌కార్డ్స్ విక్రేతలు తమ దగ్గరకు సిమ్‌కార్డుల కోసం వచ్చే సాధారణ కస్టమర్ల నుంచి గుర్తింపులు తీసుకుని సిమ్‌కార్డులు ఇస్తున్నారు. పనిలో పనిగా వారికి తెలియకుండా స్కానింగ్, జిరాక్సు ద్వారా ఆయా గుర్తింపుల్ని పదుల సంఖ్యలో కాపీలు తీసుకుంటున్నారు. వీటి ఆధారంగా ఒక్కో వినియోగదారుడి పేరు మీద సిమ్‌కార్డులు ముందే యాక్టివేట్ చేస్తున్నారు.

**అరెస్టులతో పాటు డీఓటీ దృష్టికీ..**

ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న బోగస్ ధ్రువీకరణల్ని తీసుకువచ్చే నేరగాళ్లు వాటి ఆధారంగా సిమ్‌కార్డుల్ని తేలిగ్గా పొందుతున్నారు. ఈ దందాను అరికట్టాలంటే సిమ్‌కార్డ్ జారీ తర్వాత, యాక్టివేషన్‌కు ముందు సర్వీస్ ప్రొవైడర్లు కచ్చితంగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేసే విధానం ఉండాల్సిందే. పోస్ట్‌పెయిడ్ కనెక్షన్ మాదిరిగానే ప్రీ–పెయిడ్‌ను పూర్తిస్థాయిలో వెరిఫై చేసిన తర్వాత యాక్టివేట్ చేసేలా ఉంటేనే ఫలితాలు ఉంటాయన్నది నిపుణులు చెబుతున్నారు. ఈ దందా చేస్తున్న వారిని అరెస్టు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవకతవకల్ని డీఓటీ దృష్టికి తీసుకువెళ్లాలని పోలీసులు నిర్ణయించారు.



**ఎవరికి వారు తనిఖీ చేసుకోవచ్చు..**

ప్రతి వినియోగదారుడూ తన పేరుతో ఎన్ని సిమ్‌కార్డులు జారీ అయ్యాయో తెలుసుకునే అవకాశం ఉంది. www.sancharsaathi.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ వివరాలు తెలుసుకోవచ్చు. ఇందులోకి ప్రవేశించిన తర్వాత టాఫ్ కాప్ పేరుతో ఉండే నో యువర్ మొబైల్ కనెక్షన్స్ లింక్‌లోకి ఎంటర్ కావాలి. అక్కడ కోరిన వివరాలు పొందుపరిచి, ఓటీపీ ఎంటర్ చేస్తే మీ పేరుతో ఎన్ని ఫోన్లు ఉన్నాయో కనిపిస్తాయి. అవన్నీ మీకు సంబంధించినవి కాకపోతే ప్రీ–యాక్టివేటెడ్‌విగా భావించవచ్చు. దీనిపై అదే లింకులో రిపోర్ట్ చేయడం ద్వారా వాటిని బ్లాక్ చేయించవచ్చు.

మీరు పరస్పరం ఎత్తిపొడుచుకోకండి, చెడ్డపేర్లతో పిలుచుకోకండి. ఒకనిని చెడ్డపేరుతో పిలవటం ఎంతో నీచమైన విషయం. (ఇలా చేసిన పిదప) పశ్చాత్తాప పడకుంటే, అలాంటి వారు దుర్మార్గులు.

– ఇస్లాం ధర్మం



సాక్షి

శుక్రవారం, 12 మే 2023

# సరిదిద్దలేని మహా తప్పిదాలు

ఉత్కంఠగా ఎదురుచూసిన కోర్టు తీర్పు వచ్చింది. కానీ, న్యాయం మాత్రం ఇంకా జరగాల్సి ఉంది. శివసేన రెండు ముక్కలై వీధికెక్కిన వివాదంలో అయిదుగురు సభ్యుల సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా గురువారం ఇచ్చిన తీర్పు తర్వాత పరిస్థితి అదే. ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ శిందే వర్గాల మధ్య శివసేనలో అంతర్గత కలహాలు చివరకు ప్రభుత్వ మార్పిడిగా పర్యవసించినప్పుడు మహారాష్ట్ర గవర్నర్, శాసనసభ స్పీకర్‌లు అత్యుత్సాహం చూపిన తీరును కోర్టు తీవ్రంగా తప్పు బట్టింది. వారు చట్టప్రకారం నడుచుకోలేదని కుండబద్దలు కొట్టింది. కానీ, శివ సేనను వీడి, పార్టీని శిందే రెండు ముక్కలు చేసిన సందర్భంలో సభలో బలపరీక్షకు నిలవకుండానే రాజీనామా సమర్పించిన ఉద్ధవ్ సర్కార్‌ను పునరుద్ధరిస్తూ ఆదేశాలివ్వలేమనీ పేర్కొంది. జరిగింది తప్పేనని తీర్పు చెబుతూనే, పాత తప్పును ఇప్పుడు సరిదిద్దలేమని అశక్తత వ్యక్తం చేసింది. అంటే శిందే సర్కార్ కొనసాగేలా ఇప్పటికి ఊరట నిచ్చింది. అదే సమయంలో ఉద్ధవ్ రాజీనామా చేయకుండా, సభలో బలపరీక్షకు దిగుంటే... ఆ బలపరీక్షే చట్టవిరుద్ధం గనక ఆయన సర్కారును పునరుద్ధరించే వీలుండేదని కోర్ట్ అభిప్రాయపడింది. అలా అప్పట్లో విప్‌ను ధిక్కరించిన శిందే అనర్హతకు తలుపు తెరిచే ఉంచింది.

పార్టీ అంతర్గత విభేదాల లెక్క తేల్చేందుకు నాటి మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోషియారీ శాసనసభలో బలపరీక్ష పెట్టాలని నిర్ణయించడం శుద్ధ తప్పు అనే మాట లోతైనది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్‌కు రాజకీయ పార్టీల అంతర్గత విభేదాలతో పనేమిటి? ప్రభుత్వం మద్దతు కోల్పోయినట్టు తగిన సాక్ష్యాధారాలేమీ లేకుండానే, స్వయానా గవర్నరే బలపరీక్ష జరపాలని కోరడమంటే... చట్టబద్ధమైన ప్రభుత్వాన్ని అనివార్యంగా మెజారిటీ కోల్పోయేలా చేసి, కూలిపోయేలా చూడడమే! అంటే, కారణాలేమైనా తన చర్యల ద్వారా ఒక నిర్ణీత ఫలితం వచ్చేలా చేయడమే! ఉద్ధవ్ సారథ్యంలోని 'మహా వికాస్ అఘాడీ' (ఎంవీఏ) కూటమి సర్కార్ రాజీనామాకు ఇదే కారణమైంది. ఇది గవర్నర్లు చేయాల్సిన పనేనా? ఈ కేసులో వాదనల సందర్భంగా సుప్రీమ్ ప్రస్తావించిన ఈ అంశాలు ఆలోచించాల్సినవి. కావాల్సిన పార్టీలకు అధికారం కట్టబెట్టేందుకు ఢిల్లీ పెద్దలు గవర్నర్ల వ్యవస్థను వాడుకుంటున్న విషాదానికి ఇవన్నీ మహా చిహ్నాలు.

మరోపక్క శిందే వర్గమే 'అసలైన' శివసేన అని గుర్తిస్తూ, దానికే పార్టీ చిహ్నమైన విల్లంబులను ఎన్నికల సంఘం కేటాయించడమూ తొందరపాటే. అలాగే, అసెంబ్లీ స్పీకర్ సైతం శిందే వర్గానికి అనుకూలంగా ఎన్నికల సంఘం నిర్ణయం ప్రకటించే వరకు ఆ వర్గపు ఎమ్మెల్యేలపై వచ్చిన అనర్హత ఫిర్యాదులను నానబెట్టడం మరో తప్పు. ఇలా గవర్నర్, స్పీకర్, ఎన్నికల సంఘం సహా అన్ని రాజ్యాంగ సంస్థలూ తప్పుదోవ పట్టిన తీరును సుప్రీమ్ తన తీర్పులో బలంగా ప్రస్తావించడం గమనార్హం. శివసేన కథలో తదుపరి ఘట్టం మరింత విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ముందున్న వేళ ఇవన్నీ కూడా మళ్ళీ లెక్కలోకి రాక మానవు. అలాగే, విప్ జారీ అయినా సరే చీలిక ముసుగులో పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే తిప్పలు తప్పవనీ తేలిపోనుంది. వెరసి, తాజా తీర్పు మన ప్రజాస్వామ్య వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం చూపడం ఖాయం అనిపిస్తోంది.

గతంలోకెళితే ఈ కథలో ఎన్నో మలుపులు. 2019 అక్టోబర్‌లో బీజేపీ–శివసేన కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచింది. మరిన్ని మంత్రి పదవులు, రెండున్నరేళ్ళ పాటు సీఎం పీఠం కట్టబెట్టాలని ఉద్ధవ్ సారథ్యంలోని శివసేన డిమాండ్ చేసింది. అలాంటి ఒప్పందమేదీ లేదని బీజేపీ అడ్డం తిరిగింది. దాంతో గెలిచిన పక్షం రోజులకే కూటమి విచ్ఛిన్నమైంది. కమలనాథుల సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా చేయాల్సొచ్చింది. అప్పటి నుంచి మహారాష్ట్రలో కొత్త పొత్తులు, ప్రభుత్వాలు– సీఎంల మార్పులు, కాంగ్రెస్– ఎన్సీపీ– శివసేనల 'ఎంవీఏ' కూటమి ఆవిర్భావం... ఇలా అనేకం జరిగాయి. వాటిలో భాగమే 2022 జూన్‌లో ఏకంగా శివసేన వ్యవస్థాపకుడైన బాల్‌ఠాక్రే కుమారుడూ, అప్పటి మహారాష్ట్ర సీఎం అయిన ఉద్ధవ్‌పై శిందే తిరుగుబాటు. గవర్నర్ బలపరీక్ష నిర్ణయంతో ఉద్ధవ్ జూన్ 29న రాజీనామా చేశారు. ఆ మర్నాడే బీజేపీ అండతో శిందే సీఎం కుర్చీ ఎక్కారు. శిందే, ఆయనతో బయటకొచ్చి పార్టీ తమదేనన్న మరో 15 మంది అనర్హత కథ కొన్నాళ్ళుగా కోర్టులో నలుగుతోంది.

తీర్పు నేపథ్యంలో నైతిక బాధ్యత వహించి శిందే సర్కార్ రాజీనామా చేయాలని ఉద్ధవ్ కోరుతుంటే, కోర్టు వ్యాఖ్యలెలా ఉన్నా తమను కొనసాగనివ్వడమే ప్రజాస్వామ్య విజయమని శిందే, ఫడ్నవీస్‌లు జబ్బలు చరుస్తున్నారు. విస్తృత ధర్మాసనంలో కథ ఏ కొత్త మలుపు తిరుగుతుందో చెప్పలేం. తమను కాదని ప్రత్యర్థులతో కూటమి కట్టిన మునుపటి మిత్రపక్షం శివసేనను నిలువునా చీల్చడంలో బీజేపీ ఇప్పటికే సఫలమైంది. సొంతంగా చక్రం తిప్పేందుకు అదను కోసం చూస్తోంది. అది రుచించకున్నా, బీజేపీ దోస్తీ లేకుండా శిందే సేన మనుగడ కష్టం. మరోపక్క తన వెంట మిగిలిన కొద్దిమందీ చేజారిపోకుండా కాపాడుకోవడం ఉద్ధవ్ ముందున్న సవాలు. ఈ పరిస్థితుల్లో తాజా తీర్పు ఉద్ధవ్‌కు నైతికంగా బలమిచ్చింది. కోర్టు తీర్పుతో కుర్చీ దక్కకున్నా, గవర్నర్ అవాంఛనీయ పాత్రతో ప్రత్యర్థులు అధికారం చేజిక్కించుకున్న తీరును తప్పుబట్టడమే ఊరట. అనర్హతలపై స్పీకర్ సత్వరమే నిర్ణయించాలనీ కోర్ట్ చెప్పడం గమనార్హం. అందుకే, ముందే అన్నట్టు తీర్పు వచ్చినా, న్యాయం ఇంకా జరగాల్సి ఉంది. కోర్టు లోపల ఒక దశ పోరాటం ముగిసి ఉండవచ్చు. మరోదశ మిగిలివుంది. కోర్టు బయట కూడా ఉద్ధవ్ తదితరుల నైతిక పోరాటం దీర్ఘకాలం కొనసాగుతుంది. సుప్రీమ్ వ్యాఖ్యలతోనైనా మన రాజ్యాంగ వ్యవస్థలు దిద్దలేని తప్పిదాలకు దూరంగా ఉంటాయా?

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.10.42 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** శ్రవణం ప.2.43 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** సా.6.24 నుండి 7.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.56 వరకు తదుపరి ప.12.22 నుండి 1.13 వరకు, **అమృతఘడియలు:** ఉ.5.04 నుండి 6.32 వరకు.

సూర్యోదయం : 5.33
సూర్యాస్తమయం : 6.18
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

# సంక్షోభం నేర్పుతున్న సన్నద్ధ పాఠం

విశ్లేషణ



అరుణ్ ప్రకాశ్

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం దీర్ఘకాలం కొనసాగడం భారత్‌కు సంకటంగా మారుతోంది. బ్రిక్స్, షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) వంటి ఏర్పాట్ల ద్వారా చైనా, రష్యా రెండింటితో సంబంధం కలిగి ఉండటం ఒక కారణం. క్వాడ్, మలబార్ గ్రూపింగ్ ద్వారా ఇంకోపక్క భారత్ అమెరికాతోనూ జట్టుకట్టింది. భారత్ ఏకకాలంలో అటు ఎస్‌సీఓ, ఇటు జీ20లకు అధ్యక్ష స్థానాన్ని నిభాయిస్తూండటం చెప్పుకోవాల్సిన అంశం. వ్యూహాత్మకంగా స్వతంత్రంగా ఉంటూనే ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకోవాలంటే భారత్ చాలా దార్శనికతతో వ్యవహరించాలి. వాణిజ్యం, వ్యాపారం, దౌత్యం అన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. ఈ సమన్వయం ద్వారా మిలిటరీ టెక్నాలజీలను అందిపుచ్చుకునేందుకు ప్రయత్నించాలి.

రష్యా, ఉక్రెయిన్ యుద్ధ ప్రకంపనలు ప్రపంచం నలుమూలలా వినిపిస్తున్నాయి. యుద్ధం తాలూకూ దుష్ప్రభావం కేవలం రాజకీయాలకు, ఆర్థిక వ్యవస్థలకు మాత్రమే పరిమితం కాలేదు. అన్నిచోట్లా సామాన్యుడిని సైతం ఇబ్బందిపెట్టే స్థాయికి ఈ యుద్ధం చేరుకుంది. గోధుమలు, వంటనూనెలు, ఎరువుల విషయంలో ఉక్రెయిన్ తిరుగులేని స్థానంలో ఉంది. ముడిచమురు, సహజవాయువుల్లో రష్యా పెత్తనం గురించి చెప్పనక్కర్లేదు. వీటన్నింటికీ ఏర్పడ్డ కొరత స్టాక్‌మార్కెట్లను కూల్చేస్తూంటే... పెరిగిపోతున్న ధరలు, ప్రజల్లోని అసంతృప్త రాజకీయ ఉద్యమాలను ప్రేరేపిస్తున్నాయి.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ అణ్వాయుధ ప్రయోగం గురించి మాట్లాడటం ద్వారా ప్రపంచాన్ని మూడో ప్రపంచయుద్ధం ముంగిట్లో నిలబెట్టారు. తన నిర్లక్ష్య ధోరణితో విపరీతమైన ఆస్తి నష్టానికీ కారణమయ్యారు. రష్యాపై విధించిన ఆంక్షలు ప్రపంచీకరణ ప్రక్రియను నిలిపేశాయని అనలేము. కానీ ఆహారం, ఇంధనం, సరుకులు, ఆయుధాల కోసం దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం మొదలుపెట్టడంతో కూటముల పునరేకీకరణ, భిన్న ధ్రువాల ఏర్పాటు మొదలైందని చెప్పాలి.

రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి దారితీసిన కారణాలపై చర్చలు అంతులేనంతగా సాగవచ్చు. దీనికి ముఖ్యంగా రెండు ముఖాలైతే కనిపిస్తున్నాయి. మొదటగా చెప్పుకొనే పుతిన్ వాదన గురించి చూద్దాం. ఉక్రెయిన్ అనే దేశం అసలు అస్తిత్వంలోనే లేదంటాడు పుతిన్. ఎందుకయ్యా అంటే, ''అది రష్యా చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికతల్లో అవిభాజ్యమైన భాగం'' అన్న సమాధానం వినిపిస్తోంది. ఇలాంటి వాదనలు ఇతరులపై తమ పెత్తనమే చెల్లాలని కోరుకునే చోట్ల వినిపిస్తూంటాయి. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చైనా చెప్పుకొనే 'నైన్ డాష్ లైన్' మాదిరిగా! లేదా చైనా అక్సాయ్‌చిన్ ఆక్రమణ, అరుణాచల్‌ప్రదేశ్ తమదని నిస్సిగ్గుగా చెప్పుకోవడం ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ఇంకో పక్క అమెరికా, యూరప్ విశ్వాసరహితంగా వ్యవహరిస్తున్నాయని పుతిన్ ఆరోపిస్తున్నారు. నాటో దళాలు ఒక్క అంగుళం కూడా ముందుకు కదలవని గతంలో యూఎస్ఎస్ఆర్ అధ్యక్షుడు గోర్బచేవ్‌కు ఇచ్చిన మాటను ఆయన గుర్తు చేస్తున్నారు. ఈ మాట ఇచ్చిన పదేళ్లలోనే నాటో వార్సా ఒప్పందంలో భాగమైన పది దేశాలకు సభ్యత్వం ఇచ్చి మాట తప్పిన ఆరోపణలున్నాయి. తాజాగా ఫిన్లాండ్‌కూ చోటు దక్కడంతో 31 దేశాలతో నాటో బలంగా తయారైనట్లు కనిపిస్తోంది. దీంతో తాను బలహీనమవుతున్న భావన రష్యాకు కలుగుతోంది. ఈ విషయాలెలా ఉన్నా, ఓ సార్వభౌమ దేశంపై ఏకపక్ష దాడిని రష్యా ఏ రకంగానూ సమర్థించుకోలేదు. అదే సమయంలో పాశ్చాత్య దేశాలూ ఉక్రెయిన్‌కు నిత్యం ఆయుధాలు సరఫరా చేస్తూ



యుద్ధం ఇంత సాగేలా చేయడం కూడా ఆక్షేపించదగ్గదే.

### భారత్‌కు సంకటం...

ఉక్రెయిన్‌పై దాడి వ్యూహం బెడిసికొడుతున్న నేపథ్యంలో రష్యాకు ఇప్పుడు అత్యవసరంగా స్నేహితుల అవసరం ఏర్పడుతోంది. ఈ అవసరాన్ని కాస్తా చైనా తీర్చింది. షీ జిన్‌పింగ్ ఇప్పుడు పక్కాగా రష్యా వైపు నిలబడ్డారని చెప్పవచ్చు. ఫలితంగా ఇకపై చైనాకు రష్యా నుంచి ఆటంకాలు ఎదురుకాకపోవచ్చు. అయితే ఈ క్రమంలో రష్యా కాస్తా చైనా గుప్పిట్లో చిక్కుకునే అవకాశం ఉందా! అదే జరిగితే రష్యా ఇప్పటివరకూ పలు దేశాలతో, మరీ ముఖ్యంగా భారత్‌తో స్వతంత్రంగా నడుపుతున్న సంబంధాలపై చైనా ప్రభావం పడుతుంది. మిలిటరీ అవసరాలను తీర్చే సామర్థ్యం తగ్గిపోయిన నేపథ్యంలో భారత విధాన రూపకర్తలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఇది. ఇటీవల పూంఛ్‌లో మిలిటరీ దళాలపై జరిగిన దాడి... పాకిస్తాన్ ఆర్మీ, ఐఎస్ఐ ఇప్పటికీ ఉగ్రవాదానికి కలిసికట్టుగా ఊతమిస్తున్న విషయాన్ని స్పష్టం చేస్తోంది.

### స్థిర నిర్ణయానికి సమయం ఇదే...

రెండువైపుల నుంచి ఎదురవుతున్న ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ ఒక స్థిర నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. విధానాలతోపాటు ప్రాథమ్యాల పునః సమీక్ష అవసరం. దౌత్య సంబంధాల అజెండాలో టెక్నాలజీ సముపార్జనను కూడా భాగం చేయడం తక్షణ కర్తవ్యం. జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన 'క్వాడ్ అండ్ మలబార్ గ్రూపింగ్' అనేది అమెరికా, భారత్ వ్యూహాత్మక అవసరాలు కలియడం ఫలితంగా పుట్టుకొచ్చింది. మిలిటరీ, దౌత్య అవసరాలను తీర్చేందుకు మాత్రమే ఇవి ఉపయోగపడుతున్నట్లు కనిపిస్తున్నా ప్రభావం చాలా ఎక్కువే. చైనా తరచూ క్వాడ్‌ను ఉద్దేశించి బెదిరింపులకు దిగడం ఈ గ్రూపింగ్‌ను తన ఆధిపత్య ప్రణాళికలకు గండి కొట్టేదిగా చూడటమే కారణం. అయితే చైనా బెదిరింపులకు కౌంటర్ ఇచ్చే విషయంలో అమెరికా మినహాయించి మిగిలిన దేశాలు తటపటాయించాయి. తమ గ్రూపింగ్ వల్ల భద్రతాపరమైన ప్రభావాలేవీ ఉండవనీ, తమది 'ఆసియా నాటో' కూటమి కాదనీ చెప్పేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఈ పరిస్థితిని మార్చి, పదును పెరిగేలా భారత్ చొరవ తీసుకోవాలి.

ఈ విషయంలో అమెరికా చేపట్టిన రెండు పనుల గురించి ప్రస్తావించాలి. 2021 సెప్టెంబరులో ఆస్ట్రేలియా, యూకే, అమెరికా కలిసి త్రైపాక్షిక భద్రత ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం అమెరికా, బ్రిటన్ రెండూ ఆస్ట్రేలియాతో అత్యాధునిక టెక్నాలజీలను పంచుకుంటాయి. అణ్వస్త్ర సామర్థ్యమున్న జలాంతర్గామిని పొందే విషయంలో కూడా సాయం అందిస్తాయి. యూకే, అమెరికా అణు జలాంతర్గాములను ఆస్ట్రేలియాలో మోహరించడంతోపాటు అణ్వాయుధాల విషయంలో ఆస్ట్రేలియా సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకూ ఏర్పాట్లు జరిగాయి. ఆశ్చర్యకరంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు బాగానే ఉన్నప్పటికీ అణు జలాంతర్గాముల విషయంలో భారత్‌కు అమెరికా ఇలాంటి సౌకర్యాలేవీ కల్పించడం లేదు. ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం, చారిత్రాత్మక పౌర అణు ఒప్పందం వంటివేవీ అక్కరకు రాలేదు. అయితే అమెరికా 2022 మే నెలలో 'క్రిటికల్ ఇంజినీరింగ్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్' పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇది మనకు అనుకూలమైన ఫలితాలేమైనా సాధిస్తుందా అన్నది వేచి చూడాలి.

మనది అణ్వాయుధాలు కలిగిన దేశం. అంతరిక్ష రంగంలోనూ అగ్రస్థానంలో ఉంది. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద మిలటరీ వ్యవస్థను కలిగి ఉంది. అయినా... మిలిటరీ విషయంలో మన ప్రయత్నాలు పూర్తిస్థాయిలో లేవనే చెప్పాలి. దిగుమతులపై ఆధారపడే దేశంగానే మిగిలిపోయాం. ఆత్మ నిర్భరత సాధించడం అనేది చాలా ఉదాత్తమైన లక్ష్యమే కానీ, ఒక్క టెక్నాలజీని అభివృద్ధి చేయాలన్నా చాలా సమయం పడుతుంది. ఈ విషయంలో చైనా నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. 1960లు మొదలుకొని ఇప్పటివరకూ ఆ దేశం ఏకైక లక్ష్యంతో పనిచేస్తోంది. రివర్స్ ఇంజినీరింగ్, బెదిరింపులు, కొన్నిసార్లు దొంగతనాలకూ వెనుకాడకుండా యూఎస్ఎస్ఆర్, పాశ్చాత్య దేశాల నుంచి టెక్నాలజీలను సముపార్జించుకునే ప్రయత్నాలు చేసింది.

ఈ నేపథ్యంలో ఒక్క మాట సుస్పష్టం. ఇకనైనా భారత్ వాణిజ్యం, వ్యాపారం, దౌత్యం అన్నింటినీ పరిగణలోకి తీసుకుని సమీకృత పద్ధతిలో ఇతర దేశాలతో వ్యవహరించడం అలవాటు చేసుకోవాలి. ఈ సమన్వయం ద్వారా మిలిటరీ టెక్నాలజీలను అందిపుచ్చుకునేందుకు ప్రయత్నించాలి. తద్వారా మాత్రమే భారత్ పూర్తిస్థాయిలో ఆత్మనిర్భరత సాధించగలదు.

వ్యాసకర్త భారత నావికాదళ విశ్రాంత ప్రధానాధికారి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### అనైతికం కామన్



మహారాష్ట్ర కథ: ఇంతకుముందు పడిపోయిన ప్రభుత్వం చట్టబద్ధమైనది, కానీ అనైతికమైనది. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కూడా చట్టబద్ధమైనది, కానీ అనైతికమైనది.

– కమలేష్ సింగ్, విశ్లేషకుడు

### మళ్లీ పాలించొచ్చు



పాకిస్తాన్ సైన్యం స్వదేశంలో ఎప్పుడూ ఏ యుద్ధాన్నీ ఓడిపోలేదు. నేననుకోవడం, క్రమంగా వాళ్లు దీన్ని కూడా జయిస్తారు.

– విక్రమ్ సూద్, మాజీ నిఘా అధికారి

### పోరాటం మొదలైంది



జీవితంలోని మంచిచెడ్డలను దేవుడి దయగా మనం అంగీకరించినప్పుడు ప్రతిదీ నదీ ప్రవాహంలా సాగిపోతుంది. దేవుడి సంకల్పానికి లోబడుతున్నాం. 'రజా మే రాజీ'. ఆమెకు మొదటి కీమోథెరపీ జరిగింది. (సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.)

– నవజ్యోత్ సింగ్ సిద్ధూ, క్రికెటర్, కాంగ్రెస్ నాయకుడు

### ఏమీ మిగలదు



మనం చనిపోయి, మన మెదడు కుళ్లిపోవడం మొదలు కాగానే మన జ్ఞాపకాలు గాల్లో కలిసిపోతాయి. చెప్పాలంటే చనిపోయిన 5–10 నిమిషాల్లో మెదడు అన్ని జ్ఞాపకాలను డిలీట్ చేసి ఫార్మాట్ అవుతుంది. అందుకే లేని ఆత్మ గురించిన మతాల ఉపదేశాల బారినపడొద్దు. చావు అనేది అంతం, దాని తర్వాత ఏమీలేదు.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

### వెదురు వంటకం



అరుణాచల్ ప్రదేశ్ నుంచి ఇప్పుడే తాజా వెదురు చివుళ్ళు వచ్చాయి. ఇవి చాలా ఆరోగ్యకరమైనవీ, విలువైనవీ. అందుకే వాటిని నేనే సిద్ధం చేస్తున్నాను. అరుణాచల్‌ప్రదేశ్‌కు వచ్చే పర్యాటకులంతా వీటితో చేసిన వంటకాలను తప్పకుండా రుచి చూడాలి.

– కిరణ్ రిజిజు, కేంద్ర న్యాయశాఖ మంత్రి

### అసలు భారతం



ఇవ్వాళ పారిశ్రామికవేత్త అజీమ్ ప్రేమ్‌జీని కలిసినప్పుడు ఒక హృద్యమైన సంఘటన చెప్పారు. ఇటీవల ఒక గ్రామ పర్యటనలో ఆయనొక అమ్మాయిని "ఎవరు నువ్వు? ఏం చేస్తుంటావు?" అని అడిగారు. దానికి బదులుగా "నాకు ఆకలేస్తోంది" అని ఆమె చెప్పింది. ఈ విషయం చెప్పి ప్రేమ్‌జీ అన్నారు: మార్పు దిశగా మనం పనిచేయాల్సిన ఇండియా ఇదీ!

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

### కర్మ ఫలం



నా జీవితమంతా పాకిస్తాన్ టీవీ ఛానళ్లలో జమ్ము–కశ్మీర్ కోసం భారత సేనలకు వ్యతిరేకంగా దేశభక్తి గేయాలు విన్నాను. కానీ మొదటిసారి అవే దేశభక్తి గేయాలను పాకిస్తాన్ సేనలకు వ్యతిరేకంగా పాకిస్తానీయులు పాడటం వింటున్నాను. ఇదే 'కర్మ'. పాకిస్తానీయులు మొదటిసారి సైన్యం నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నారు.

– నూర్ దాహ్రీ, పరిశోధకుడు

ఇన్‌బాక్స్

## మన నర్సులే మన భవిష్యత్తు

'మన నర్సులు మన భవిష్యత్తు' నినాదాన్ని ఈ ఏడాది అంతర్జాతీయ నర్సుల మండలి ప్రపంచం ముందు ఆవిష్కరిస్తోంది. ఈ సంస్థ గత ఐదు దశాబ్దాలుగా 'ఫ్లోరెన్స్ నైటింగేల్' పుట్టిన రోజైన మే 12ను అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహిస్తోంది. గత నాలుగేళ్ళుగా కోవిడ్ 19 మహమ్మారి సృష్టించిన విలయతాండవం నుంచి అంతర్జాతీయ సమాజం ఎన్నో పాఠాలు నేర్చుకుంది. ఈ అనుభవాలను భవిష్యత్ ప్రణాళికగా రూపొందించి ప్రపంచం ముందుంచడం తక్షణ కర్తవ్యంగా మండలి ఈ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తోంది.


ఆరోగ్య సంరక్షణలో అత్యంత ముఖ్యమైన వ్యక్తులు కేవలం వైద్యులే కాదనీ, నర్సులూ ఉన్నారనీ ప్రపంచ ఆరోగ్యసంస్థ వెల్లడించింది. ఈ దినోత్సవం గతించిన వారికి నివాళిగా, వృత్తిలో కొనసాగుతున్న వారికి ప్రోత్సాహంగా నిలుస్తుంది. స్ఫూర్తిప్రదాతగా నిలిచిన ఆధునిక నర్సింగ్ స్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్... భయంకరమైన 'క్రిమియా' యుద్ధంలో నర్సుల శిక్షకురాలిగా పనిచేసి ఎన్నో ప్రాణాలను కాపాడారు. ఆమె సాహసమే నేడు నర్సింగ్ వృత్తికి గౌరవాన్ని తీసుకొచ్చింది. ఆమె త్యాగమే నర్సులకు రక్షణ వలయంగా మారింది. ఇదే బాటలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎన్నో మార్గదర్శకాలను జారీ చేసింది.

'స్టేట్ ఆఫ్ ది వరల్డ్ నర్సింగ్ రిపోర్ట్' ప్రచురణలను విడుదల చేయడం ద్వారా అంతర్జాతీయ నర్సింగ్ కౌన్సిల్ ప్రపంచంలో చోటు చేసుకుంటున్న వైద్య సేవల్లో మార్పునకు ఆధారాలను చూపించగలిగింది. ఈ నేపథ్యంలోనే నర్సింగ్‌కు తగిన ప్రాధాన్యంను ఇవ్వాలని నర్సింగ్ మండలి అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీలా సిప్రియానో ప్రపంచ సంస్థలను కోరారు. ప్రపంచ మానవాళి భవిష్యత్తు ప్రతి నర్సు స్వరంపై ఆధారపడి ఉందనీ, సమాజంలో మార్పు తీసుకురావడంలోనూ తొలి వరుసలోనే వున్నారనీ నర్సుల సేవలను ఆమె కొనియాడారు.

– జి. యోగేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్
(నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం)

# మంది కోసం గాదు... మంత్రుల కోసమే!

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల లైటు బుగ్గలు ఎల్గినయి. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ.

''కుర్సిల గూసోని కేసీఆర్ కాల్లు ఊప్తడు ఎందుకో ఎర్కేనా?'' అని యాద్గిరి అడిగిండు.

''ఎందుకూప్తడు?'' అని సత్నారి అడిగిండు.

''కాల్లను మొక్కుమనేతందుకు.''

''గందుకేనా గీ నడ్మ మంత్రులు, ఎమ్మెల్యేలు ఒకలెన్క ఒకలు గాయిన కాల్లు మొక్కింద్రు.''

''అవ్.''

''నాకెర్క లేక అడుగుతున్న. మంత్రులు, ఎమ్మెల్యేలు ముక్యమంత్రి కాల్లు ఎందుకు మొక్కింద్రు?''

''ఫిన్లాండుల నిద్రబోయినా జీతమిస్తరు.''

''గా దాన్కి గీ దాన్కి సంబంధమేమున్నది?''

''జెనం గురించి ఏం చెయ్యకపోయినా కాల్మొక్తె సాలు కేసీఆర్ ఏదన్న కుర్సి అన్న ఇస్తడు. ఎమ్మెల్యే టికిట్ అన్న ఇస్తడు. కాల్మొక్కకుంటె ఏం జేసినా లాబం లేదు.''

''ఒక పురానం పంతులు పురానం జెప్పకుంట ఎవ్వలు ఉల్లిగడ్డ దినొద్దు. ఉల్లి గడ్డ దింటె పాపమొస్తది. పెయ్యి కరాబైతది అని చెప్పిండట. పురానం జెప్పినంక గాయిన ఇంటికి బోయిండు. గాయిన పెండ్లాం పెసరట్టు జేసింది. గని గివ్విట్ల ఉలిగడ్డ ఎయ్యలేదు. పెసరట్లల్ల ఉల్లిగడ్డ ఎందుకు ఎయ్యలేదని గాయిన పెండ్లాంను అడిగిండు. మీరే గదా ఉల్లిగడ్డ దినొద్దని జెప్పింద్రు అని గామె అంటె ఉల్లిగడ్డ దినొద్దని మందికి జెప్పిన గని మనకు గాదు అని అన్నడట.''

''గిప్పుడు గీ కత ఎందుకు జెప్పినవ్?''

''గా పురానం పంతులు లెక్కనే కేసీఆర్ జేస్తున్నడు.''

''గదెట్ల?''

''సంటర్ ప్రబుత్వ రంగ సంస్తలను ప్రైవేటోల్లకు ఇస్తున్నది. ఏ సర్కార్ ప్రబుత్వరంగ సంస్తలను ప్రైవేట్ సంస్తలకు ఇయ్యొద్దు. మా సర్కార్ ప్రైవేటీకరనకు కిలాఫ్ అని ఒక దిక్కు అనుకుంటనే, ఇంకోదిక్కు ఔటర్ రింగు రోడ్డును ప్రైవేట్‌కు లీజుకిస్తున్నడు. బంగారి బాతును కోస్తున్నడు.''

''గీనడ్మ డిల్లీల బీఆర్ఎస్ పార్టీ ఆపీస్ షురువు జేసింద్రట గదా.''

''అవ్.''

''రిబ్బన్ కటింగ్‌ను ధూమ్ దామ్గ జేద్దామనుకున్నరు.



అన్ని పార్టీల లీడర్లు వొస్తరనుకున్నరు. గని ఎవ్వలు రాలే. అన్ని పార్టీల లీడర్లు వొస్తరనుకోని అన్ని పేపర్ల విలేకర్లను బిల్సింద్రు. విలేకర్లు బోయింద్రు గని పార్టి ఆపీస్లకు రాకుంట గాల్లను ఎల్లిగొట్టింద్రు.''

''విలేకర్లను ఎందుకెల్లగొట్టింద్రు?''

''బీఆర్ఎస్ పార్టీ ఆపీస్లకు విలేకర్లను రానిస్తె ఏఏ పార్టీల లీడర్లు వొచ్చింద్రో ఎవరు రాలేదో గాల్లు రాస్తరు. జెనంకు నిజమెర్కైతది.''

''డిల్లీల ఉన్న తెలంగాన బవన్‌ను మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు ఒక్క తీర్గ తారీఫ్ జేసిండట గదా.''

''తెలంగాన బవన్ల ఉన్న అర్రలను జూసి పసులు మురుస్తున్నయట.''

''పసులు మురుసుడెందుకు?''

''గా అర్రలు పసుల కొట్టంల తీర్గనే ఉన్నందుకు. పసులు మురుస్తుంటె గా అర్రలను జూసి డిల్లీల ఉన్న సులబ్ కాంప్లెక్సులు గల్ల ఎగిరేస్తున్నయట.''

''గల్ల ఎందుకెగ్రేస్తున్నయి?''

''తెలంగాన బవన్ అర్రల కన్న గవ్వే మంచి గున్నందుకు.''

''సెక్రెటేరియట్లకు జెనాలను, విలేకర్లను, ఆకర్కి ఎమ్మెల్యేలను గూడ ఎందుకు బోనిస్తలేరు?''

''గీ సవాల్‌కు కేటీఆర్ జవాబ్ జెప్పిండు.''

''ఏమని జెప్పిండు?''

''సెక్రెటేరియట్ అంటె సచివాలయం. సచివాలయం సచివుల ఆలయం. సచివులు అంటె మంత్రులు. మంత్రుల ఆలయంలకు మంత్రులనే రానిస్తరు. కడ్మోల్లను ఎందుకు రానిస్తరు అని కేటీఆర్ అన్నడు''.

''మొన్న ప్రియాంక గాంది పట్నమొచ్చింది. సరూర్ నగర్‌ల పబ్లిక్ మీటింగ్ బెట్టింద్రు. గా మీటింగ్‌కు కాంగ్రెస్ లీడర్లందరు వొచ్చింద్రు. ప్రియాంక స్పీచ్ గొట్టుకుంట తొమ్మిదేండ్లయినా తెలంగానల సద్వుకున్న పోరగాల్లకు కొల్వులు లేవు అని అన్నది.''

''తొమ్మిదేండ్ల సంది కాంగ్రెస్ లీడర్లకు గూడ కొల్వులు లేవు.''


గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

## మనసు కిటికీ

ఓ వయోవృద్ధుడు ఆశ్రమంలో నివసిస్తున్న ఒక గురువుగారి దగ్గరకు వెళ్లి 'స్వామీ! ఇది వరకటిలా మా ఇంటి కిటికీ నుంచి బయటి ప్రకృతి అందాలను చూడలేకపోతున్నాను. నా కంటి చూపు మందగిస్తోందనిపిస్తోంది. ఏదో ఒకరోజు కంటి చూపు పూర్తిగా కోల్పోతానేమోనని భయం పట్టుకుంది. అలాగే భగవంతుడిని నిలకడగా స్మరిస్తూ ధ్యానం చేయలేకపోతున్నాను. వయసు మీదపడటమే ఇందుకు కారణమా?' అని అడిగాడు.

అందుకు గురువుగారు 'ఒకసారి మీ ఇల్లు చూద్దాం పద' అని వృద్ధుని ఇంటికి వెళ్లారు. గురువుగారు వృద్ధుడు ఉంటున్న గదిని నిశితంగా పరిశీలించారు. అనంతరం ఓ



జ్యోతిర్మయం

బక్కెట్టుతో నీరు, ఓ గుడ్డ ముక్క తెమ్మన్నారు. ఆయన గుడ్డముక్కను నీటిలో ముంచి గది బయటకు వెళ్ళి అద్దాల కిటికీని తడిగుడ్డతో తుడిచారు. ఆ తర్వాత ఓ పొడి గుడ్డతో తుడిచారు. ఇప్పుడు ఆ పెద్దాయనకు బయటున్న చెట్లు, పువ్వులు, ఆకాశమూ అన్నీ స్పష్టంగా కనిపించాయి. కిటికీ తుడుచుకోవాలనే ఆలోచన తనకు రానందుకు ఆ పెద్దాయన సిగ్గుపడ్డాడు.

అలాగే భగవంతుని ఏకాగ్రతతో ధ్యానం చేయలేకపోవడానికి వయస్సు మీద పడటం కారణం కానేకాదనీ, మనసులో ఉన్న కోపం, అసూయ వంటివాటివల్ల ఏకాగ్రత కుదరడం లేదనీ గురువుగారు చెప్పారు.

– యామిజాల జగదీశ్

# ఏసీకి ఫ్యాన్స్!



రైల్లో థర్డ్ ఏసీ బెర్తులకు పెరిగిన డిమాండ్

- ➤ సెకండ్ ఏసీ ప్రయాణికుల సంఖ్యలోనూ పెరుగుదల
- ➤ సౌకర్యవంతమైన ప్రయాణం వైపు జనం చూపు
- ➤ ఇందుకు అనుగుణంగా ఏసీ బోగీలను పెంచిన దక్షిణ మధ్య రైల్వే
- ➤ ఇదే సమయంలో స్లీపర్ క్లాస్ బోగీల కుదింపు
- ➤ ముమ్ముందు అన్నీ ఏసీ రైళ్లే ఉంటాయంటున్న రైల్వే వర్గాలు

సాక్షి, హైదరాబాద్: రైలు ప్రయాణం అంటేనే హడావుడి. త్వరగా బయలుదేరి రైలు అందుకోవడం.. ఏ మూలనో కాసింత చోటు సంపాదించుకుని హమ్మయ్య అనుకోవడం.. రోజుల తరబడి వెయిటింగ్ లిస్టులో ఉన్నవారు చివరికి ఏదో ఒక బెర్త్ కన్ఫర్మ్ అయితే చాలు అని ఆశపడటం ఇన్నాళ్లుగా కనిపించేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. సౌకర్యవంతమైన ప్రయాణానికి జనం మొగ్గు చూపుతున్నారు. జనరల్, నాన్ ఏసీ స్లీపర్ క్లాస్ బోగీల కంటే.. ఏసీ బోగీల్లో ప్రయాణానికి ఆసక్తి చూపుతున్నారు. దూరంతో, కాలంతో సంబంధం లేకుండా వేసవిలోనైనా, చలికాలంలోనైనా.. ఏసీ కోచ్‌లో సీట్లు దొరికాకే ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. ఒంటరిగా ప్రయాణించినప్పుడు ఏదో ఒక బోగీలో ప్రయాణం చేసినా.. ఇంటిల్లిపాది కలిసి వెళితే మాత్రం ఏసీపై దృష్టిపెడుతున్నారు.

సాధారణ స్లీపర్ చార్జీలతో పోల్చుకుంటే ఏసీ ప్రయాణానికి చార్జీలు చాలా ఎక్కువే. ఫస్ట్, సెకండ్ ఏసీ బోగీలకైతే చాలా ఎక్కువ. అయితే అటు సౌకర్యం, ఇటు కాస్త అందుబాటులో ఉండటంతో థర్డ్ ఏసీ బోగీల్లో ప్రయాణానికి జనం మొగ్గుచూపుతున్నారు. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి స్లీపర్ క్లాస్ చార్జీ రూ.450 వరకు ఉంటుంది. అదే థర్డ్ ఏసీలో రూ.1,100 వరకు ఉంటుంది. అయినా 12 గంటల పాటు ప్రయాణం కావడంతో టికెట్ ధర ఎక్కువే అయినా వీటిలో ప్రయాణిస్తున్నారు.

**థర్డ్ ఏసీకి ప్రాధాన్యం..**

ఇక ఏసీ బోగీల్లో దుప్పట్లు, బెడ్‌షీట్లు అందజేయడం, రెండు వైపులా డోర్‌లు లాక్ చేసే సదుపాయం వల్ల ప్రయాణంలో భద్రత ఉంటుందనే భరోసా.. రాత్రంతా ప్రశాంతంగా నిద్రించి ఉదయాన్నే గమ్యస్థానానికి చేరుకొనే అవకాశం ఉంటాయి. కొన్నిరైళ్లలో ఏసీ బోగీల్లో ఐఆర్‌సీటీసీ కేటరింగ్ సదుపాయం కూడా లభిస్తోంది. దక్షిణ మధ్య రైల్వేలో ప్రతిరోజు సుమారు 650 రైళ్లు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుండగా.. వీటిలో 230కిపైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. ఈ రైళ్లలో ప్రతిరోజు లక్షకుపైగా థర్డ్ ఏసీ బెర్తులు భర్తీ అవుతున్నట్టు అంచనా. సెకండ్ ఏసీ, ఫస్ట్ ఏసీ చార్జీలు బాగా ఎక్కువే అయినా.. దూర ప్రాంత ప్రయాణాల్లో సెకండ్ ఏసీకి కూడా డిమాండ్ పెరుగుతోంది. ఇవి రోజూ సుమారు 30 వేల బెర్తులు భర్తీ అవుతున్నట్లు అంచనా.

**స్లీపర్ బోగీలు తగ్గిస్తూ..**

అన్ని ప్రధాన రైళ్లలో స్లీపర్ కోచ్‌లను తగ్గించి థర్డ్ ఏసీ బోగీలను పెంచుతున్నారు. గతంలో 1.5 లక్షల వరకు స్లీపర్ బెర్తులు అందుబాటులో ఉంటే.. ఇప్పుడవి లక్షకు తగ్గినట్టు అంచనా. ఇదే సమయంలో ప్రయాణికుల డిమాండ్‌కు తగినట్టు థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ బెర్తులు పెంచారు. హైదరాబాద్ నుంచి విశాఖ, బెంగళూరు, ముంబై, దానాపూర్, రెక్సాల్, భువనేశ్వర్ తదితర రూట్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువ. ఈ రూట్లలో నడిచే రైళ్లలో స్లీపర్ బెర్తుల సంఖ్య సగానికి సగం తగ్గించినట్టు సమాచారం. ''స్లీపర్ బోగీలకు డిమాండ్ లేదని చెప్పలేం. దిగువ మధ్య తరగతి, సాధారణ ప్రయాణికులకు తమ బడ్జెట్‌లో ప్రయాణ సదుపాయాన్ని అందజేసేవి స్లీపర్ క్లాస్ బోగీలే. కానీ ఇటీవల కాలంలో ఏసీ వైపు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు..'' అని దక్షిణ మధ్య రైల్వే అధికారి ఒకరు వెల్లడించారు.

**ఇక ముందు అన్నీ ఏసీ రైళ్లే..**

రానున్న కాలంలో పూర్తిగా ఏసీ రైళ్లు మాత్రమే పట్టాలెక్కనున్నట్టు రైల్వే శాఖ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన వందేభారత్ రైళ్లు విజయవంతంగా పరుగులు తీస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖ, తిరుపతి పట్టణాలకు వంద శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. డిమాండ్ బాగుండటంతో తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో బోగీల సంఖ్యను పెంచుతూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. త్వరలో బెంగళూరుకు వందేభారత్ అందుబాటులోకి రానుంది. అలాగే ఢిల్లీ, ముంబై తదితర నగరాలకు కూడా పూర్తి ఏసీ సదుపాయం ఉన్న వందేభారత్ రైళ్లను నడపనున్నారు.

| దక్షిణ మధ్య రైల్వే గణాంకాలివీ.. ప్రతి రోజు వచ్చే ఆదాయం: రూ.10 కోట్లు | మొత్తం ప్రయాణికుల రైళ్లు: 650 | రోజూ రాకపోకలు సాగించే ప్రయాణికులు | స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించేవారు | ఏసీ బోగీల్లో ప్రయాణించేవారు | థర్డ్ ఏసీ ప్రయాణికులు | సెకండ్ ఏసీ ప్రయాణికులు | ఫస్ట్ ఏసీ ప్రయాణికులు |
|---|---|---|---|---|---|---|---|
| | | 10.50 లక్షలు | 2.50 లక్షలు | 1.50 లక్షలు | 1.10 లక్షలు | 30వేలు | 10వేల లోపు |

# వైద్యంలో రాష్ట్రాన్ని నంబర్‌వన్ చేయాలి

- అధికారులకు మంత్రి హరీశ్‌రావు సూచన
- బోధనాసుపత్రులపై వీడియో కాన్ఫరెన్స్
- 22న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామక పత్రాలు
- అమెరికా నుంచీ విధులు నిర్వహిస్తున్న మంత్రి



సాక్షి, హైదరాబాద్: వ్యక్తిగత పర్యటన కోసం అమెరికా వెళ్లిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అక్కడి నుంచి కూడా విధులు నిర్వహిస్తుండటం విశేషం. గురువారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బోధనాస్పత్రులపై సమీక్ష నిర్వహించారు. 65 మందికి ప్రొఫెసర్లు, 210 మందికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇచ్చామని మంత్రి తెలిపారు. అలాగే 1,061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేసినట్లు వివరించారు. వీరికి నియామక ఉత్తర్వులను ఈనెల 22న శిల్పకళా వేదికలో జరిగే కార్యక్రమంలో అందజేస్తామన్నారు. వీరందరి సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకొని ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. వైద్య, ఆరోగ్య రంగంలో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉందని, రాష్ట్రాన్ని ఈ రంగంలో మొదటి స్థానానికి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు. మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ విద్యార్థులకు టీచింగ్ ఫ్యాకల్టీ ఆదర్శంగా ఉండాలని ఆయన సూచించారు. ర్యాగింగ్ లాంటివి లేకుండా చూడాలన్నారు. కాగా, విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న 900 మంది తెలంగాణ విద్యార్థులకు ఒక ఏడాది ఇంటర్న్ షిప్ కోసం రాష్ట్రవ్యాప్తంగా కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా పోస్టింగులు ఇచ్చామని ఆయన తెలిపారు.

**డ్యూటీ డాక్టర్లు కచ్చితంగా ఉండాలి..**

24 గంటలూ.. మరీ ముఖ్యంగా రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్లు ఉండాలని హరీశ్‌రావు సూచించారు. ఎమర్జెన్సీ విభాగంలో డ్యూటీ డాక్టర్లు కచ్చితంగా ఉండాలని కోరారు. ముహూర్తాలు చూసి ప్రసవాలు చేయకూడదని, గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని బట్టి సాధారణ లేదా సీ సెక్షన్ డెలివరీ చేయాలని స్పష్టం చేశారు. ఐదు లక్షల రూపాయలకు పైబడి విలువ చేసే వైద్య పరికరాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. అలాగే అన్ని వైద్య పరికరాలు పని చేసేలా చూసుకోవాల్సిన బాధ్యత సూపరింటెండెంట్లదేనన్నారు. ఈ సమీక్షలో వైద్యాధికారులు రిజ్వీ, రమేశ్ రెడ్డి, శ్వేతా మహంతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### సీపీఆర్‌తో నిలిచిన గర్భిణి ప్రాణం

భైంసా ఏరియా ఆస్పత్రి వైద్యుల కృషి



స్పృహలోకి వచ్చిన గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యులు

భైంసాటౌన్: నిర్మల్ జిల్లా భైంసా ఏరియా ఆస్పత్రిలో ఇటీవల మహిళకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన వైద్యులు.. గురువారం ఓ గర్భిణికి కూడా ప్రాణాలు నిలబెట్టారు. భైంసా పట్టణంలోని కుంట ఏరియాకు చెందిన ఫాతిమా ఐదు నెలల గర్భిణి. వైద్య తనిఖీ కోసం తన అక్కతో కలిసి ఏరియాస్పత్రికి వచ్చి ఒక్కసారిగా కుప్పకూలింది. అక్కడే ఉన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ వెంటనే స్పందించి వైద్యులు సుమల, రమేశ్‌రాథోడ్‌ను అప్రమత్తం చేశారు. గర్భిణిని పరీక్షించి రక్తపోటు, షుగర్, నాడి పడిపోయినట్లు గుర్తించి వెంటనే సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి ఆమె స్పృహలోకి వచ్చింది. ఇంతలో మరోమారు గర్భిణి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో దాదాపు 15 నిమిషాలపాటు శ్రమించి ఆమె ప్రాణాలు నిలిబెట్టినట్లు వైద్యులు పేర్కొన్నారు.

### బీసీ యువతకు సబ్సిడీ రుణాలివ్వాలి: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ: జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ బీసీ యువతకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కృష్ణయ్యను బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ కలిసి సబ్సిడీ రుణాల మంజూరుపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయ శాఖ ద్వారా రెండు రాష్ట్రాల బీసీ కార్పొరేషన్లకు రూ.300 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు. ఎంపీ కృష్ణయ్య స్పందిస్తూ త్వరలో ఢిల్లీ వెళ్లి ఈ అంశంపై కేంద్రమంత్రితో చర్చిస్తానని చెప్పారు.

### హరీశ్‌కు సప్లిమెంటరీలో అవకాశం

సాక్షి, హైదరాబాద్: కమలాపూర్ జెడ్పీ హైస్కూల్ నుంచి పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం వాట్సాప్‌లో చక్కర్లు కొట్టిన వ్యవహారంలో ఐదేళ్లపాటు డిబార్‌కు గురైన విద్యార్థి దొండబోయిన హరీశ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. రెగ్యులర్ పరీక్షల సమయంలో రాయలేకపోయిన రెండు (ఇంగ్లిష్, మ్యాథ్స్) పరీక్షలను సప్లిమెంటరీలో రాసుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 5న హరీశ్ హిందీ పరీక్ష రాస్తుండగా శివాజీ అనే వ్యక్తి వచ్చి ప్రశ్నపత్రాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకున్నాడు. దీనిపై కేసు కూడా నమోదైంది. తర్వాత ఇంగ్లిష్ పరీక్ష రాసేందుకు హరీశ్ పరీక్ష కేంద్రానికి వెళ్లాడు. అతడి దగ్గరున్న హాల్‌టికెట్‌ను తీసుకున్న డీఈవో పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వలేదు. దీనిపై హైకోర్టును ఆశ్రయించిన హరీశ్.. సైన్స్, సోషల్ పరీక్షలు రాసేందుకు అనుమతి పొందాడు. అప్పటికే ఇంగ్లిష్, మ్యాథ్స్ పరీక్షలు ముగిశాయి. దీంతో వీటిని సప్లిమెంటరీలో రాసుకునే అవకాశం ఇవ్వాలని హరీశ్ తండ్రి డి.రాజు గురువారం వెకేషన్ బెంచ్ ముందు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సుధీర్‌కుమార్ విచారణ చేపట్టి మిగిలిన రెండు పరీక్షలను సప్లిమెంటరీలో రాసేందుకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# గోల్కొండ కోటపై కాంగ్రెస్ జెండా

- వచ్చే నాలుగు నెలల్లో రాష్ట్రంలో అధికార మార్పు ఖాయం
- పీపుల్స్ మార్చ్ యాత్రలో భట్టి ధీమా



పీపుల్స్ మార్చ్ యాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

శంషాబాద్ రూరల్: వచ్చే నాలుగు నెలల్లో రాష్ట్రంలో అధికార మార్పు తథ్యమని, గోల్కొండ కోటపై కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడుతుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. పీపుల్స్ మార్చ్ యాత్ర గురువారం మండలంలోని నర్కూడ, మల్కారం, కవేలిగూడ చౌరస్తా మీదుగా సాగింది. ఆయా చోట్ల ప్రజలను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు విధానాన్ని ఎత్తివేస్తామని హామీనిచ్చారు. హైదరాబాద్, వరంగల్ డిక్లరేషన్లను వంద శాతం అమలు చేస్తామని చెప్పారు. శంషాబాద్ మండలంలోని ఘాంసిమియాగూడలో 700 ఎకరాల్లో ఉన్న గోల్డ్‌స్టోన్ కంపెనీ అక్రమాలపై పోరాడుతామని, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. బహదూర్‌గూడ, కొత్వాల్‌గూడలోని విలువైన భూముల రైతులను రాష్ట్ర ప్రభుత్వం ధరణి పేరిట దగా చేస్తోందని ఆరోపించారు. ఆయా గ్రామాల్లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు పట్టా పాసు పుస్తకాలు పంపిణీ చేస్తే.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ భూములను కొల్లగొట్టేందుకు ధరణి పేరుతో కుట్రకు పాల్పడుతోందని విమర్శించారు.

# బీఆర్‌ఎస్, బీజేపీ బంధం బలమైనది: ఆర్‌ఎస్పీ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ–టీఆర్‌ఎస్ బంధం బలమైనదని, మోదీ, అమిత్ షాకు వ్యతిరేకంగా కేసీఆర్ పోరాడుతున్నారనేది శుద్ధ అబద్ధమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. కేంద్రంలో సహకార శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అమిత్ షా ఆదేశాలతోనే గుజరాత్ రాష్ట్రానికి చెందిన అమూల్ పాల కంపెనీని తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదం తెలిపారని ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ విషయం తలసాని వంటి వారికి తెలియదని చెప్పారు. ఇదే కంపెనీని కర్ణాటకలో ఏర్పాటు చేసి, ఆ రాష్ట్రంలో ఉన్న నందిని అనే పాల కంపెనీని మూసేయాలని చూస్తే అక్కడి ప్రజలు తిరగబడి అమూల్ కంపెనీని వ్యతిరేకించారని తెలిపారు. తెలంగాణలో మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోని వర్గల్‌లో అమూల్ కంపెనీ కోసం ఎర్రతివాచీ పరిచారని, తెలంగాణ రాష్ట్ర పాడి రైతులకు అన్యాయం జరుగుతుందని తెలిసినా ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో విజయ డెయిరీ, కరీంనగర్, ములకనూర్ డెయిరీ వంటి స్థానిక కంపెనీలను చంపి, అమూల్ కంపెనీని తెస్తున్నారని మండిపడ్డారు. కిసాన్ సర్కార్ అంటే రాష్ట్రంలోని పాడి రైతుల పొట్టకొట్టడమేనా అని ప్రశ్నించారు.

# 'డబుల్ బెడ్ రూం' నిధులను దారి మళ్లించారు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మగౌరవ దీక్షలో మాట్లాడుతున్న బండి సంజయ్

మూసాపేట (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద రెండు లక్షల ఇళ్లకు నిధులు మంజూరు చేస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ నిధులను దారి మళ్లించి ఇతర పథకాలకు వాడుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. మూసాపేటలో బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఆత్మగౌరవ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, పేద ప్రజలు స్వంత ఇళ్లు లేక గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, కిరాయిలు కట్టుకోలేక అవస్థలు పడుతున్నప్పటికి తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వటం లేదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం మూడు కోట్ల మందికి ఇళ్లు కట్టించిందని, తెలంగాణకు కూడా 2 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. మరో 2 లక్షల ఇళ్లు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికి కేసీఆర్ మాత్రం ఇళ్లను అందించలేకపోతున్నారని అన్నారు. 2 లక్షల ఇళ్లల్లో కేవలం 7 వేలు మాత్రమే ఇచ్చినట్లు లెక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. అది కూడా నాణ్యత లేని, పడిపోవటానికి సిద్ధంగా ఉన్న నాసిరకం ఇళ్లను నిర్మించారన్నారు. కానీ ప్రచారం.. హంగు, ఆర్భాటంలో మాత్రం రియల్ ఎస్టేట్ యజమానులకు దీటుగా వీడియోలు విడుదల చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు మాయ మాటలతో ప్రజలను మభ్య పెడుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకువస్తే అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

# వేటు పడకూడదనే పేరు పెట్టలేదు

- తమ మాడ్యూల్ విషయంలో సలీం జాగ్రత్తలు
- భోపాల్ కోర్టులో ఐదుగురు నిందితులూ హాజరు
- పది రోజులు ఏటీఎస్ కస్టడీకి అనుమతి



మహ్మద్ సలీం



అబ్దుల్ రెహ్మాన్

సాక్షి, హైదరాబాద్: ఏదైనా విధ్వంసానికి పాల్పడిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమపై నిషేధం విధించకూడదనే వ్యూహంతోనే తమ మాడ్యూల్‌కు ప్రత్యేకంగా పేరు పెట్టలేదని హైదరాబాద్‌లో అరెస్టయిన ఉగ్రవాది మహ్మద్ సలీం భోపాల్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) విచారణలో బయటపెట్టాడు. ఇతడితో సహా నగరంలో అరెస్టు చేసిన ఐదుగురు ఉగ్రవాదులనూ ఏటీఎస్ గురువారం భోపాల్ కోర్టులో ప్రవేశపెట్టింది. వీరిని పది రోజులు ఏటీఎస్ కస్టడీకి అనుమతిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. పరారీలో ఉన్న ఆరో ఉగ్రవాది మహ్మద్ సల్మాన్ (జవహర్‌నగర్) కోర్టులో లొంగిపోయే ప్రయత్నాల్లో ఉన్నట్లు రాష్ట్ర నిఘా వర్గాలు గుర్తించాయి.

**సలీంనే నాయకుడిని చేసిన యాసిర్**

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌తోపాటు హైదరాబాద్‌లోనూ విస్తరించిన ఈ మాడ్యుల్‌ను అక్కడి షాజహనాబాద్‌కు చెందిన జిమ్ ట్రైనర్ యాసిర్ ఖాన్ ఏర్పాటు చేశాడు. భోపాల్‌కే చెందిన సౌరభ్ రాజ్ వైద్య 2009లో అదే ప్రాంతానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. అతడు యాసిర్ ప్రభావంతో మతం మార్చుకుని మహ్మద్ సలీంగా మారాడు. సలీం చురుకుగా ఉండటంతో యాసిర్ తమ మాడ్యూల్‌కు అతడినే నాయకుడిగా ప్రకటించాడు. స్థానికంగా ముఠా కట్టి, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే ముష్కరులు తమ మాడ్యూల్‌కు ఏదో ఒక పేరు పెట్టుకుంటారు. తెహరీక్ గల్బా ఏ ఇస్లాం, ఇండియన్ ముజాహిదీన్, జుందుల్ అల్ ఖలీఫా ఏ హింద్, జుందుల్ ఖిలాఫత్ ఫీ బిలాద్ అల్ హింద్.. ఇవన్నీ ఈ తరహాకు చెందిన ఉగ్ర సంస్థలే. అయితే ఈ విషయంలో సలీం వ్యూహాత్మకంగా వ్యవహరించి తమ మాడ్యుల్‌కు ఓ పేరంటూ పెట్టుకోలేదు. ఉగ్ర సాహిత్యాన్ని సైతం సలీం సొంతంగా రూపొందించినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. హైదరాబాద్ మాడ్యూల్‌లో ఉన్న ఆరుగురిలో సలీంతోపాటు గోల్కొండ ప్రాంతానికే చెందిన అబ్దుల్ రెహ్మాన్ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. మంగళవారం అరెస్టయిన ఐదుగురి ఇళ్లతోపాటు పరారీలో ఉన్న సల్మాన్ ఇంటి నుంచీ ఏటీఎస్ అధికారులు సలీం రూపొందించిన ఉగ్ర సాహిత్య ప్రతులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు సలీం ఇంటి నుంచి ఎయిర్ పిస్టల్స్, పిల్లెట్స్‌ను రికవరీ చేశారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపుతున్నారు.

## విదేశాల్లోని 14 నగరాల్లో శ్రీవారి కల్యాణాలు

సాక్షి, అమరావతి: టీటీడీ ఆధ్వర్యంలో అమెరికా, కెనడాల్లో జూన్, జులైల్లో శ్రీ మలయప్ప స్వామి వారి కళ్యాణోత్సవాలను ఏపీఎన్‌ఆర్టీఎస్ నిర్వహించనుంది. జూన్4–జూలై 23 వరకు 14 నగరాల్లో శ్రీవారి కళ్యాణాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆయన కెనడా, అమెరికాల్లో కళ్యాణాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.ఏపీ సీఎం వైఎస్ జగన్ ఆదేశం మేర కు దేశ, విదేశాల్లో కల్యాణాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

## చిలగడదుంప @ 5 కేజీలు



సాధారణంగా చిలగడదుంపలు అరకిలో లోపు ఉంటాయి. బాగా పెరిగితే ఒక కిలో వరకు పెరుగుతాయి. కానీ..కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మూల్పూరి బలరామకృష్ణ ఇంటి పెరటిలో పెరిగిన చిలగడదుంపలు 5 కిలోలకుపైగా పెరిగాయి. మొత్తం 4 దుంపలు తవ్వగా ఒక్కో దుంప 5 కిలోలు ఉంది. ప్రత్యేకంగా ఎలాంటి ఎరువులు వాడలేదని బలరామకృష్ణ చెప్పారు.

– ఘంటసాల(అవనిగడ్డ)

## క్లుప్తంగా

### అగ్నివీర్‌లకు రైల్వే ఉద్యోగాల్లో రిజర్వేషన్!


న్యూఢిల్లీ: సాయుధ బలగాల్లో నాలుగు సంవత్సరాలు విధులు నిర్వర్తించాక త్రివిధ బలగాల్లో ఉద్యోగం నుంచి బయటికొచ్చిన అగ్నివీర్‌లకు తమ ఉద్యోగ భర్తీల్లో వారికి ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పిస్తామని రైల్వే శాఖ యోచిస్తోంది. ఈ వివరాలను సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వేర్వేరు రైల్వే విభాగాల్లో నేరుగా రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి నాన్-గెజిటెడ్ పోస్టుల్లో వారికి 15 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. ఆయా ఉద్యోగాలకు అర్హత వయసులో సడలింపు అవకాశం ఇవ్వనున్నారు. దేహదారుఢ్య పరీక్షల నుంచి మినహాయింపు కల్పిస్తారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)లో అగ్నివీర్‌లకు రిజర్వేషన్ విధానాన్ని తెచ్చే యోచనలో ఉన్నారు. నాన్-గెజిటెడ్ పోస్టుల్లో లెవల్ 1లో 10 శాతం , లెవల్ 2లో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. దివ్యాంగులు, మాజీ సైనికులు, అప్రెంటీస్‌ల రెగ్యులరైజేషన్ విధానాలకు అనుగుణంగా వీరి నియామకం ఉంటుంది. తొలి బ్యాచ్ అగ్నివీర్‌లకు ఐదేళ్ల వయసు సడలింపు, రెండో బ్యాచ్ వారికైతే మూడేళ్ల వయోపరిమితి సడలింపు వర్తింపజేస్తారు.

### విపక్షాల ఐక్యతే ముఖ్యం

**పవార్, ఠాక్రేలతో నితీశ్ వేర్వేరుగా సమావేశం**

ముంబై: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలను ఐక్యం చేసే ప్రయత్నాలను బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీవ్రతరం చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి యాదవ్‌తో కలిసి శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌లను గురువారం వేర్వేరుగా కలుసుకున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడానికి తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ దేశ ప్రయోజనాల కోసం ఏమీ చేయడం లేదని ఆరోపించారు. అందుకే పార్టీ ప్రయోజనాలతో పాటుగా దేశ ప్రయోజనాలను కూడా కాపాడడానికి కృషి చెయ్యాలని ఇరువురు నేతలకు చెప్పినట్టుగా వెల్లడించారు. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీలు ముందు దేశ ప్రయోజనాలను కాపాడాలన్న ఏకైక లక్ష్యం ఉందని నితీశ్ అన్నారు. అందరూ కలసికట్టుగా పోరాడితే బీజేపీపై విజయం సాధించవచ్చునని చెప్పారు. ప్రతిపక్షాల ఐక్యత కోసం త్వరలోనే బీజేపీ వ్యతిరేక పార్టీలన్నింటితో సమావేశం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.





# చీతాలు.. చింతలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లోనే అంతరించిపోయిన జాబితాలో చేరిపోయిన చీతాల సంతతిని తిరిగి భారత్‌లో పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీతాల ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. నమీబియా, దక్షిణాఫ్రికా నుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి మొత్తం 20 చీతాలను తీసుకువచ్చాము. గత మూడు నెలల్లోనే మూడు చీతాలు మరణించడంపై జంతు ప్రేమికుల్లో ఆందోళన నెలకొంది. మూడు చీతాలను మనం కోల్పోయినప్పటికీ మార్చి నెలలో సియాయా అనే చీతా నాలుగు పిల్లలకి జన్మనివ్వడం వల్ల ఈ ప్రాజెక్టు ముందుకెళుతుందన్న ఆశలు ఇంకా అందరిలోనూ ఉన్నాయి. చీతాలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఇంకా ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటుందనే చర్చ మొదలైంది.

**మూడు నెలల్లో మూడు చీతాల మృతితో ఆందోళనలు**

**చీతాల ప్రాజెక్టులో ఎదురవుతున్న సవాళ్లు**

| మార్చి 27 | ఏప్రిల్ 13 | మే 9 |
|---|---|---|
| నమీబియా నుంచి తీసుకువచ్చిన శష అనే చీతా కిడ్నీపరమైన వ్యాధితో మరణించింది. | దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చిన ఉదయ్ అనే చీతా అనారోగ్య కారణాలతో మృతి చెందింది | దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన చీతాల్లో దక్ష అనే ఆడ చీతాను మేటింగ్ సమయంలో మగ చీతాలు క్రూరంగా వ్యవహరించి మీద పడి చంపేశాయి. |

### ఎదురవుతున్న సవాళ్లు

చీతాల మనుగడకు ఎదురవుతున్న అతి పెద్ద సవాల్ వాతావరణం. మధ్యప్రదేశ్‌లో కునో జాతీయ ఉద్యానవనంలో వాతావరణం ఆఫ్రికా వాతావరణం కంటే చాలా విభిన్నమైనది. కునోలో వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకు రాల్చే అడవులుంటాయి. ఆఫ్రికాలో గడ్డి మైదానాలు, దట్టమైన వృక్షాలు ఎక్కువ. ఇన్నాళ్లూ అక్కడ వాతావరణానికి అలవాటు పడిన చీతాలకు ఒకేసారి మార్పు రావడం తట్టుకోలేకుండా ఉన్నాయి. మన దేశంలో ఉద్యానవనాలు చీతాలకు నివాసయోగ్యాలుగా మారగలవో లేదోనన్న సందేహాలు కూడా నిపుణుల్లో ఉన్నాయి. ప్రభుత్వం చీతాల ప్రాజెక్టు ప్రారంభించడానికే ముందే జంతు పరిరక్షణ నిపుణులు భారత పర్యావరణ వ్యవస్థకి చీతాలు అలవాటు పడడానికి చాలా ఏళ్లు పడుతుందని హెచ్చరించారు.

ఇక రెండో పెద్ద సవాల్ స్థలం. కునో జాతీయ పార్క్‌లో చీతాలు ఉంచిన వాటికి ఎన్‌క్లోజర్ సరిపోదు. అవి స్వేచ్ఛగా సంచరించడానికి మరింత దట్టమైన అటవీ ప్రాంతం అవసరముంది. వచ్చే అయిదేళ్లలో మరో 30 చీతాలను తెచ్చే ప్రణాళికలు ఉండడంతో వాటిని ఎక్కడ ఉంచుతారో కూడా ముందుగానే చూడాల్సిన అవసరం ఉంది.

కునోలో జంతువుల మధ్య ఘర్షణ జరుగుతూ ఉండడం అధికమే. చీతా కంటే దూకుడుగా వ్యవహరించే పులులు, చిరుతపులులు పోటాపోటీగా కొట్టుకుంటాయి. ఒక్కోసారి చీతాలను ఉద్యానవనం గేటు వరకు తీసుకొస్తూ ఉంటాయి. అక్కడ మనుషులే వాటికి శత్రువులుగా మారుతుంటారు. ఇక మనుషులు, జంతువుల మధ్య సంఘర్షణలతో ఎంతో విలువైన జంతు సంపదని కోల్పోతున్నాం. దీంతో జీవవైవిధ్యానికి ముప్పు కలుగుతోంది.

చీతాల సంరక్షణకి నియమించిన వారికి కేంద్ర ప్రభుత్వం ఆఫ్రికాకి పంపించి శిక్షణ ఇచ్చింది. కానీ ఆ శిక్షణ సరిపోలేదు. రెండు చీతాలు అనారోగ్య కారణాలతో మరణించాయంటేనే సంరక్షకులకు వాటిపై పూర్తి స్థాయి అవగాహన లేదన్న విషయం తెలుస్తోంది.

భారత్‌లో చీతాలు ప్రధానంగా కృష్ణజింకలు, చింకారాలను వేటాడి తింటాయి. ప్రస్తుతం కునో జాతీయ ఉద్యానవనంలో ఈ జంతువులు అంతగా లేవు. దీంతో చీతాల కడుపు నిండడం కూడా సమస్యగానే మారింది.



అనారోగ్యంతో సొమ్మసిల్లిన చీతా ఉదయ్ (ఫైల్)

### చీతాలను కాపాడుకోవడం ఎలా?

ఆఫ్రికా నుంచి తెచ్చిన చీతాల సంతతి పెరగడానికి చాలా ఏళ్లు ఎదురు చూడక తప్పని పరిస్థితులు ఉన్నాయి. చీతాలకు రేడియో కాలర్ ఏర్పాటు చేసి శాటిలైట్ ద్వారా ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షిస్తున్నారు. అయినప్పటికీ ప్రతీ క్షణం వాటి భద్రతని పర్యవేక్షించడం సంక్లిష్టంగా మారింది. అందుకే వాటిని ఎన్‌క్లోజర్లకే పరిమితం చేయడంపై వన్యప్రాణుల నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిమితమైన స్థలంలో వాటిని బంధించి ఉంచడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉండవని వరల్డ్‌లైఫ్ బయోలజిస్ట్ రవి చెల్లం అభిప్రాయపడ్డారు. మగ, ఆడ చీతాలను ఎన్‌క్లోజర్ల నుంచి బయటకి తరచూ వదులుతూ ఉండాలని అప్పుడే వాటి సంతతి అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇక వాతావరణపరమైన అడ్డంకుల్ని అధిగమించాలంటే మరిన్ని ఏళ్లు గడవడం తప్ప మరో మార్గం లేదన్నది వన్యప్రాణ నిపుణుల అభిప్రాయంగా ఉంది. రుతుపవనాల సీజన్ ముగిసిన తర్వాత చీతాలను వేరే అడవులకి కూడా తరలించే ఆలోచనలో కేంద్రం ఉంది.

సాక్షి, నేషనల్ డెస్క్

# ఉద్ధవ్‌ను సీఎంగా నియమించలేం

- బల పరీక్ష ఎదుర్కోకుండానే రాజీనామా చేశారు
- అప్పట్లో గవర్నర్ తీరు సక్రమంగా లేదు
- సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు



సుప్రీంకోర్టులో వాదోపవాదాలు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండే కొనసాగడానికి సుప్రీంకోర్టు తీర్పుతో మార్గం సుగమమైంది. ఉద్ధవ్ ఠాక్రేను తిరిగి ముఖ్యమంత్రిగా నియమించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. శాసనసభలో బల పరీక్షను ఎదుర్కోకుండా ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేశారని పేర్కొంది. అప్పట్లో గవర్నర్ భగత్‌సింగ్ కోషియారీ వ్యవహరించిన తీరు సమర్థనీయంగా లేనప్పటికీ ఉద్ధవ్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేమని తేల్చిచెప్పింది. సీఎం పదవికి రాజీనామా చేయాలని ఏక్‌నాథ్ షిండేను ఆదేశించలేమని పేర్కొంది. శివసేన పార్టీలో తలెత్తిన సంక్షోభం, తద్వారా రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభంపై దాఖలైన 8 పిటిషన్లను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. 'సభలో ఉద్ధవ్ ఠాక్రే మెజార్టీ కోల్పోయినట్లు నిర్ధారణకు రావడానికి తగిన సమాచారం లేకపోయినా మెజార్టీ నిరూపించుకోవాలని ప్రభుత్వానికి గవర్నర్ సూచించడం సరైంది కాదు. ఆయన తన విచక్షణాధికారాలను ఉపయోగించి తీరు చట్టబద్ధంగా లేదు. సభలో బల పరీక్ష ఎదుర్కోకుండా ఉద్ధవ్ రాజీనామా చేశారు కాబట్టి ఆయన ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేం. ఉద్ధవ్ రాజీనామా చేసిన తర్వాత బీజేపీ మద్దతున్న షిండేతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అది సమర్థనీయమే' అని వెల్లడించింది. ఉద్ధవ్ వర్గంపై తిరుగుబాటు చేసి, షిండే పక్షాన చేరిన శివసేన ఎమ్మెల్యేలపై ఇప్పుడు అనర్హత వేటు వేయలేమని తెలియజేసింది. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటున్న స్పీకర్‌కు తిరుగుబాటు ఎమ్మెల్యేలకు అనర్హత నోటీసు ఇచ్చే అధికారం ఉందా? అనేది తేల్చడానికి అధ్యయనం చేయాల్సి ఉందని అభిప్రాయపడింది. అందుకే ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తున్నట్లు తెలిపింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి మరో ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. షిండే వర్గాన్ని అసలైన శివసేనగా ఎన్నికల సంఘం గుర్తించిన సంగతి తెలిసిందే.

**షిండే రాజీనామా చేయాలి: ఉద్ధవ్**

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని పునరుద్ధరించిందని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. అప్పటి గవర్నర్ తీరును కోర్టు తప్పుపట్టిందని చెప్పాడు. వారు(షిండే వర్గం ఎమ్మెల్యేలు) తమ పార్టీని, తండ్రి బాల్ ఠాక్రే అందించిన వారసత్వానికి దగా చేశారని మండిపడ్డారు. సీఎం పదవికి తాను రాజీనామా చేయడం చట్టప్రకారం పొరపాటే అయినప్పటికీ నైతిక విలువలను పాటిస్తూ పదవి నుంచి తప్పుకున్నానని వివరించారు. వెన్నుపోటుదారులతో ప్రభుత్వాన్ని ఎలా నడిపించాలని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా చేయాలని ఉద్ధవ్ డిమాండ్ చేశారు.

# సాధికారత కోసమే సాంకేతికత

- ఆధిపత్యం కోసం దుర్వినియోగం చేయట్లేదు
- జాతీయ సాంకేతికత దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: సాంకేతికతను సాధికారత సాధించేందుకే సద్వినియోగం చేయాలని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలో జరిగిన జాతీయ సాంకేతికత దినోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. భారత్ పోఖ్రాన్ అణుపరీక్షలు జరిపి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. 'దేశ చరిత్రలో ఉజ్వలమైన క్షణాల్లో 1998నాటి పోఖ్రాన్ అణుపరీక్షలు కూడా ఒకటి. వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నకాలంలో చేసిన అణుపరీక్షలు దేశ శాస్త్రసాంకేతికత సత్తాను చాటడంతోపాటు ప్రపంచస్థాయిలో దేశ ఖ్యాతిని సమున్నత స్థాయిలో నిలిపాయి' అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా త్వరలో నిర్మించబోయే లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్ వేవ్ అబ్జర్వేటరీ-ఇండియా(లిగో-ఇండియా)కు శంకుస్థాపన చేసిన దానిని జాతికి అంకితం చేశారు. ఈ కేంద్రంలో అరుదైన ఖనిజాల నుంచి మ్యాగ్నెట్‌లను తయారుచేయనున్నారు. విశాఖపట్నంలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధనాలయంసహా ముంబై, నవీ ముంబైలలోని పలు పరిశోధన, ఉత్పత్తి కేంద్రాలను జాతికి అంకితమిచ్చారు. 'జామ్(జేఏఎం) ట్రినిటీ, కోవిన్ పోర్టల్, రైతులకు డిజిటల్ మార్కెట్ ఇలా ప్రతి రంగంలో సాంకేతికతను భారత ప్రభుత్వం సాధికారత, సామాజిక న్యాయం కోసమే వినియోగిస్తోంది. ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు కాదు. శాస్త్ర,సాంకేతిక రంగ పురోభివృద్ధికి ఎంతగానో మా సర్కార్ కృషిచేస్తోంది. పదేళ్ల క్రితం ఏటా 4,000 పేటెంట్లు నమోదయ్యేవి. ఇప్పుడు ఆ సంఖ్య 30వేలకు చేరుకుంది. గతంలో ఏటా 70వేల ట్రేడ్‌మార్క్‌లు నమోదయ్యేవి. ఇప్పుడవి 2.5లక్షలపైమాటే. ఇంక్యుబేషన్ కేంద్రాల సంఖ్య ఎనిమిదేళ్ల క్రితం 150 ఉంటే ఇప్పుడవి 650కి చేరుకున్నాయి' అని మోదీ అన్నారు.

# పాలనాధికారం ఢిల్లీ సర్కార్‌దే

**సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు**

- కేంద్రం పరిధిలోనే ఢిల్లీ శాంతిభద్రతలు, పోలీసు శాఖ, భూమి
- స్థానిక ప్రభుత్వ నిర్ణయాలకు లెఫ్టినెంట్ గవర్నర్ కట్టుబడి ఉండాలి
- కోర్టు తీర్పుపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హర్షం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా వ్యవహారాలపై అధికారం ఎవరిదన్న వివాదంపై సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించింది. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వానికి భారీ ఊరట కలిగించింది. శాంతిభద్రతలు(పబ్లిక్ ఆర్డర్), పోలీసు శాఖ, భూమి మినహా మిగిలిన పరిపాలనా వ్యవహారాలపై శాసన, కార్యనిర్వాహక అధికారాలు స్థానిక ఢిల్లీ ప్రభుత్వానికే ఉంటాయని తేల్చిచెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం తీర్పును ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వం మధ్య ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న వివాదానికి ముగింపు పలికింది. ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి అయిన లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ) కట్టుబడి ఉండాలని ఆదేశించింది. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వానికే అధికార యంత్రాంగంపై నియంత్రణ ఉండాలని ధర్మాసనం పేర్కొంది. అధికారులు మంత్రుల ఆదేశాలు పాటించకపోతే, వారికి నివేదించకపోతే పరిపాలనపై అది ప్రతికూల ప్రభావం చూపుతుందని వెల్లడించింది. దేశ రాజధాని అయిన ఢిల్లీకి ప్రత్యేక స్వరూపం ఉందని, ఇతర రాష్ట్రాల తరహాలో ఇక్కడ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఉందని ధర్మాసనం గుర్తుచేసింది. కాబట్టి ఢిల్లీలో పరిపాలనపై అధికారాలు ప్రజాప్రతినిధులతో కూడిన స్థానిక ప్రభుత్వానికే ఉంటాయని స్పష్టంచేసింది. ఢిల్లీలో పబ్లిక్ ఆర్డర్, పోలీసు శాఖ, భూమిపై అధికారాలు కేంద్రానివేనని ఉద్ఘాటించింది. సహకార సమాఖ్య స్ఫూర్తి ప్రకారం రాజ్యాంగం నిర్దేశించిన పరిధులకు లోబడి కేంద్రం తన అధికారాలను ఉపయోగించాలని సూచించింది. సివిల్ సర్వీసు అధికారులు రాజకీయంగా తటస్థంగా వ్యవహరించాలని, ప్రభుత్వం రోజువారీగా తీసుకొనే నిర్ణయాలను అమలు చేయడానికి మంత్రుల పరిపాలనాపరమైన నియంత్రణ కింద పనిచేయాలని పేర్కొంది.

**కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్‌తో వివాదం**

ఢిల్లీలో పరిపాలన సర్వీసులపై అధికారాలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయని తేల్చిచెబుతూ 2015లో కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇతర కేంద్ర పాలిత ప్రాంతాల మాదిరిగా కాకుండా భారత రాజ్యాంగం ఢిల్లీకి విశిష్ట హోదా కల్పించిందని తెలియజేసింది. ఈ నోటిఫికేషన్‌పై అభ్యంతరం వ్యక్తం ఆప్ ప్రభుత్వం తొలుత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అక్కడ సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై 2019 ఫిబ్రవరి 14న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఇద్దరు సభ్యులు భిన్నంగా స్పందించారు. ఢిల్లీలో పాలనపై ఢిల్లీ ప్రభుత్వానికి అధికారాలు ఉండవని జస్టిస్ అశోక్ భూషణ్ చెప్పగా, మరో సభ్యుడు జస్టిస్ ఏకే సిక్రీ దాన్ని వ్యతిరేకించారు. దీంతో 'ఆప్' ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ వివాదాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేస్తున్నట్లు గతేడాది మే 6న సుప్రీంకోర్టు ప్రకటించింది. వివాదంపై విచారణ జరిపిన రాజ్యాంగ ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. జస్టిస్ అశోక్ భూషణ్ ఇచ్చిన తీర్పును రాజ్యాంగ ధర్మాసనం తోసిపుచ్చింది.



**ఇది ప్రజాస్వామ్య విజయం: కేజ్రీవాల్**

సుప్రీంకోర్టు తీర్పుపట్ల 'ఆప్' జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య విజయమని అభివర్ణించారు. ఢిల్లీ ప్రజలకు న్యాయం చేకూర్చిన సుప్రీంకోర్టుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇకపై ఢిల్లీలో అభివృద్ధిని వేగవంతం అవుతుందని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పేర్కొన్నారు. 'ఇది మైలురాయి లాంటి తీర్పు, సత్యమేవ జయతే' అని 'ఆప్' రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా ట్వీట్ చేశారు.

సమాఖ్య స్ఫూర్తిని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వం పరస్పరం సహకరించుకోవాలని సూచించింది.

**కేజ్రీవాల్ కార్యాచరణ ప్రారంభం**

సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన కొన్ని గంటల్లోనే అరవింద్ కేజ్రీవాల్ తన కార్యాచరణ ప్రారంభించారు. ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ఇక తన చేతులను ఎవరూ కట్టిపారేయలేరని, అభివృద్ధిని 10 రెట్లు వేగవంతంగా చేస్తామని చెప్పారు. సర్వీసెస్ సెక్రెటరీ పోస్టు నుంచి ఆశీష్ మోరేను తొలగించారు. ఆయన స్థానంలో 1995 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఏకే సింగ్‌ను నియమించారు. ఢిల్లీలో త్వరలో బదిలీ-పోస్టింగ్ పరిశ్రమ రాబోతోందని బీజేపీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. చరిత్రాత్మక తీర్పు అని కాంగ్రెస్ పేర్కొంది.

### ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై కొరడా

సాక్షి, న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఎరువుల ధరలు ఎగబాకడం, రైతుల నుండి పెరిగిన డిమాండ్, తగ్గిన సరఫరా కారణంగా దేశంలో ఎక్కువైన ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై కేంద్రం దృష్టిసారించింది. రానున్న ఖరీఫ్ సీజన్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలకు దిగింది. బ్లాక్‌మార్కెటింగ్ అరికట్టేందుకు కేంద్ర ఎరువులు, రసాయన మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లోని 370 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. తెలంగాణలో నాలుగు యూరియా డైవర్షన్ యూనిట్లలో, ఆంధ్రప్రదేశ్‌లో ఒక మిశ్రమ యూనిట్‌లో తనిఖీలు చేశాయి. మరో వారం పాటు ఈ ఆకస్మిక తనిఖీలు కొనసాగనున్నాయి. తనిఖీల సందర్భంగా గుజరాత్, కేరళ, హరియాణా, రాజస్తాన్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఏకంగా 70,000 బస్తాల నకిలీ యూరియాను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీనికి సంబంధించి ఇప్పటిదాకా 30 ఎఫ్ఐఆర్‌లు నమోదుకాగా, 112 మిశ్రమ తయారీదారులను డీఆథరైజ్ చేసినట్లు వెల్లడించింది. దాదాపు రూ. 2,500 ఖరీదు చేసే 45 కిలోల యూరియా బస్తాను రైతులకు వ్యవసాయ అవసరాలకు రాయితీపై రూ.266కే కేంద్రం అందిస్తోంది. అయితే డిమాండ్‌కు సరిపడా యూరియా సరఫరా లేకపోవడంతో సబ్సిడీ ధరకు యూరియాను పొందలేకపోతున్న రైతన్నలు మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

### బంగ్లాదేశ్-మయన్మార్ తీరం దిశగా 'మోకా'

న్యూఢిల్లీ: మోకా తుపాను మరింత శక్తివంతంగా మారుతోందని, శుక్రవారం ఉదయానికల్లా మరింత తీవ్ర తుఫానుగా మారనుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ తుఫాను బంగ్లాదేశ్-మయన్మార్ దిశగా కదిలే అవకాశాలు ఉన్నాయని అధికారులు గురువారం రాత్రి తెలియజేశారు. గంటకు 135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అన్నారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు పోర్ట్ బ్లెయిర్‌కు పశ్చిమంగా 520 కిలోమీటర్లు, బంగ్లాదేశ్‌లోని కాక్స్‌బజార్ నుంచి దక్షిణ దిశగా 1,100 కిలోమీటర్ల దూరంలో ఆగ్నేయ బంగాళాఖాతంపై మోకా తుపాను ఆవరించి ఉంది. ఆదివారం ఉదయం వరకూ ఈశాన్య బంగాళాఖాతం, ఉత్తర అండమాన్ సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది.

### లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

**ప్రధానితో భేటీ తర్వాత నవీన్ పట్నాయక్ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బిజు జనతా దళ్ (బీజేడీ) ఒంటరి పోరాటం చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. గురువారం ప్రధాని మోదీని కలిసి మంతనాలు జరిపారు. బీజేపీకి, కాంగ్రెస్‌కి సమానదూరం పాటిస్తానని తర్వాత మీడియాతో పట్నాయక్ చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకురావడం కోసం బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తాను చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా నవీన్ పట్నాయక్‌ను కలుసుకున్న మర్నాడే ఒంటరిగానే ఎన్నికల బరిలో దిగుతామని తేల్చి చెప్పడం విశేషం. నితీశ్ భువనేశ్వర్‌కు వచ్చి తనను మర్యాదపూర్వకంగానే కలుసుకున్నారని పట్నాయక్ చెప్పారు. 2000 సంవత్సరం నుంచి ఒడిశాలో అధికారంలో ఉన్న నవీన్ పట్నాయక్ అప్పట్నుంచి బీజేపీ, కాంగ్రెస్ మధ్య వచ్చే వివాదాస్పద అంశాల్లో తటస్థ వైఖరి అవలంబిస్తూ వస్తున్నారు.

### ప్రతినిధుల సభలో అమెరికా పౌరసత్వ చట్టం

వాషింగ్టన్: గ్రీన్‌కార్డుల జారీలో దేశాల వారీ కోటాను ఎత్తివేయడంతోపాటు హెచ్-1బీ వీసాల జారీలో మార్పుల కోసం ఉద్దేశించిన అమెరికా పౌరసత్వ చట్టం-2023ను అధికార డెమొక్రాటిక్ పార్టీ ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం 1 కోటి మందికిపైగా అమెరికా పౌరసత్వం కల్పించేందుకు రోడ్‌మ్యాప్ రూపొందిస్తారు. అక్రమంగా వలస వచ్చిన వారికి, ధ్రువ పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారికి పౌరసత్వం లభించనుంది. గ్రీన్‌కార్డ్ జారీ సులభం కానుంది. దేశాలవారీ కోటా రద్దు చేస్తారు. తక్కువ వేతనం ఇచ్చే పరిశ్రమల్లో పనిచేసేవారు కూడా గ్రీన్‌కార్డులు సులువుగా పొందవచ్చు. హెచ్1బీ వీసాలు కలిగిన వారి జీవిత భాగస్వాములు అమెరికాలో ఉద్యోగాలు చేసుకోవడానికి అనుమతి ఇస్తారు.



11.16 కేరట్ల ఈ వజ్రపుటుంగరం పేరు లాగూన్ బ్లూ. త్వరలో జెనీవాలో వేలంలో ఇది రూ.205 కోట్ల ధర పలకొచ్చని సోత్‌బేస్ సంస్థ చెబుతోంది.

### కర్ణాటకలో 73.19 శాతం పోలింగ్ నమోదు

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో 73.19 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఎన్నికలు బుధవారం జరగ్గా, తుది గణాంకాలను ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. 73.19 శాతం పోలింగ్ నమోదు కావడం ఒక కొత్త రికార్డేనని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి చెప్పారు. అత్యధికంగా చిక్కబళ్లాపుర జిల్లాలో 85.56 శాతం, బెంగళూరు రూరల్‌లో 85.08 శాతం, అత్యల్పంగా బీబీఎంపీ దక్షిణంలో 52.33 శాతం పోలింగ్ నమోదయ్యింది. రాష్ట్రంలో మొత్తం 58,545 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఎక్కడా రాలేదని అధికారులు తెలిపారు.

# చట్టవిరుద్ధం

- ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్‌పై పాక్ సుప్రీంకోర్టు వ్యాఖ్య
- ఆయన్ను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు



సుప్రీంకోర్టుకు వస్తున్న ఇమ్రాన్ ఖాన్(వెనక సీట్లో)

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్‌కు ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. అల్-ఖాదిర్ ట్రస్ట్ అవినీతి కేసులో ఇమ్రాన్‌ను అరెస్ట్ చేసి జాతీయ జవాబుదారీ బ్యూరో(ఎన్ఏబీ) కస్టడీలో ఉంచడాన్ని పాక్ సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. 'ఇమ్రాన్‌ను అరెస్ట్‌చేయడం పూర్తిగా చట్టవ్యతిరేకం. ఆయనను వెంటనే విడుదల చేయండి. విడుదలయ్యాక ఇస్లామాబాద్‌లో సురక్షిత ప్రాంతంలో ఉంచి రక్షణ కల్పించండి' అని అధికారులను కోర్టు ఆదేశించింది. దీంతో ఇస్లామాబాద్ హైకోర్టులో అరెస్టయిన ఇమ్రాన్‌కు పెద్ద ఉపశమనం లభించింది.

**గంటలో హాజరుపరచండి**

అంతకుముందు మంగళవారం ఇస్లామాబాద్ హైకోర్టు ఆవరణలో లాక్కెళ్లి అరెస్ట్ చేయడాన్ని ఇమ్రాన్ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా ఆ పిటిషన్ గురువారం మధ్యాహ్నం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ఎన్ఏబీ అధికారులపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. 'గంటలోగా ఇమ్రాన్‌ను మా ముందుకు తీసుకురండి' అని మధ్యాహ్నం 3.30కి ఎన్ఏబీని ఆదేశించింది. దీంతో వెంటనే ఖాన్‌ను కోర్టుకు తీసుకొచ్చారు. 'హైకోర్టు రిజిస్ట్రార్ అనుమతి లేకుండా ఒక వ్యక్తిని కోర్టు ప్రాంగణంలో ఎలా అరెస్ట్ చేస్తారు? న్యాయం కోసం కోర్టుకొచ్చిన వ్యక్తిని అరెస్ట్ చేస్తారా? ఒకవేళ కోర్టులో లొంగిపోవడానికే వస్తుంటే అరెస్ట్ చేయడంలో అర్థమేముంది? అరెస్ట్ చేసేందుకు ఏకంగా 90 మంది పోలీసులు కోర్టులో చొరబడితే హైకోర్టుకు ఏం విలువ ఇచ్చినట్టు? అని అధికారులపై ప్రధాన న్యాయమూర్తి ఉమర్ అతా బందియాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'తదుపరి న్యాయపర ఆదేశాల అభ్యర్థన కోసం శుక్రవారం ఇస్లామాబాద్ హైకోర్టుకు వెళ్లండి. ఆ కోర్టు నిర్ణయమే తుది నిర్ణయం' అని ఇమ్రాన్‌కు సుప్రీంకోర్టు సూచించింది. అరెస్ట్‌తో రణరంగంలా మారిన పాక్‌లో ఇప్పటిదాకా ఎనిమిది మంది చనిపోయారు. 300 మందికిపైగా గాయపడ్డారు. కాగా, 'ఒక నేరగాడిని విడుదల చేస్తూ ప్రధాన న్యాయమూర్తి ఎంతో సంతోషంగా ఉన్నారు. నేరగాడికి రక్షణ కవచంగా ఉంటూ దేశంలో చెలరేగుతున్న హింసకు మరింత ఆజ్యం పోస్తున్నారు' అని పాకిస్తాన్ ముస్లింలీగ్-నవాజ్ పార్టీ నాయకురాలు మరియం నవాజ్ ఆరోపించారు.

# అకాల వర్షంతో రైతులు ఆగమాగం

## తడిసిన మిర్చి.. వ్యాపారుల దగాతో ఒక్కరోజే రైతులకు రూ.4 కోట్ల నష్టం



అకాల వర్షంతో ఖమ్మం మార్కెట్‌లో మిర్చి బస్తాలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

సాక్షి నెట్‌వర్క్, ఖమ్మం: ఒకపక్క అకాల వర్షం.. మరోపక్క వ్యాపారుల దగాతో రైతులు ఆగమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం ఉదయం, సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఉదయం కురిసిన వానతో.. అప్పటికే ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి బస్తాలు తడిసిపోయాయి. ఇదే అదనుగా పంట తడిసిందని, చివరి కోత కావడంతో నాణ్యత లేదంటూ వ్యాపారులు ధరలో కోతపెట్టారు. ప్రస్తుతం క్వింటా మిర్చి ధర రూ.24 వేలు పలుకుతుండగా రూ.4వేల నుంచి రూ.5వేల వరకు తగ్గించారని రైతులు వాపోయారు. ఈ లెక్కన ఖమ్మం మార్కెట్లో రైతులు ఒక్కరోజే రూ.4 కోట్ల వరకు నష్టపోయినట్టు అంచనా. ఇంకోపక్క, సాయంత్రం వేల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉమ్మడి జిల్లాలోని దమ్మపేట, చర్ల, దుమ్ముగూడెం, మధిర, ముదిగొండ, ఖమ్మం అర్బన్, రూరల్, తల్లాడ, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో ఈదురుగాలులు, వర్షాలతో పాటు పిడుగులు పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపడ్డాయి. వైరా తదితర ప్రాంతాల్లో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి కొట్టుకుపోయింది.

# అత్తింటి వేధింపులకు యువ డాక్టర్ బలి

## వరంగల్ నగరంలో ఘటన



తండ్రితో నిహారికా రెడ్డి (ఫైల్)

వరంగల్ క్రైం: హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో ఫిజియోథెరపీ డాక్టర్ కుందురు నిహారికారెడ్డి (25) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, మృతురాలి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం కేశవాపూర్‌కు చెందిన గంగాధర్‌రెడ్డి నగరంలోని చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. ఇతనికి వర్ధన్నపేట మండలం కడారిగూడేనికి చెందిన నిహారికారెడ్డితో రెండేళ్లక్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నం కింద నగరంలో 300 గజాల ప్లాట్, ఇతర కానుకలు ఇచ్చారు. ఎక్సైజ్ కాలనీలో నివాసం ఉం టున్న వీరికి నాలుగు నెలల క్రితం పాప జన్మించింది. ఇటీవల కారు కావాలని గంగాధర్‌రెడ్డి అడగగా అందుకు కూడా నిహారిక తల్లిదండ్రులు అంగీకరించారు. అయినప్పటికీ ఇంకా పెళ్లి లాంఛనాల విషయంలో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి భార్యాభర్తలు వేర్వేరు గదుల్లో నిద్రించారు. గురువారం ఉదయం పాప ఏడు స్తున్నా నిహారికారెడ్డి తలుపు తీయక పోవడంతో భర్తకు అను మానం వచ్చి తలుపులు పగులగొట్టి లోపలి కి వెళ్లేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఇన్‌స్పెక్టర్ షూకూర్ ఘట నాస్థలానికి చేరుకుని పరిశీలించారు. భర్త, అత్త, ఆడబిడ్డ దంపతుల వేధింపుల వల్లే తన కూతురు ఆత్మ హత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి మల్లారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.



# బోరుబావి నుంచి ఎగసిన నీరు



బోరులో నుంచి ఉబికి వస్తున్న నీరు

నెన్నెల: మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కోణంపేట గ్రామ పంచాయతీ పరిధి పుష్పలవాణిపేటలో ఓ బోరుబావి నుంచి పాతాళగంగ ఉబికి వస్తోంది. ఎలాంటి విద్యుత్ మోటారు లేకుండానే నీరు పొంగి పొర్లుతోంది. ఇటీవల కోణంపేటకు చెందిన రెడ్డి పోశయ్య, బోగారపు మారయ్య, పశుల లస్మయ్యకు గిరి వికాస్‌లో బోరు మంజూరైంది. పదిహేను రోజుల క్రితం 300 అడుగుల లోతులో బోరు తవ్వించారు. వంద అడుగులు తవ్వగానే నీరు పడింది. ప్రస్తుతం ఆరు అంగుళాల మందంతో నీరు ఎగసి పడుతోందని రైతులు తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి ఉండేదని, ఎంత లోతు బోర్లు వేసినా నీటి చుక్క వచ్చేది కాదని పేర్కొన్నారు. నీరు పడని ఈ కరువు ప్రాంతంలో బోరు బావి నుంచి నీరు ఉబికి వస్తుండడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు.

# పెరిగిన గోదావరి వరద

## సీతమ్మ సాగర్ బ్యారేజీ పనులకు ఆటంకం



అశ్వాపురం మండలం దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి

అశ్వాపురం/భద్రాచలం అర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గురువారం ఒక్కసారిగా గోదావరి వరద ప్రవాహం పెరిగింది. దీంతో సీతమ్మసాగర్ బ్యారేజీ పనుల వద్ద కాఫర్ వంతెన కోతకు గురైంది. వంతెనపై వాహనాలు, యంత్రాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కారణంగా బ్యారేజీ పనులకు ఆటంకం ఏర్పడింది. వర్షాకాలంలో మాత్రమే గోదావరి వరద ఆనకట్ట మీదుగా ప్రవహించేది. వేసవిలో ఆనకట్ట రవాణాకు వారధిలా ఉంటుంది. రెండు రోజుల క్రితం ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో నీరు దిగువకు వదలడంతో ఇక్కడ ప్రవాహం పెరిగింది. భద్రాచలంలో కూడా గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. బుధవారం 3.1 అడుగులు ఉండగా, గురువారం 6.5 అడుగులకు చేరింది.

# రైతులకు చైతన్యమేదీ?

## మూడేళ్లుగా నిలిచిపోయిన చైతన్య యాత్రలు

- రైతుకు చేరని వ్యవసాయ విధానాలు
- పంటల సాగుపై అవగాహన కల్పించని యంత్రాంగం
- కొత్త వంగడాలు, పథకాలపై రైతుల్లో గందరగోళం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు, వ్యవసాయశాఖ అధికారులకు మధ్య దూరం పెరుగుతోంది. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంలో వ్యవసాయశాఖ వైఫల్యం కనిపిస్తోంది. మూడేళ్ల క్రితం వరకు సీజన్ ప్రారంభానికి ముందు మే నెలలో వారంపాటు రైతు చైతన్య యాత్రలను వ్యవసాయ శాఖ నిర్వహించేది. సీజన్‌కు ముందు రైతులకు కొత్త వంగడాలు, పథకాలు, పంట రుణాలు, సాగునీటి వసతి, వర్షపాతం, విద్యుత్ తదితర అంశాలపై అవగాహన కల్పించేవారు. ఎలాంటి పంటలు వేసుకోవాలో కూడా సూచించేవారు. ప్రతీ గ్రామంలో రైతు చైతన్య యాత్రలు జరగడం వల్ల కిందిస్థాయిలో రైతులకు, అధికారులకు మధ్య సంబంధాలు ఉండేవి. కానీ ఇప్పుడు రైతు చైతన్య యాత్రలు నిలిచిపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**లక్షలాది రైతులకు దూరం**

గతంలో రైతు చైతన్య యాత్రలకు వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, పశు సంవర్ధకశాఖ తదితర అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేవారు. సీజన్‌కు సన్నద్ధతపై వివరించేవారు. కొత్త వంగడాలు, విత్తనాలు ఎప్పుడు చల్లాలి, ప్రభుత్వ పథకాలు, ఎలాంటి పంటలకు డిమాండ్ ఉందనే విషయాలను చెప్పేవారు. సీజన్‌ను త్వరగా ప్రారంభించేలా చైతన్యం కలిగించేవారు. అలాగే వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించేవారు. పంట రుణాలపై బ్యాంకర్లు చెప్పేవారు. మోటార్లకు విద్యుత్ అందించే విషయంలో వివరించేందుకు విద్యుత్ అధికారులు.. సాగునీటి వసతి, కాలువల్లో నీటిని వదిలే విషయాలను వెల్లడించేందుకు నీటిపారుదల అధికారులు హాజరయ్యేవారు. ఇతరత్రా అన్ని రకాల వివరాలను చెప్పేందుకు రెవెన్యూ అధికారులు కూడా వచ్చేవారు. ఒకరకంగా రైతులకు ఇదో వర్క్‌షాప్ మాదిరిగా ఉండేది. ఇలా రాష్ట్రంలోని మొత్తం 12 వేల గ్రామాల్లో చైతన్య యాత్రలు నిర్వహించేవారు. దాదాపు 10 లక్షల మంది హాజరయ్యేవారని వ్యవసాయవర్గాలు చెప్పాయి.

**ప్రత్యామ్నాయంగా నిలవని రైతు వేదికలు**

రాష్ట్రంలో ప్రభుత్వం దాదాపు 2,500 రైతు వేదికలను ఏర్పాటు చేసింది. ఒక్కో ఏఈవో కేంద్రంగా వీటిని నెలకొల్పింది. వాటిల్లో రైతులకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేసింది. కానీ రైతు వేదికలు ఆ మేరకు సేవలు అందించలేకపోతున్నాయన్న విమర్శలున్నాయి. రైతు చైతన్య యాత్రలు ప్రతీ గ్రామంలో కొనసాగేవి. కానీ రైతు వేదికలు చైతన్య యాత్రలకు ప్రత్యామ్నాయంగా నిలవడం లేదు. అదీగాక కిందిస్థాయిలో ఉన్న ఏఈవోలకు రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించే పరిస్థితి లేదు. అలాగే, రైతు వేదికలకు వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్య, విద్యుత్, సాగునీటిపారుదల తదితర శాఖల అధికారులు వచ్చే పరిస్థితి లేదు. గత నెలన్నర రోజులుగా అకాల వర్షాలతో లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నా రైతులకు సలహాలు ఇవ్వడంలో వ్యవసాయశాఖ వైఫల్యం కనిపిస్తోంది. కనీసం క్షేత్రస్థాయికి వెళ్లడానికి కూడా రాష్ట్రస్థాయి అధికారులు ఆసక్తి ప్రదర్శించడంలేదన్న ఆరోపణలున్నాయి. కాగా, వ్యవసాయ అధికారులకు రైతుబంధు, రైతుబీమా పనులు, ఇతరత్రా రోజువారీ సమాచార సేకరణ, ఆ డేటా అప్‌లోడ్ వంటి పనులతోనే సరిపోతోందన్న వాదన ఉంది.

# ఐశ్వర్యారెడ్డి అంత్యక్రియలు పూర్తి



నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్ (హైదరాబాద్): అమెరికాలో దుండగుల కాల్పుల్లో ఇటీవల మృతి చెందిన తాటికొండ ఐశ్వర్యారెడ్డి (26) అంత్యక్రియలు గురువారం నాగోల్ వైకుంఠధామంలో జరిగాయి. హుడా కాలనీకి చెందిన ఐశ్వర్య ఎంఎస్ కోసం అమెరికా వెళ్లి.. చదువు పూర్తయ్యాక అక్కడే స్థిరపడ్డారు. టెక్సాస్ రాష్ట్రంలోని అలెన్ పట్టణంలో ఫర్‌ఫెక్ట్ జనరల్ కాంట్రాక్ట్ సంస్థలో మూడేళ్లుగా ప్రాజెక్టు మేనేజర్‌గా పని చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం అలెన్ ప్రీమియర్ షాపింగ్‌మాల్‌లో దుండగులు కాల్పులు జరపగా ఆమె అక్కడికక్కడే మృతి చెందడం తెలిసిందే. ఆమె మృతదేహం బుధవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంది. ఐశ్వర్య తండ్రి తాటికొండ నర్సిరెడ్డి రంగారెడ్డి జిల్లా కోర్టులో ఆర్థిక వివాదాల పరిష్కారాల కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. కుమార్తె మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆమె భౌతికకాయానికి విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి నివాళులర్పించారు.



# మావోయిస్టులకు డబ్బులు చేరవేస్తున్న నలుగురి అరెస్ట్

- రూ.76.57 లక్షలు స్వాధీనం
- నిందితులు తునికాకు కాంట్రాక్టర్లు




వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఎస్పీ సురేందర్‌రెడ్డి

భూపాలపల్లి: మావోయిస్టులకు భారీ మొత్తంలో నగదు అప్పజెప్పేందుకు వెళ్తున్న నలుగురిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వారినుంచి రూ.76.57 లక్షల నగదు, మందులు, పేలుడు సామగ్రితోపాటు పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో కాటారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహదేవ్‌పూర్ రోడ్డులోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ దగ్గర పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఒక నల్ల స్కార్పియో (డబ్ల్యూబీ 94పీ 4855) వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో భారీ మొత్తంలో డబ్బు, పేలుడు సామగ్రి, పలు వస్తువులు కనిపించాయి. దీంతో వాహనం, అందులోని నలుగురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విచారణలో నిందితులు తాము చేసిన నేరాన్ని ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు.

**తునికాకు టెండర్లు వచ్చినందుకు...**

కరీంనగర్‌కు చెందిన బీడీ కాంట్రాక్టర్ అబ్దుల్ అజీజ్‌కు కొంతకాలం కిందట ఆత్రం నారాయణ అనే వ్యక్తి ద్వారా నిషేధిత మావోయిస్టులైన వర్గీస్, భాస్కర్, దిలీప్, ఉంగ, వెల్లాల్ పరిచయమయ్యారు. 2014 నుంచి సదరు మావోయిస్టులను కలిసి వారి అవసరాలను గుమస్తా మారుపాక రామయ్య, నారాయణ ద్వారా తీర్చేవాడు. 2022లో అజీజ్ మంచిర్యాల జిల్లాలో తునికాకు టెండర్లు పొందినప్పుడు మావోయిస్టులకు రూ.13 లక్షలు ఇచ్చాడు. అజీజ్ ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లోని భద్రకాళి, నకుల్నార్, డిప్లా బీడీ లీఫ్ యూనిట్లు దక్కించుకున్నందున అధిక మొత్తంలో పార్టీకి ఫండ్ ఇవ్వాలని మావోయిస్టులు చెప్పారు. వారి సూచన మేరకు అజీజ్.. తన సోదరుడు మహ్మద్ అబ్దుల్ రజాక్, గుమస్తాగా పనిచేసే ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జనగామ రాఘవ్, పశ్చిమబెంగాల్‌కు చెందిన కారు డ్రైవర్ కౌసర్ అలీ డబ్బు తీసుకొని స్కార్పియోలో వెళ్తున్నారు. రూ.76,57,000 నగదుతోపాటు ట్యాబ్, గిలిటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్, నాలుగు మొబైల్స్, మందులు తీసుకొని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

# తెల్లవారితే పెళ్లి.. అంతలోనే విషాదం

- విద్యుదాఘాతంతో వరుడు మృతి
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన




భూక్య యాకుబ్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: తెల్లవారితే ఆ ఇంట్లో పెళ్లి.. బంధువులు, మిత్రులు ఒక్కొక్కరుగా చేరుకుంటున్నారు. పెళ్లి కోసం బాజా భజంత్రీల వారు వచ్చేశారు. అంతలోనే ఆ ఇంట్లో పెను విషాదం చోటు చేసుకుంది. వరుడు విద్యుదాఘాతంతో చనిపోవడంతో బాజా భజంత్రీలు మోగాల్సిన ఇంట్లో చావు డప్పు మోగింది. మహబూబాబాద్ జిల్లా కొమ్ముగూడెం గ్రామంలో గురువారం ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భూక్య బాలాజీ-శాంతి దంపతుల కుమారుడు యాకుబ్ (22) సికింద్రాబాద్‌లో రైల్వేశాఖ పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిపై కోచ్ పెయింటింగ్ పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. యాకుబ్‌కు గార్ల మండలానికి చెందిన ఓ యువతితో రెండు నెలల క్రితం వివాహం నిశ్చయం కాగా పది రోజుల క్రితం అతడు ఇంటికి వచ్చాడు. శుక్రవారం అర్ధరాత్రి 2.25 గంటలకు (తెల్లవారితే శనివారం) వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ఇంటిలోని హౌస్‌లో నీరు నింపేందుకు యాకుబ్ ఆవరణలో గల బోర్ మోటారు స్విచ్ ఆన్ చేయబోయాడు. అక్కడ ఉన్న విద్యుత్ తీగ సరిగా లేకపోవడంతో దానిని సరిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. ఇది గమనించిన బంధువులు అతడిని హుటాహుటిన చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. యాకుబ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# కూతురిని నరికి చంపి..

**మద్యంమత్తులో సైకోలా మారి..**

- సమీపంలోని కిరాణాషాపు యజమానిపై కూడా గొడ్డలితో దాడి
- నిందితుడిని పోలీసుస్టేషన్‌కు తరలిస్తుండగా అడ్డుకున్న గ్రామస్తులు
- వాహనం అద్దాలు ధ్వంసం, పోలీసులపై కర్రలు.. కారంపొడితో దాడి
- పెద్దపల్లి జిల్లా మంథని మండలం భట్టుపల్లిలో ఉద్రిక్తత



పోలీస్ వాహనం ముందు కర్రలు వేసి, అద్దాలు పగుల గొట్టిన దృశ్యం



నిందితుడు సదయ్య


మంథని: తండ్రి మద్యం మత్తు, రాక్షసత్వానికి పదేళ్ల చిన్నారి బలైపోయింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన గుండ్ల సదానందం భార్య పదినెలల క్రితం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వీరికి కొడుకు అంజి, కూతురు రజిత(10) ఉన్నారు. రజిత ప్రస్తుతం ఐదోతరగతి చదువుతోంది. సదానందం కొన్నాళ్లుగా మద్యానికి బానిసై, గ్రామంలో సైకోగా ప్రవర్తిస్తున్నాడు. పలువురిపై దాడికి సైతం దిగాడు. గురువారం ఉదయం మద్యంమత్తులో ఇంటికి వచ్చిన సదానందం కూతురు రజితపై దాడి చేశాడు. గొడ్డలితో చిన్నారి మెడపై వేటువేయడంతో అక్కడికక్కడే చనిపోయింది. రక్తపు మరకలతో ఉన్న గొడ్డలిని తీసుకుని సమీపంలోని కిరాణాదుకాణానికి వెళ్లాడు. దుకాణ యజమాని దూపం శ్రీనివాస్‌పై దాడి చేయగా తీవ్రగాయమైంది. అనంతరం సదానందం ఇంటికి వెళ్లిపోయాడు. కొడుకు అంజి ఇంటికి రాగా.. రక్తపుమడుగులో ఉన్న తన సోదరి మృతదేహాన్ని చూసి కేకలు వేయడంతో చుట్టు పక్కలవారు వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. నిందితుడిని పోలీసువాహనంలో స్టేషన్‌కు తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు.

**బండరాళ్లు అడ్డుపెట్టి.. కారంతో దాడిచేసి**

పోలీస్‌వాహనం ముందుకెళ్లకుండా కర్రలు, బండరాళ్లు అడ్డుపెట్టారు. వాహనం అద్దాలు ధ్వంసం చేశారు. హంతకుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మంథని సీఐ సతీశ్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఎంత చెప్పినా వినలేదు. ఈ క్రమంలో కొందరు పోలీసులపై కారంపొడి చల్లి దాడికి దిగారు. మూడుగంటలపాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో అదనపు బలగాలను దింపారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ అక్కడికి చేరుకొని నిందితుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు శాంతించారు. బాలిక మేనమామ కొత్తపల్లి సుమన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## క్లుప్తంగా...

### దుర్గమ్మ సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ దంపతులు గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జస్టిస్ శరత్‌కు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

### చట్టాలపై నైపుణ్యం పెంచుకోవాలి



సాక్షి, హైదరాబాద్: గ్రామస్థాయిలో పనిచేసే పారా లీగల్ వలంటీర్లు కూడా సాగు చట్టాలపై నైపుణ్యం పెంచుకోవాలని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి, జడ్జి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. నల్సార్ వర్సిటీలో వలంటీర్లకు సాగు చట్టాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. శిక్షణలో భాగంగా పలు చట్టాలపై గోవర్ధన్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఎల్ఈఏఎఫ్ఎస్ సంస్థ చైర్మన్ సునీల్.. వలంటీర్ల సందేహాలను నివృత్తి చేశారు. నల్సార్ వర్సిటీ వైస్ చాన్సలర్ శ్రీ కృష్ణదేవరావు వందన సమర్పణ చేశారు.

### చరిత్రపై లోతైన అధ్యయనం చేయాలి




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రాంత చరిత్రపై పరిశోధకుల బృందం లోతైన అధ్యయనం చేయాలని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తుశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ కోరారు. చరిత్ర పరిశోధకుడు రామోజు హరగోపాల్ రచించిన తెలుగు రాతి రాత 'తొలుచు వ్రాన్లు', 'తెలంగాణ చరిత్ర తొవ్వలో'.. రెండు పరిశోధన పుస్తకాలను గురువారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో చరిత్ర పరిశోధకుల బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ రంగారెడ్డి జిల్లా కీసరగుట్టలో జరిపిన పరిశోధనలో వెలుగు చూసిన తొలుచు వ్రాన్లు శాసనమే తొలి తెలుగు రాతి రాత శాసనంగా గుర్తింపు పొందడం సంతోషకరమని చెప్పారు. చారిత్రక పరిశోధక పుస్తకాలను రచించిన రామోజు హరగోపాల్, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిని మంత్రి సన్మానించారు.

### బీఐఎస్‌కు కేంద్ర మంత్రి చౌబే అభినందన

సాక్షి, హైదరాబాద్: వివిధ ఉత్పత్తుల ప్రమాణాలను పెంపొందించడంలో హైదరాబాద్‌లోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఎంతో కృషి చేస్తోందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజాపంపిణీ శాఖ మంత్రి అశ్విని కుమార్ చౌబే అభినందించారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని బీఐఎస్‌లో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో భారతీయ ప్రమాణాల పాత్రను నొక్కి చెప్పారు. సాంకేతిక సంస్థల ద్వారా ఇటువంటి కార్యశాలలను మరింతగా పెంచాలని సూచించారు.


### జేపీఎస్‌లకు మద్దతుగా గ్రామాలను కదిలిస్తాం



జేపీఎస్‌ల నిరసన సందర్భంగా వంటావార్పులో పాల్గొన్న కోదండరాం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయకుండా మొండిగా వ్యవహరిస్తే వారి ఉద్యమానికి మద్దతుగా గ్రామాలను కదిలిస్తామని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులను బెదిరించి, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా ఉద్యోగం చేయించడం సరైన చర్య కాదన్నారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన ధర్నాలో కోదండరాం పాల్గొని సంఘీభావం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులే లేకపోతే తెలంగాణకు జాతీయ అవార్డులు వచ్చేవి కావన్నారు. జాతీయ స్థాయిలో 79 అవార్డులు తెలంగాణకు వస్తే ఈ ఒక్క సంవత్సరమే 13 అవార్డులు రాష్ట్రానికి దక్కడానికి పంచాయతీ కార్యదర్శుల పనితనమే కారణమన్నారు. ప్రొబేషన్ ముగిసినా జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయకుండా ప్రభుత్వం మాట తప్పిందని మండిపడ్డారు.

# నూరేళ్ల పంటలో.. ఎన్నో వింతలు



**ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులు**

- పెళ్లి పెటాకులయ్యేందుకు ఇప్పుడు క్షణాలు చాలు
- అతితక్కువ మన దేశంలోనే..
- పలు దేశాల్లో తగ్గిపోయిన పెళ్లిళ్లు.. జరిగినా లేటు వయసులోనే..!
- అమెరికా, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, యూకేలాంటి దేశాల్లో ఈ పరిస్థితి
- సహజీవనాలు పెరగడం, గర్భ నిరోధక సాధనాలు అందుబాటులో ఉండటం, స్త్రీ..పురుష సమానత్వం, చట్టాల్లో వస్తున్న మార్పులే కారణం
- చైనా, రష్యా, బంగ్లాదేశ్‌ల్లో పెరుగుతున్న వివాహాలు

కంచర్ల యాదగిరిరెడ్డి

**అన్యోన్యంగా ఉంటే.. పెళ్లి నూరేళ్ల పంట! లేదంటే.. రోజూ ఒక తంటా! మాటా మాటా పెరిగితే... విడాకుల మంట!**

చిత్రంగా..వివాహం ఏడేడు జన్మల అనుబంధం అని నమ్మే భారతావనిలోనూ..సుప్రీంకోర్టు తీర్పు పుణ్యమా అని విడాకులు ఇప్పుడు క్షణాల మాటగా మారిపోయాయి. ఇంతోటి దానికి వివాహం ఎందుకు అనుకుంటున్నారో ఏమో కానీ మొత్తం మీద ప్రపంచవ్యాప్తంగా పెళ్లిళ్లే తగ్గిపోయాయి. అయ్యే ఆ కొద్ది వివాహాలు కూడా కాస్త లేటు వయసులో జరుగుతున్నాయి. లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లు పెరగడం ఇందుకు ఒక కారణంగా కన్పిస్తోంది.

### ఈ మూడు అంశాల వల్లే..

వైవాహిక వ్యవస్థలో వచ్చిన ఈ మార్పులకు కారణాలేమిటని విశ్లేషిస్తే స్థూలంగా మూడు అంశాలు కనిపిస్తాయి. మొట్టమొదటగా చెప్పుకోవాల్సింది గర్భ నిరోధక సాధనాలు అందుబాటులో ఉండటం. రెండో అంశం పురుషులతో సమానంగా మహిళలు కూడా ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తుండటం. ఇక మూడో కారణం అన్ని దేశాల్లోనూ వైవాహిక వ్యవస్థకు సంబంధించిన చట్టాల్లో మార్పులు వస్తుండటం.. పెళ్లి కాని వారి హక్కుల పరిరక్షణనూ ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవడం. ఏ రకమైన కుటుంబం కావాలన్న దానిపై యువత స్పష్టమైన ఆలోచనలు కలిగి ఉండటం కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చు. పలు దేశాల్లోని ప్రస్తుత పరిస్థితులను ఒకసారి చూద్దాం.

### చాలా దేశాల్లో అరుదుగానే పెళ్లిళ్లు..

అగ్రరాజ్యం అమెరికాలో గత వందేళ్లలో ఎన్నడూ చూడని స్థాయికి పెళ్లిళ్లు తగ్గిపోయాయి. 1920లో ప్రతి వెయ్యిమంది జనాభాకు ఒక ఏడాది కాలంలో పెళ్లి చేసుకునే వారి సంఖ్య 12 మంది దాకా ఉంటే, ఇది క్రమేపీ తగ్గుతూ 2018 నాటికి కేవలం ఏడుకు చేరుకోవడం గమనార్హం. దక్షిణ కొరియాలో ఆరుకు, ఆస్ట్రేలియాలో 5.2కు, లండన్‌లో 4.6కు, ఇటలీలో మరింత తక్కువగా అంటే 3.2కు చేరుకుంది. అయితే కొన్ని దేశాల్లో మాత్రం వివాహాలు పెరుగుతున్నాయి. చైనా, రష్యా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ఇరవై ఏళ్ల క్రితంతో పోలిస్తే వివాహాలు ఎక్కువ అవుతున్నాయని అంతర్జాతీయ స్థాయి సంస్థల గణాంకాలు చెబుతున్నాయి.

'ఏ వయసుకు ఆ ముచ్చట' అంటారు పెద్దోళ్లు. కానీ ఇప్పుడు ఈ పరిస్థితి అస్సలు లేదు. దేశంలో యాభై ఏళ్ల క్రితం పదహారు, పదిహేడేళ్లకే పెళ్లిళ్లు జరిగిపోయి.. పిల్లల్ని కూడా కనేవారు. కానీ ఇప్పుడు? పాతికేళ్ల తరువాతే పెళ్లి గురించి ఆలోచన చేస్తున్నారు. చదువుసంధ్యలు పూర్తి చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడి.. నాలుగు రాళ్లు వెనకేసుకున్న తరువాత కానీ వివాహ బంధంలోకి అడుగుపెట్టరాదని అనుకుంటున్నారు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి. పెళ్లి చేసుకునే వయసు చాలా పెరిగిపోయింది. ముఖ్యంగా ధనిక దేశాల్లో.. మహిళల విషయంలో లేటు మ్యారేజీలు ఎక్కువవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. స్వీడన్‌ను ఉదాహరణగా తీసుకుంటే 1990లలో సగటు పెళ్లీడు (మహిళలు) 28 ఏళ్లు కాగా.. 2017 నాటికి ఇది 34కు చేరింది. అయితే బంగ్లాదేశ్‌తో పాటు ఆఫ్రికాలోని పలు దేశాల్లో మాత్రం దశాబ్దాలుగా పెళ్లీడు అనేది చాలా తక్కువగా ఉండటం గమనార్హం. నైజర్‌లో 17 ఏళ్లకే ఆడపిల్లకు పెళ్లి చేసేస్తున్నారు. భారత్‌లో పెళ్లీడు 1992లో 19.20 ఏళ్లుగా ఉండేది. 2015 నాటికి ఇది 21.40కు చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

### వయసు మీరుతున్నా...

### విడాకుల్లో హెచ్చు తగ్గులు

ఒకప్పుడు విడాకులంటే నలుగురిలో చర్చనీయాంశం. ఇప్పుడు పక్కింటిలోనూ పట్టించుకునే పరిస్థితి లేదు. అంత సాధారణమైపోయింది. దీన్ని బట్టి ప్రపంచం మొత్తమ్మీద విడాకులు పెరిగిపోయాయన్న అంచనాకు వస్తే మాత్రం తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే విషయం అంత స్పష్టంగా ఏమీ లేదు. మొత్తంగా చూస్తే విడాకులు తీసుకునే వారి సంఖ్య పెరుగుతున్నప్పటికీ వివరాల లోతులకు వెళ్లిన కొద్దీ పరిస్థితుల్లో చాలా తేడాలు కనిపిస్తాయి. అమెరికాలో 1950 ప్రాంతంలో ప్రతి వెయ్యిమంది జనాభాకు విడాకుల శాతం 2.6గా ఉంటే యునైటెడ్ కింగ్‌డమ్‌లో కేవలం 0.70గా ఉండింది. 1980 నాటికి అమెరికాలో ఈ సంఖ్య రెట్టింపు కాగా ఆ తరువాత కాలంలో మాత్రం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. 2018 నాటి లెక్కలు పరిశీలిస్తే విడాకుల సంఖ్య 2.90గా ఉన్నట్లు తెలుస్తోంది. కొరియా, నార్వే, యునైటెడ్ కింగ్‌డమ్‌లాంటి దేశాల్లోనూ విడాకులు తీసుకునే వారి సంఖ్య ఒక దశ వరకూ గణనీయంగా పెరిగి ఆ తరువాత తగ్గుతూ వస్తోంది. టర్కీ, ఐర్లాండ్, మెక్సికోలలో మాత్రం ఇప్పటికీ పెరుగుతూనే ఉండటం గమనార్హం. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే విడాకుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుతం చాలామంది ఎక్కువ కాలం కలిసి ఉన్న తరువాతే విడిపోతుండటం.


### అక్కడ ఎక్కువ.. ఇక్కడ తక్కువ

విడాకులు ఏ దేశంలో ఎక్కువ.. ఏ దేశంలో తక్కువ అన్న విషయంలో పలు అధ్యయనాలు, సర్వేలు రకరకాల ఫలితాలు వెల్లడించినప్పటికీ.. భారత్ విషయంలో మాత్రం అన్ని అధ్యయనాలు ఏకగ్రీవంగా చెబుతున్న మాట.. ఇక్కడ విడాకులు శాతం ప్రపంచంలోనే అతి తక్కువ(1%) అని. ఈ అధ్యయనాల ప్రకారం తర్వాతి స్థానాల్లో వియత్నాం, ఇరాన్ వంటివి ఉన్నాయి. అత్యధిక విడాకుల కేసులు నమోదవుతున్న దేశాల్లో పోర్చుగల్, మాల్దీవులు, లక్సెంబర్గ్, స్పెయిన్, రష్యా, ఉక్రెయిన్ వంటివి ఉన్నాయి.

### కారణాలివే..

**అక్రమ సంబంధాలు, ఆర్థిక ఇబ్బందులు, సరైన కమ్యూనికేషన్ లేకపోవడం, వాగ్వాదాలు, ఘర్షణలు, ఊబకాయం, వాస్తవికత లోపించిన అంచనాలు, సాన్నిహిత్యం లేకపోవడం, అసమాన్యత, హింస, అలవాట్లు వంటివి విడాకులు తీసుకునేందుకు ఉన్న సార్వజనీన కారణాలు.**

### ఇక్కడ ఒక్కసారి కమిట్ అయితే అంతే..



ఒక్కసారి కమిట్ అయితే.. జీవితాంతం కలిసుండాల్సి వచ్చే దేశాలు రెండే రెండు. ఒకటి వాటికన్ సిటీ. రెండోది ఫిలిప్పీన్స్. ఇక్కడ చట్టపరంగా విడాకులు తీసుకునేందుకు అస్సలు అవకాశమే లేదు. కాకపోతే ఫిలిప్పీన్స్‌లో ముస్లింలు షరియా చట్టం కింద విడాకులు పొందే అవకాశముంది. సేమ్ సెక్స్ మ్యారేజెస్‌కూ విడాకులను వర్తింపజేసిన తొలి దేశంగా నెదర్లాండ్స్ 2000లో రికార్డు సృష్టించింది. తరువాతి కాలంలో ఇప్పటివరకు సుమారు 30 దేశాల్లో ఇదే తరహా చట్టాలు చేశారు.

**అమెరికాలోని న్యూయార్క్, మిసిసిపీ రాష్ట్రాల్లో భార్య లేదా భర్త అక్రమ సంబంధాలు కలిగి ఉన్నారని నిరూపించగలిగితే 'ఏలియనేషన్' ఆఫ్ అఫెక్షన్ కింద నష్టపరిహారం కోరుతూ కేసులేయవచ్చు.**

**అల్యూటియాన్ దీవుల్లో పురుషులకు భార్యంటే మోహం మొత్తితే.. వస్తు మార్పిడి మాదిరిగా ఆహారం లేదా దుస్తుల కోసం వదిలించుకోవచ్చు! కెనడాకు పశ్చిమంగా... జపాన్‌కు తూర్పు దిక్కున ఉంటాయీ ద్వీపాలు.**

### పెళ్లికి.. పిల్లలకు సంబంధం లేదు!

వైవాహిక వ్యవస్థలో ఇటీవలి కాలంలో కనిపిస్తున్న అతిపెద్ద ట్రెండ్ పెళ్లికి, సంతానం కలిగి ఉండటానికి మధ్య సంబంధం లేకపోవడం. అంటే.. పిల్లల్ని కనాలనుకుంటే కనడం మినహా అందుకు పెళ్లి తప్పనిసరి అన్న భావన తొలగిపోతోందన్నమాట. మరీ ముఖ్యంగా ఈ ధోరణి ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) దేశాల్లో గణనీయంగా పెరిగిపోతోందని తెలుస్తోంది. సుమారు 38 దేశాలు సభ్యులుగా ఉన్న ఓఈసీడీలో పెళ్లి కాకుండా... లేదా సహజీవనం ద్వారా పిల్లల్ని కంటున్న వాళ్లు లేదా పెంచుకుంటున్న వారి శాతం 1960లతో పోలిస్తే ఎన్నో రెట్లు ఎక్కువైంది. కోస్టారికాలో సుమారు 70 శాతం మంది పిల్లల జననానికి పెళ్లిళ్లతో సంబంధం లేదు. ఇది మెక్సికోలో 65 శాతంగా, డెన్మార్క్‌లో 52 శాతంగా ఉంది. నెదర్లాండ్స్ (48), స్లొవేకియా (38), జర్మనీ (35) తరువాతి స్థానాల్లో ఉన్నాయి. గణాంకాలు అందుబాటులో ఉన్న దేశాల్లో చిట్టచివరన ఉన్నది కొరియా (1.9 శాతం).

### 99 ఏళ్ల వయసులో విడాకులు!

**99 ఏళ్ల వయసులో విడాకులు తీసుకున్న వ్యక్తిగా 2011లో ఓ ఇటాలియన్ రికార్డు సృష్టించాడు. అరవై ఏళ్ల వైవాహిక జీవితం తరువాత భార్య తన ప్రియుడికి నలభై ఏళ్ల క్రితం రాసిన ప్రేమలేఖలు ఈయన కంటపడ్డాయి. అంతే 96 ఏళ్ల భార్యతో తెగతెంపులు చేసేసుకున్నాడు. 1934లో జరిగిన వీరి పెళ్లి.. 2011లో పెటాకులైంది**

# నవ్వులు శాశ్వతం కావాలంటే మొక్కలు నాటాలి

స్టాండప్ కమెడియన్ కపిల్ శర్మ



సాక్షి, హైదరాబాద్: 'మన నవ్వులు శాశ్వతం కావాలంటే మొక్కలు నాటాలి.. మొక్కలతోనే మనిషికి సరిపడా ఆక్సిజన్ దొరుకుతుంది.. అప్పుడే ఆరోగ్యంగా ఉంటాడు'అని ప్రముఖ స్టాండప్ కమెడియన్, హాస్యనటుడు కపిల్ శర్మ అన్నారు. గురువారం గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ముంబై గోరేగావ్‌లోని 'దాదా సాహెబ్ పాల్కే చిత్రాంగిరి ఫిల్మ్ సిటీ'లో ఎంపీ, గ్రీన్ చాలెంజ్ సృష్టికర్త జోగినపల్లి సంతోష్ కుమార్‌తో కలిసి కపిల్ శర్మ మొక్కలు నాటారు. కార్యక్రమం ఎంతో ఉన్నత ఆశయంతో కూడుకున్నదని ప్రశంసించారు. 'సంతోష్ కుమార్ ప్రారంభించిన 'గ్రీన్ చాలెంజ్'నా మనసును కదిలించింది. 'మనం మన కోసం కాదు.. ఇతరుల కోసం కూడా'అనే భావన నాలో కలిగించింది. ఈ నేలపై మన భవిష్యత్ తరాలు బావుండాలని తలపెట్టిన ఒక అద్భుతమైన కార్యక్రమం ఇది. దీనిని మనం ఓ బాధ్యతగా ముందుకు తీసుకుపోవాల్సి ఉంది. యావత్ దేశ ప్రజలంతా ఈ చాలెంజ్‌లో పాల్గొనాలని కోరుకుంటున్నాను'' అని కపిల్ శర్మ పేర్కొన్నారు.

# రేషన్ డీలర్లూ.. సమ్మె వద్దు

**22న రేషన్ డీలర్ల సంఘాలతో సమావేశం: మంత్రి గంగుల**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రేషన్ దారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు రానివ్వద్దనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ నేపథ్యంలో రేషన్ డీలర్లు సమ్మె ఆలోచనలను విరమించుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. రేషన్ డీలర్ల సమస్యలపై గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పౌరసరఫరాల కమిషనర్ వి.అనిల్ కుమార్, అధికారులు ఉషారాణి, లక్ష్మీభవానితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి గంగుల మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 17,220కు పైగా రేషన్ షాపులు ఉన్నాయనీ, ఈ డీలర్లందరికీ కలిపి నెలకు రూ.12 కోట్ల పైచిలుకు కమీషన్ రూపంలో అందజేస్తున్నామని వివరించారు. ప్రధాన డిమాండ్ అయిన కమీషన్ పెంపు విషయమై ఇప్పటికే పలు దఫాలుగా డీలర్లతో చర్చించామని చెప్పారు. మిగిలిన సమస్యల పరిష్కారంపై కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 22న రేషన్ డీలర్ల సంఘాలతో సమావేశమవుతామని, ఈలోగా సమ్మె ఆలోచన విరమించుకోవాలని సూచించారు.

# సమ్మెపై ప్రతిష్టంభన!

- కొనసాగించేందుకే జేపీఎస్‌ల నిర్ణయం...
- పరిణామాలపై మంత్రి ఎర్రబెల్లి, ఉన్నతాధికారుల సమీక్ష

సాక్షి, హైదరాబాద్: జూనియర్ పంచాయతీ సెక్రటరీ(జేపీఎస్)ల సమ్మె, సమస్యల పరిష్కారం విషయంలో అటు ప్రభుత్వం, ఇటు నిరసనకారులు తమ తమ వాదనలకే కట్టుబడడంతో ప్రతిష్టంభన నెలకొంది. సమ్మెను విరమించి విధుల్లో చేరాల్సిందేనని పంచాయతీరాజ్ శాఖ అల్టిమేటమ్ ఒకవైపు అమల్లో ఉండగా, ప్రభుత్వపక్షాన ఏదో ఒక హామీ ఇస్తే తప్ప వెనక్కు తగ్గేది లేదంటూ జేపీఎస్‌లు పట్టుబడుతున్నారు. శుక్రవారానికి సమ్మె 15వ రోజుకు చేరుకోనుండగా, ఈ సమస్యను ఏ విధంగా కొలిక్కి తీసుకు రావాలనే విషయంలో రెండువైపులా స్పష్టత కొరవడింది. గురువారం సచివాలయంలో సమ్మెకు సంబంధించిన అంశాల, విధుల్లో ఎంత మంది చేరారు, తదితర పరిణామాలపై పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్‌లతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్షించారు. జిల్లాల్లో సమ్మె ప్రభావం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ల నుంచి పీఆర్‌శాఖ ఉన్నతాధికారులు సమాచారం సేకరించారు. గత మంగళవారం సాయంత్రం 5 లోగా విధుల్లో చేరకపోతే ఉద్యోగాల్లోంచి తొలగిస్తామన్న హెచ్చరికలను ఆచరణలో పెట్టే విషయంలో మాత్రం ప్రభుత్వం ఆచితూచి స్పందిస్తోంది. ఇలాంటి నోటీసులు ఏవైనా జారీ అయ్యి, ఎవరైనా టర్మినేషన్ ఉత్తర్వులు అందుకుంటే వాటిని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించాలనే ఆలోచనతో సమ్మెలో ఉన్న ఉన్న జేపీఎస్ లున్నారు. ఇక గత 14 రోజులుగా జేపీఎస్‌లు నిరవధిక సమ్మెను కొనసాగిస్తుండడంతో గ్రామాల్లో వారు నిర్వహించే వివిధ రకాల సేవలపై ఆ ప్రభావం కనిపించడం మొదలైంది. ప్రభుత్వపరంగా జేపీఎస్‌ల స్థానంలో ప్రత్యామ్నాయంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, సెర్ప్ ఉద్యోగులు, ఇతర గ్రామ స్థాయిల ఉద్యోగులను ఇన్‌చార్జిలుగా నియమించినా పెద్దగా ప్రయోజనం ఉండడం లేదన్న వాదనలే వ్యక్తమవుతున్నాయి.

# సమ్మె విరమించి విధుల్లో చేరండి..

**జేపీఎస్‌లను చర్చలకు పిలవలేదు: ఎర్రబెల్లి**

సాక్షి, హైదరాబాద్: సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్)ను రాష్ట్రప్రభుత్వం చర్చలకు పిలిచిందని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం తరపున తాను గానీ, మరెవరు కానీ వారిని చర్చలకు పిలవలేదని, అలాంటి ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. జేపీఎస్‌లు ఉద్యోగాల్లో చేరేటపుడు ఒప్పుకున్న నిబంధనలు, కుదుర్చుకున్న ఒప్పందాలకు విరుద్ధంగా చేస్తున్న సమ్మెను వెంటనే విరమించి విధుల్లో చేరాలని గురువారం ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బుధవారం జేపీఎస్‌లు తనతో ఫోన్లో తమ సమస్యలు విన్నవిస్తే.. ముందుగా సమ్మె విరమించాలని సూచించినట్టు మంత్రి తెలిపారు. అయితే దీనిని కొందరు ప్రభుత్వం చర్చలకు పిలిచిందంటూ తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. సమ్మెతో ప్రభుత్వాన్ని శాసించాలని అనుకోవడం తప్పు అని హితవు పలికారు. సంఘాలు పెట్టబోమని, యూనియన్లలో చేరబోమని, సమ్మెలు చేయమని.. ప్రభుత్వానికి బాండ్ రాసి జేపీఎస్‌లు విధుల్లో చేరిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు.




పాలకుర్తి: జనగామ జిల్లా పాలకుర్తి మండలం మల్లంపల్లిలో మూడేళ్ల క్రితం పంపిణీ చేసిన గిరక తాళ్లు పెరిగి కల్లు గీసే స్థాయికి ఎదిగాయి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం గిరక తాటిచెట్టెక్కి కల్లు తీసి తాగారు. హైదరాబాద్‌లో ప్రారంభించిన నీరా కేఫ్‌కు మంచి స్పందన వస్తోందని ఈ సందర్భంగా చెప్పారు.



### ఇక్కడ ఎవరైనా ఉన్నారా?

చిలుకూరు: గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండడంతో గ్రామ పంచాయతీలను పట్టించుకొనే వారు లేరు. ఇందుకు నిదర్శనమే ఈ చిత్రం. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని రాంచంద్రానగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గదిలోకి గురువారం ఒక ఆవు వచ్చి నిలబడింది. ఇక్కడ ఎవరూ లేరా అని ప్రశ్నించినట్లుగా అటూ ఇటూ చూసి కొద్దిసేపటికి బయటకు వెళ్లిపోయింది. రోజూ గ్రామ పంచాయతీ కార్యాలయాలను తెరుస్తున్నారు కానీ ఆ గదుల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు ఎవరూ ఉండడం లేదు.

# రాష్ట్రానికి పదేళ్ల పండుగ!

**తెలంగాణ పదో ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా 'దశాబ్ది ఉత్సవాలు'**



- సంవత్సరమంతా నిర్వహించేలా ప్రణాళిక.. ప్రస్తుతానికి వారం పాటు కార్యక్రమాలు
- అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ ఆలోచన
- ప్రతిష్టాత్మక పథకాల అమలు, మారిన స్థితిగతులపైనే ప్రధాన ఫోకస్
- 2014లో తెలంగాణ వచ్చినప్పుడు, ఇప్పుడు.. ఆయా వర్గాల పరిస్థితేమిటి?
- సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య రంగాల్లో వచ్చిన మార్పులేమిటనే వివరాల సేకరణ
- ఎన్నికల ఏడాది కావడంతో ప్రజల మన్ననలు పొందే వ్యూహం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయి పదో ఏట అడుగుపెడుతున్న సందర్భంగా 'దశాబ్ది ఉత్సవాల' నిర్వహిణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. 2014 జూన్ 2న తెలంగాణ ఏర్పడగా.. 2023 జూన్ 2వ తేదీన పదో వసంతంలోకి అడుగుపెడుతోంది. ఈ క్రమంలో గత తొమ్మిదేళ్ల అవలోకనాన్ని గుర్తుచేసుకుంటూ.. ఉత్సవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రం ఏర్పడిన రోజున వివిధ రంగాల్లో తెలంగాణ పరిస్థితి, ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను గణాంకాలతో సహా ప్రజల ముందుంచాలని భావిస్తోంది. ఎన్నికల ఏడాదికావడంతో.. క్షేత్రస్థాయిలో ఉత్సవాలతో ప్రజల మన్ననలు పొందాలనే ఆలోచనకు వచ్చింది. ఈ కార్యక్రమానికి జూన్ 1వ తేదీన శ్రీకారం చుట్టనున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

### అప్పుడు.. ఇప్పుడు.. వివరాలివ్వండి!

ఏటా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ ఏడాదిలో సాధించిన పురోగతికి సంబంధించిన వివరాలను అన్ని శాఖలు ప్రభుత్వానికి అందజేసేవి. ఈసారి కూడా అలా వివరాల సేకరణపై ఆర్థిక శాఖ దృష్టి పెట్టింది. అయితే ఒక్క ఏడాది కాకుండా.. గత తొమ్మిదేళ్లలో రాష్ట్రంలోని అన్ని శాఖల పరిధిలో జరిగిన పురోగతి వివరాలను సేకరిస్తోంది. ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ప్రతి శాఖ నుంచి పూర్తిస్థాయిలో వివరాలు తెప్పించుకుంటున్నారు. రెండు రోజుల్లో డేటా పంపాలని ఆర్థిక శాఖ నుంచి అన్ని శాఖలకు సమాచారం అందింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రత్యేకంగా ఈ పనిని పర్యవేక్షిస్తున్నారు. సేకరించిన వివరాలను ప్రత్యేకంగా క్రోడీకరించనున్నారు. సీఎస్ సూచనల మేరకు ప్రతి శాఖతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన సావనీర్‌లను రూపొందించే పనిలో ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమైంది. ఈ సావనీర్‌లు, కాఫీ టేబుల్ కేలండర్లలో ఆయా శాఖల్లో 2014 నాటి పరిస్థితి ఏమిటి? ప్రస్తుత పరిస్థితి ఏమిటన్న వివరాలను పొందుపరుస్తున్నారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ శాఖల్లో ఇదే కసరత్తు జరుగుతోంది.

### ప్రతిష్టాత్మక పథకాలపై ఫోకస్

తెలంగాణ ఏర్పాటైన తర్వాత ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమల్లోకి తెచ్చింది. ఆసరా పింఛన్ల పెంపు, రైతుబంధు, దళిత బంధు, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సబ్సిడీ గొర్రెల పంపిణీ, ఉచిత చేప పిల్లల పంపిణీ, ధాన్యం ఉత్పత్తిలో రికార్డు, అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల ఏర్పాటు వంటివి.. రాష్ట్ర సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య రంగాల్లో అనేక మార్పులు తీసుకువచ్చాయి. ఈ పథకాలకు సంబంధించిన గణాంకాలతోపాటు.. వాటి అమలు ద్వారా వచ్చిన మార్పును కళ్లకు కట్టినట్టు ప్రజలకు వివరించేలా ఈ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### ప్రజల మన్ననలు పొందేలా..

ఎన్నికల ఏడాది కావడంతో గత తొమ్మిదేళ్లలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం ద్వారా వారి మన్ననలు పొందడమే ఈ దశాబ్ది ఉత్సవాల ఉద్దేశమని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఏ పథకం అమలు చేసినా గణంకాలు మారుతుంటాయని.. కానీ ఆయా పథకాలు, ప్రాజెక్టుల ద్వారా సమాజంలో వచ్చిన మార్పును వివరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అంటున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు ద్వారా ప్రజలకు పాలనను చేరువగా తీసుకువచ్చామని.. ప్రతీ జిల్లాలో సమీకృత కలెక్టరేట్ల ద్వారా జిల్లా అధికార యంత్రాంగమంతా ఒకేచోట ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని వివరించనున్నట్టు సమాచారం. అద్భుతంగా నిర్మించిన నూతన సచివాలయం, తెలంగాణ ఏర్పాటుకు స్ఫూర్తి నిచ్చిన బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ స్థాపన, తెలంగాణ ఉద్యమం, అమరుల త్యాగాలను గుర్తు చేసుకునేలా అమరవీరుల స్మారకం, అమరజ్యోతి వంటి వాటిని సగర్వంగా చాటాలని భావిస్తున్నట్టు తెలిసింది.

### ఏడాది పాటు ఉత్సవాలు..

దశాబ్ది ఉత్సవాలను ఈ ఏడాది జూన్ 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 2వ తేదీ వరకు నిర్వహించాలని.. చివరి రోజున ప్రత్యేకంగా వేడుకలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కానీ మధ్యలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో.. తొలుత ఈ ఏడాది జూన్ 1 నుంచి వారం రోజుల పాటు ఉత్సవాలకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ వారం రోజుల పాటు గ్రామస్థాయి నుంచి హైదరాబాద్ దాకా వివిధ దశల్లో ఉత్సవాలు నిర్వహించాలని భావిస్తోంది. దీనికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను ప్రభుత్వ వర్గాలు త్వరలో ఖరారు చేయనున్నాయి.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 12 । మే । 2023



**నర్సులు.. సేవామూర్తులు**
సిస్టర్ అనగానే ఎలాంటి పరిస్థితిలో ఉన్నా చిరునవ్వుతో బెడ్ వద్దకు వచ్చి ఏమైందంటూ పలకరించే సేవామూర్తి నర్సు. నేడు నర్సుల దినోత్సవం. - 10లో▸



**అంజన్న జయంతికి ఏర్పాట్లు**
హనుమాన్ పెద్ద జయంతికి కొండగట్టు ఆలయం ముస్తాబైంది. ఈనెల 12 నుంచి 15 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. 14న జయంతిని నిర్వహిస్తారు. - 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0/26.0

**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### క్వింటాల్ పత్తి రూ.7,450



మిల్లులో కొనుగోలు చేసిన పత్తి

**జమ్మికుంట(హుజూరాబాద్):** స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,450 పలికింది. గురువారం మార్కెట్‌కు 38 వాహనాల్లో 540 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,200, కనిష్ఠ ధర రూ.6,700ను వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 8 మంది రైతులు 9 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,000, కనిష్ఠ ధర రూ.5,500కు కొనుగోలు చేశారు. మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

### రేపు ఓపెన్ ఇంటర్ ఆర్థిక శాస్త్రం పరీక్ష

**కొత్తపల్లి(కరీంనగర్):** ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా రద్దయిన ఆర్థిక శాస్త్రం పరీక్షను ఈనెల 13వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో జనార్దన్ రావు, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన పరీక్ష కేంద్రాల్లోనే ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు చెల్లించిన అభ్యర్థులు హాజరయ్యేలా అభ్యాసన కేంద్రాల కో ఆర్డినేటర్లు సమాచారం అందించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఓపెన్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి 19వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు.

### సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకావాలి

**సప్తగిరికాలనీ(కరీంనగర్):** పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 14 నుంచి 22 వరకు జరుగనున్న నేపథ్యంలో ఫెయిల్ అయిన విద్యార్థులు హాజరు కావాలని డీఈవో సీహెచ్ జనార్దన్ రావు తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 26లోపు ఫీజు చెల్లించాలని, రూపాయలు 50 అపరాధ రుసుంతో పరీక్షలకు రెండు రోజుల ముందు వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రీ కౌంటింగ్ కోసం విద్యార్థులు రూ.500, రీ వెరిఫికేషన్ కోసం రూ.1000 చొప్పున ఒక్కో సబ్జెక్టుకు 15 రోజులలోగా ఎస్‌బీఐ ద్వారా డీడీ చెల్లించాలని సూచించారు.

# తరుగు పేరిట దోపిడీ

- తొలుత కొనుగోలు కేంద్రాల్లో, తరువాత మిల్లుల్లో చేతివాటం
- తేమ, గడ్డి, మట్టిబెడ్డల పేరుతో 2 కిలోలు తరుగు
- అదే కారణంతో మిల్లులలో మరోసారి ధాన్యం కోత
- క్వింటాలుకు తొమ్మిది కిలోలకుపైగా వడ్లకు కన్నం
- కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కు?



కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో కొనుగోళ్లు

| జిల్లా | సాగు (ఎకరాల్లో) | దిగుబడి అంచనా (మె.టన్నుల్లో) |
|---|---|---|
| కరీంనగర్ | 2,71,388 | 7.5 లక్షలు |
| పెద్దపల్లి | 2,00,033 | 4 లక్షలు |
| జగిత్యాల | 2,97,638 | 7 లక్షలు |
| సిరిసిల్ల | 1,71,008 | 3 లక్షలు |

**సాక్షి ప్రతినిధి, కరీంనగర్:** వడగండ్ల గండాలు దాటి మిగిలిన పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన రైతులు రకరకాలుగా దోపిడీకి గురవుతున్నారు. కోతల పేరుతో మిల్లర్లంతా ఏటా రూ.వందల కోట్ల దందా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేస్తున్న విషయం తెలిసిందే. మొన్నటి దాకా అకాల వర్షాలు, వడగండ్లతో చాలావరకు పంటనష్టం జరిగింది. చివరికి చేతికి వచ్చిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే.. తేమ, గడ్డి, తాలు ఉందంటూ రకరకాల కారణాలు చెప్పి రెండు కిలోల మేర తరుగు తీస్తున్నారు. వాస్తవానికి 40.600 కిలోల బస్తా కోసం 650 గ్రాముల (సంచి బరువు)కు మించి తరుగు తీయవద్దన్న నిబంధనను ఉమ్మడి జిల్లాలో ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు-మిల్లర్లు కలిసే ఈ దందా చేస్తున్నారని అన్నదాతలు మండిపడుతున్నారు.

**క్వింటాలుకు ఎనిమిది కిలోలు..**
ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో తేమ సాకుతో చాలామంది మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కుప్పలు తడిసిన విషయం తెలిసిందే. గత వంద ఏళ్లలో ఎన్నడూ చూడని విపత్తును ఇటీవల రైతులు ఎదుర్కొన్నారు. కల్లాల్లోని ధాన్యం ఇంకా ఆరనే లేదు. 20శాతం వరకు తేమ ఉన్నా కొంటామని ప్రభుత్వం చెప్పినా.. క్షేత్రస్థాయిలో ఈ నిబంధన ఉల్లంఘనకు గురవుతోంది. తేమతోపాటు వరిధాన్యంలో మట్టిబెడ్డలు, గడ్డి, తాలూ ఉన్నాయంటూ సాకులు చెబుతూ.. కొనుగోలు కేంద్రంలో బస్తాకు రెండు కిలోలు తరుగు తీస్తున్నారు. అనంతరం మిల్లుకు వెళ్లిన ధాన్యం తూకం ఎంట్రీ చేసే సమయంలో మరో రెండు కిలోల చొప్పున కోత పెడుతున్నారు. మొత్తంగా క్వింటాలుకు రెండు నుంచి తొమ్మిది కిలోల చొప్పున ధాన్యం తరుగు తీస్తున్నారు. ఇదేం అన్యాయమని నిలదీసిన రైతుల ధాన్యం కొనమని తెగేసి చెబుతున్నారు.

**పెద్దపల్లిలో ప్రారంభం కాని కొనుగోళ్లు..**
సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్‌లో తరుగు మోసాలు నడుస్తుంటే పెద్దపల్లిలో మాత్రం కథ మరోలా ఉంది. జిల్లాలో ప్రభుత్వం 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించింది. కానీ.. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు కేవలం 62,245 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. క్వింటాకు 6 నుంచి 7 కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే కొనుగోలు చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. తరుగు లేకుండా మిల్లర్స్‌కు తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవడం లేదు.

### నెలరోజులుగా కేంద్రాల్లోనే..



మాకు ఉన్న పొలంతోపాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాం. చేతికొచ్చిన పంటను నెలరోజుల క్రితం సెంటర్‌కు తీసుకొచ్చి ఆరబోసినం. వర్షాలు పడుతుండటంతో సద్ది తెచ్చుకొని ఇక్కడే తింటూ ధాన్యం తడవకుండా కాపాలకాస్తున్నాం. తేమ, తాలు పేరుతో తరుగు పెడుతున్నారు. వచ్చినకాడికి అమ్ముకుందామన్నా మిల్లర్లు ధాన్యం దించుకోవటం లేదని కాంటాలు పెట్టడం లేదు. **- బాలసాని రాజమణి, సుద్దాల**

### రెండున్నర కిలోలు అధికం



నాకు నాలుగెకరాల వ్యవసాయ పొలం ఉంది. ఆ భూమిలో దాదాపు 58 క్వింటాళ్ల వడ్లు అయ్యాయి. వాస్తవానికి ప్రతీసారి 120 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ.. ఈసారి వడగళ్లు, అకాల వర్షాల కారణంగా దిగుబడి పడిపోయింది. తేమ 17శాతం ఉంటేనే కొంటున్నారు. మా వద్ద బస్తాను 40 కిలోలకు రెండున్నర కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు. **- మాడుగుల లింబాద్రి, సిరిసిల్ల**

### కోతలు పెడితే మిగిలేదేంటి



రెండున్నర ఎకరాల్లో వరి వేస్తే వచ్చిన దిగుబడే తక్కువ. 70 క్వింటాళ్ల ధాన్యం వస్తదనుకుంటే మాయదారి వానతో సగం కూడా రాలేదు. ఇప్పుడు అమ్మితే బస్తాకు 2 కిలోలు కోత పెడుతున్నారు. ఇదెక్కడి న్యాయం. ఈసారి వానలతోటి నష్టపోయినం. ఇప్పుడు కొనుగోలు కేంద్రాలల్ల నష్టపోతున్నం. **- లక్ష్మి, గంగాధర**

### వృద్ధుల పోషణ ఫిర్యాదులకు వెబ్ పోర్టల్



**కరీంనగర్:** తెలంగాణ దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ సూచనల మేరకు ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్ వయోవృద్ధుల పోషణ ఫిర్యాదులకు వెబ్ పోర్టల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరాధరణకు గురైన తల్లిదండ్రులు లేదా వయోవృద్ధుల పోషణ చూసుకోని పిల్లలపై ఆన్‌లైన్‌లో సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసెస్ మానిటరింగ్ సిస్టం వెబ్ పోర్టల్ tsseniorcitizens.cgg.gov.in లో సెల్‌ఫోన్ లేదా ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. నమోదైన ఫిర్యాదులకు ఈ మోడలింగ్ సిస్టం ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పరిపాలన అధికారి వి.రఘుపతి, నాయబ్ తహసీల్దార్ కె.సుమన్, సీనియర్ సహాయకురాలు ఎస్.పావని, టెక్నికల్ మేనేజర్ జి.చంద్రమౌళి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

### బాక్సింగ్ ఎంపిక పోటీలు

**కరీంనగర్ స్పోర్ట్స్:** బాక్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి యూత్ బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు తమ ప్రతిభ చాటారు. పోటీల్లో రాణించిన మర్రి సాయి ప్రశాంత్, బొందల అశోక్‌లను ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్‌కుమార్, బాధ్యులు జి.మురళి, ఎం.శ్రీకాంత్, కోచ్ పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

## 'మనఊరు- మనబడి' జూన్ 1 నాటికి పూర్తిచేయాలి

**కరీంనగర్:** జిల్లాలో చేపడుతున్న మనఊరు-మనబడి, హెల్త్ సబ్ సెంటర్‌ల నిర్మాణ పనులను జూన్ ఒకటి నాటికి పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఏఈలు, ఎస్ఎంసీ చైర్మన్‌లతో మన ఊరు-మనబడి, హెల్త్ సబ్ సెంటర్ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ మండలానికి ఒకటి చొప్పున మంజూరైన హెల్త్ సెంటర్‌ల నిర్మాణ పనులకు టెండర్ ప్రక్రియను మే చివరి నాటికి పూర్తికావాలన్నారు. పాఠశాలలకు వచ్చే ప్రతి స్టాకును సంబంధిత రిజిష్టర్లలో నమోదు చేయాలని, నిర్మాణాలు పూర్తయ్యాక బిల్లలు చెల్లింపులో ఎటువంటి ఆలస్యం ఉండొద్దని పేర్కొన్నారు. ఎంపీడీవోలు మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించి త్వరగా పూర్తిచేసేలా చూడాలన్నారు. సమావేశంలో డీఈవో జనార్దన్ రావు, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, ఈఈలు, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా

## రూ.20ది 50.. రూ.50ది 100

- స్టాంపు వెండర్ల అక్రమ దందా!
- అధిక ధరలకు స్టాంపు పేపర్ల అమ్మకం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 161 వెండర్ లైసెన్సులు
- అదనంగా దోచుకుంటున్న స్టాంపువెండర్లు
- పట్టించుకోని రిజిస్ట్రేషన్ అధికారులు

“ కరీంనగర్ కోర్టు పరిధిలోని ఓ న్యాయవాది రూ.100 స్టాంప్ పేపర్ కొనుగోలు చేయడానికి కోర్టు సమీపంలోని ఒక స్టాంపువెండర్ దగ్గరికి వెళ్లాడు. రూ.40 అదనంగా చెప్పి రూ.140 తీసుకొని స్టాంపు పేపర్ ఇచ్చాడు. ఇదేమిటి అని అడిగితే ఉన్నది ఉన్నట్లు అమ్మితే మాకు ఏం మిగిలుతుందని ముఖం మీదే చెప్పేశాడు.

కరీంనగర్ కలెక్టరేట్ గేటు ఎదురుగా ఉన్న ఓ స్టాంపువెండర్ వద్దకు వెళ్లిన ఓ ఉద్యోగి స్టాంపుపేపర్ కావాలని అడిగాడు. రూ.50 స్టాంపుపేపర్ కావాలంటే రూ.30 అదనంగా చెల్లించాలని చెప్పాడు. ఎందుకని అడిగితే 'కావాలంటే తీసుకో.. లేదంటే వెళ్లిపో' అని సమాధానం ఇచ్చాడు.

**కరీంనగర్‌క్రైం:** స్టాంపు పేపర్లను నచ్చిన ధరలకు అమ్ముకుంటూ స్టాంపువెండర్లు అక్రమాలకు తెర తీస్తున్నారు. వివిధ రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్లు, నోటరీలకు వినియోగించే స్టాంపుపేపర్ల కోసం నిత్యం వందలాదిమంది స్టాంపువెండర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే వీరి అవసరాన్ని ఆసరాగా తీసుకుంటూ అందినకాడికి దోచుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి స్టాంపు వెండర్ లైసెన్సులు కలిగినవారికి స్టాంపు పేపర్లు అసలు ధరలకు అమ్మితేనే లాభం ఉంటుంది. కానీ అదనంగా లాభాలు గడించాలనే ఉద్దేశంతో రూ.20 నుంచి రూ.50వరకు వసూలు చేస్తున్నారు.

**బాదుడే లక్ష్యంగా..**

- ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 161 స్టాంపు వెండర్ లైసెన్సులు, 14 ఫ్రాంకింగ్ మిషన్ లైసెన్సులు ఉన్నవారు ఉన్నారు. సాధారణ ధరలకన్నా అదనంగా చెల్లిస్తేనే స్టాంపువెండర్లు స్టాంపు పేపర్లు విక్రయిస్తున్నారు.
- కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులో ఉన్న ఎక్కువ మంది స్టాంపు వెండర్లు అసలు ధరకన్నా రూ.20 నుంచి రూ.30వరకు ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



- ఇక కోర్టు సమీపంలోని పలువురు స్టాంపు వెండర్లు రూ.50వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు న్యాయవాదులు తెలిపారు. నోటరీ కోసం కోర్టు వద్దకు రోజుకు వందలసంఖ్యలో వస్తుంటారు. వీరినుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదేంటంటే.. 'కొంటే కొను.. లేకుంటే లేదు' అని సమాధానం ఇస్తున్నారు.
- ప్రస్తుతం స్టాంపుపేపర్ల వినియోగం పెరిగిపోయింది. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, నోటరీలు, రెవెన్యూ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు, భూమి, ఆస్తుల అగ్రిమెంట్లు, వాహనాల అమ్మకాలు, కొనుగోలు ఒప్పందాలు, లీజులు, భూ రిజిస్ట్రేషన్లు ఇలా అన్నింటికి స్టాంపుపేపర్లు తప్పనిసరిగా మారాయి.
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రోజుకు 8వేల నుంచి 10వేల వరకు స్టాంపుపేపర్ల అమ్మకాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రజలపై రోజుకు రూ.లక్ష వరకు అదనపుభారం పడుతోంది.
- ఇంత జరుగుతున్నా రిజిస్ట్రేషన్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇకనైనా రిజిస్ట్రేషన్ అధికారులు ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపే స్టాంపువెండర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం



స్టాంపు వెండర్లు ఉన్న ధరలకే అమ్మకాలు జరపాలి. కానీ కొంతమంది ఎక్కువ ధరలకు విక్రయాలు జరుపుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలితే చర్యలు తీసుకొని లైసెన్సులు రద్దు చేస్తాం. **- జి.ప్రసూన, జిల్లా రిజిస్ట్రార్**

## మహిళలకు అండగా షీ టీం

- అడిషనల్ డీసీపీ శ్రీనివాస్
- 'శ్రీచైతన్య'లో మహిళల భద్రత, సైబర్ క్రైంపై అవగాహన



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ శ్రీనివాస్

**తిమ్మాపూర్(మానకొండూర్):** మహిళలకు అండగా షీ టీం పని చేస్తుందని అడిషనల్ డీసీపీ(ఎల్ అండ్‌వో) శ్రీనివాస్ అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ పోలీస్ సహకారంతో మహిళల భద్రత, సైబర్ క్రైం, డ్రగ్స్, ర్యాగింగ్ నిరోధంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్ మొదలు చెడు వ్యసనాలకు అలవాటు కావొద్దన్నారు. తల్లిదండ్రుల కళలను నెరవేర్చాలని సూచించారు. ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డ్రగ్స్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలని చెప్పారు. ఏఆర్ ఏసీపీ ప్రతాప్ మాట్లాడుతూ.. సైబర్ మోసాలకు గురికావొద్దన్నారు. సైబర్ మోసాలు, ర్యాగింగ్ నిరోధానికి చేసే సూచనలు పాటించాలని కోరారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు వివరిస్తూ డ్రగ్స్, ర్యాగింగ్ చట్టాలు చాలా తీవ్రంగా ఉంటాయని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే డయల్ 100 లేదా 1930కు ఫోన్ చేయాలని లేదా ఎస్‌వోఎస్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్, తిమ్మాపూర్ సీఐ రమేశ్, ఎస్సై ప్రమోద్‌రెడ్డి సూచించారు.

## 'దోస్త్' పిలుస్తోంది!

- విడుదలైన నోటిఫికేషన్
- డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం
- విద్యార్థుల వేటలో 'ప్రయివేటు' పీఆర్వోలు
- తమ కాలేజీలోనే చేరాలంటూ ప్రచారం

**కరీంనగర్ సిటీ:** ఇంటర్ ఫలితాలు వెలువడడంతో డిగ్రీలో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి గురువారం దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈనెల 11 నుంచి జూలై 5వ తేదీ వరకు మూడు దశల్లో ప్రవేశాలకు ఆహ్వానిస్తోంది. నోటిఫికేషన్‌కు ముందు నుంచే ప్రయివేటు డిగ్రీ కాలేజీల పీఆర్‌వోలు ఇంటర్ విద్యార్థుల వేటలో పడ్డారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థుల సమాచారం సేకరించిన నిత్యం ఫోన్‌లో టచ్‌లో ఉంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. తమ కళాశాలలోనే చేరే విధంగా రాయితీల వర్షం కురిపిస్తున్నారు.

**రంగంలోకి పీఆర్వోలు, లెక్చరర్లు**

- శాతవాహనయూనివర్సిటీ పరిధిలోని ప్రతీ ప్రయివేటు కాలేజీ యాజమాన్యం విద్యార్థులను చేర్పించుకునేందుకు ప్రత్యేకంగా పీఆర్వోలను నియమించుకుంటున్నాయి. వీరితో పాటు అధ్యాపకులకూ టార్గెట్లు విధిస్తున్నారు. వీరు పొద్దున్నే గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ ఇంటర్ పాసైన విద్యార్థులను గురించి ఆరా తీస్తున్నారు.
- కాలేజీల మధ్య పోటీ నెలకొనడంతో విద్యార్థులను చేర్పిస్తే పీఆర్వోలకు, లెక్చరర్లకు ఒక్కో విద్యార్థికి రూ.4వేల నుంచి రూ.6వేల వరకు చెల్లిస్తున్నారని సమాచారం. విద్యార్థులకు సైతం పలురకాల ఆఫర్లు, ప్యాకేజీలు, డిస్కౌంట్ ప్రకటిస్తున్నారు.
- మరికొందరు అడుగుముందుకేసి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసి సమీపంలోని ఆలయాలు, దర్శనీయస్థలాలకు కూడా తిప్పుతున్నారు. వారిని వెంటతీసుకెళ్లి కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకున్న తర్వాతనే ఇంటికి పంపిస్తున్నారు.
- కొన్ని కాలేజీ యాజమాన్యాలు మొదట బస్సు సౌకర్యం ఉచితం అని ప్రకటిస్తుండగా.. మరికొన్ని కాలేజీలు ఇన్‌కం సర్టిఫికెట్ ఇస్తే చాలు అంతా తామే చూసుకుంటామంటూ హామీలు ఇస్తున్నాయి. డిగ్రీ ప్రవేశాలు ఎంతో పారదర్శకంగా నిర్వహించాలనే లక్ష్యంతో దోస్త్‌ను తీసుకొస్తే.. ప్రయివేటు నిర్వాహకులు అడ్డదారిలో వెళ్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
- మొదట ఆఫర్లు ప్రకటిస్తూ.. తర్వాత మాట మారుస్తూ విద్యార్థులను ముప్పుతిప్పలు పెడుతున్నాయని ఆరోపణలున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలేజీలో మొదట అడ్మిషన్ ఫ్రీ అని, తర్వాత అడ్మిషన్ ఫీజు చెల్లిస్తేనే మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు తీసుకుంటామని మెలికపెట్టారని బాధిత సీనియర్ విద్యార్థులు తెలిపారు. మరోకాలేజీ బస్సు సౌకర్యం ఉచితం అని, మూడు నాలుగు నెలల తర్వాత డబ్బులు వసూలు చేశారని పలువురు చెబుతున్నారు.
- అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా కొన్ని కాలేజీలు విద్యార్థులకు సెల్‌ఫోన్లు, ట్యాబ్‌టాప్‌లు కూడా ఆఫర్ చేస్తున్నట్లు తెలిసింది. అడ్మిషన్లు అయ్యే వరకూ ఒక మాట, సర్టిఫికెట్లు ఇచ్చిన తర్వాత మరోమాట మాట్లాడుతున్నారని పలువురు విద్యార్థులు తెలిపారు. ఇప్పటికేనా యూనివర్సిటీ అధికారులు ప్రయివేటు కాలేజీల అక్రమాలకు అడ్డుకట్టవేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.




**శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలు**

| | | | |
|---|---|---|---|
| ప్రభుత్వ | 15 | ప్రైవేట్ | 86 |
| ఎయిడెడ్ | 02 | మొత్తం | 103 |

**దోస్త్ 2023-24 ముఖ్య తేదీలు**

| | |
|---|---|
| నోటిఫికేషన్ జారీ | 11- 5- 2023 |
| మొదటి దశ రిజిస్ట్రేషన్లు | మే 16- జూన్10 (రుసుం రూ.200) |
| వెబ్ ఆప్షన్లు | మే 20- జూన్ 11 |
| సీట్ల కేటాయింపు | జూన్ 16 |
| కళాశాలలో చేరే సమయం | జూన్ 16- 25 |

రెండో దశ రిజిస్ట్రేషన్లు జూన్ 16- 25 వరకు (రుసుం రూ.400)
వెబ్ ఆప్షన్ జూన్ 16- 27 వరకు
రెండో దశసీట్ల కేటాయింపు జూన్ 30
కళాశాలలో చేరే సమయం జూలై1 - 5వరకు

మూడో దశ రిజిస్ట్రేషన్ జూలై1- 5 వరకు..
వెబ్ ఆప్షన్ జూలై 1- 6 వరకు
సీట్ల కేటాయింపు జూలై 10
కళాశాలలో చేరే సమయం జూలై 10- 14లోపు
తరగతులు ప్రారంభం జూలై 17వ తేదీ నుంచి

## క్లుప్తంగా

### ఎకరాకు రూ.10 వేల పరిహారమివ్వండి

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్‌ నగేశ్‌



మాట్లాడుతున్న నగేశ్‌

విద్యానగర్‌(కరీంనగర్‌): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం అందించి, ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్‌ కె.నగేశ్‌ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. గురువారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలు, ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలులో ఆలస్యం చేస్తుండటంతో మొలకెత్తుతోందని తెలిపారు. రైతుబంధు అంటూ అన్నదాతలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో నాయకులు రాజేశ్వర్‌, ఎండీ.బేగ్‌, రవీందర్‌ రెడ్డి, ఆంజనేయులు, ఎండీ.ఆరిఫ్‌, అజారుద్దీన్‌, శ్రీనివాస్‌, పోచం, హారతి, స్వరూప, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

### ‘ఉపాధి’ కూలీపై తేనెటీగల దాడి



బాధితురాలి పరిస్థితి తెలుసుకుంటున్న ప్రవీణ్‌

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని శాలపల్లి ఇందిరానగర్‌ గ్రామంలో గురువారం ఉపాధిహామీ పనులకు వెళ్లిన అదరి రోహిణిపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఆమె గాయపడి, తీవ్ర అస్వస్థతకు గురైంది. స్థానికులు వెంటనే సర్పంచ్‌ కొడిగూటి శారద భర్త ప్రవీణ్‌కు సమాచారం అందించారు. స్పందించిన ఆయన గ్రామానికి సర్పంచ్‌ అందజేసిన ఉచిత అంబులెన్స్‌లో రోహిణిని హనుమకొండలోని ఓ ఆసుపత్రికి తరలించారు.

### ఆర్టీసీ డిప్యూటీ చీఫ్‌ పర్సనల్‌ మేనేజర్‌గా బాధ్యతలు



కరీంనగర్‌: ఆర్టీసీ కరీంనగర్‌ జోన్‌ డిప్యూటీ చీఫ్‌ పర్సనల్‌ మేనేజర్‌గా ఎ.విలాస్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పర్సనల్‌ ఆఫీసర్‌ ఆదిలాబాద్‌గా పనిచేసి, పదోన్నతిపై కరీంనగర్‌ జోన్‌కు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి డిప్యూటీ చీఫ్‌ పర్సనల్‌ మేనేజర్‌గా పని చేస్తున్న ఎం.చంద్రయ్య నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌ రీజియన్‌ పర్సనల్‌ ఆఫీసర్‌గా ఉన్న రమణారెడ్డి పదోన్నతిపై బస్‌ భవన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో చంద్రయ్య కరీంనగర్‌ రీజియన్‌ పర్సనల్‌ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ప్రమోషన్‌పై వచ్చిన, బదిలీపై వెళ్తున్న అధికారులకు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

# నర్సులు.. సేవామూర్తులు

- వృత్తే దైవంగా రోగులకు సేవలు
- నేడు వరల్డ్‌ నర్సింగ్‌ డే

కరీంనగర్‌టౌన్‌: సిస్టర్‌.. అనగానే ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా.. చిరునవ్వుతో బెడ్‌ వద్దకు వచ్చి ఏమైందంటూ పలకరించే సేవామూర్తి నర్సు. రోగి అవసరం ఏదైనా చిటికెలో తీర్చడమో.. తీర్చేందుకు ప్రయత్నించడమో చేస్తూ పేషెంట్లకు భరోసా కల్పిస్తారు. రోగులు కొన్ని సందర్భాల్లో పట్టించుకోలేదంటూ నోరుజారినా.. వాటిని దీవెనల్లాగానే భావిస్తారు. పైకి గంభీరంగా కనిపించినా పేషెంట్‌ ప్రాణాలు కాపాడటమే అంతిమ లక్ష్యంగా పని చేస్తుంటారు. నేడు వరల్డ్‌ నర్సింగ్‌ డే సందర్భంగా వారి సేవలపై ప్రత్యేక కథనం.

**క్యాజువాలిటీ నుంచి అత్యవసర విభాగం వరకు..**

పేషెంట్లు ఎలాంటి జబ్బులతో ఆసుపత్రికి వచ్చినా నర్సులు తమ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. క్యాజువాలిటీ నుంచి ఐసీయూ, జనరల్‌ వార్డులు, శస్త్రచికిత్స, అత్యవసర విభాగాలు ఎక్కడైనా వీరు ఉండాల్సిందే. కొన్ని సందర్భాల్లో డాక్టర్‌ అందుబాటులో లేకున్నా క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం చూపడంలో వాళ్లకున్న అనుభవంతో ముందుకెళ్తూ రోగుల ప్రాణాలు కాపాడుతున్నారు.



**కోవిడ్‌ సమయంలో ధైర్యంగా విధులు..**

నర్సులు పగలు, రాత్రి తేడా లేకుండా తమ విధులకు అంకితమై పని చేస్తుంటారు. కోవిడ్‌ సమయంలోనూ మొక్కవోని ధైర్యంతో సేవలందించడం చూశాం. అనారోగ్య సమస్య ఏదైనా సడలని సంకల్పంతో వృత్తే దైవంగా రోగులకు సేవలందిస్తారు.

### సేవ చేయడం అదృష్టం..



నర్సింగ్‌ వృత్తి ఎంతో పవిత్రమైంది. రోగులకు సేవ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. ఏ సంబంధం లేకున్నా ఆసుపత్రికి వచ్చినవారిని ఆప్యాయంగా పలకరించి, వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తెలియజేయడం మా విధి. కొన్ని సందర్భాల్లో పేషెంట్‌ కుటుంబసభ్యులు కూడా పట్టించుకోరు. అలాంటి సమయంలో మమ్మల్ని దేవతలుగా చూస్తారు.

– విజయలక్ష్మి, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌

### దేవుడిచ్చిన వరం..



నర్సు వృత్తిని నాకు దేవుడిచ్చిన వరమని అనుకుంటున్నా. అనేక మంది రోగులకు సాయం చేశా. వారిని పేషెంట్లుగా కాకుండా సొంతవారిలా చూస్తేనే మెరుగైన వైద్య సేవలందించగలుగుతాం. అంతేకాకుండా బాధితులకు ధైర్యం చెబుతూ వారి ఆరోగ్య పరిస్థితిలో మార్పు వచ్చేలా పని చేయడం సంతృప్తినిస్తోంది. కోలుకున్నవారు కృతజ్ఞతతో చూసే చూపు మరిచిపోలేనిది.

– ఉమ, హెడ్‌ నర్సు

### రోగులకు ధైర్యం చెబుతాం..



పేషెంట్లు, వారి బంధువులు మాకు వారి అనారోగ్య సమస్యలతోపాటు బాధలు చెప్పుకుంటారు. వైద్యం విషయంలో వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలందిస్తున్నాం. డ్యూటీకి వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటాం. పేషెంట్లు మా సేవల వల్ల కోలుకుంటే అంతకంటే సంతోషం వేరే ఏముండదు.

– పుష్పలత, హెడ్‌ నర్సు

# పదోతరగతి ఫలితాల్లో ‘ట్రినిటీ’ సత్తా



విజయసంకేతం చూపుతున్న చైర్మన్‌ ప్రశాంత్‌రెడ్డి, విద్యార్థులు

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లిలోని ట్రినిటీ పాఠశాల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రిషి, శశికాంత్‌, సూర్యతేజ, విజయ్‌కుమార్‌, అశ్విత, హరిణి, హిమాని, మల్లిక, మనస్విని, నాగజ్యోతిక, సహస్ర, సాయి, అక్షయ్‌, సాయిహర్షిణి, సంజన తదితర 32 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారని విద్యాసంస్థల చైర్మన్‌ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. 33 మంది 9.8 జీపీఏ, 46 మంది 9.7, 33 మంది 9.5, 40 మంది 9.3, 38 మంది 9.2, 23 మంది 9 జీపీఏ సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతో ఏటా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌ రమేశ్‌, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ‘సిద్ధార్థ’ విద్యార్థుల విజయకేతనం



అత్యధిక గ్రేడ్‌ పాయింట్లు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్‌ శ్రీపాల్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అత్యుత్తమ జీపీఏ గ్రేడ్‌ పాయింట్లు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్‌ దాసరి శ్రీపాల్‌ రెడ్డి తెలిపారు. 11 మంది 10 జీపీఏ, 14 మంది 9.8 జీపీఏ, 21 మంది 9.7 జీపీఏ, 125 మంది 9.0, ఆపైన జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయనతోపాటు ప్రిన్సిపాళ్లు, వైస్‌ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు. తమ విద్యాసంస్థల నుంచి మొత్తం 238 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 99 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

# జిల్లా యువతికి ఆదర్శ వివాహం



రమ్య–వినయ్‌ దంపతులు

శాయంపేట: అనాథగా చిన్నప్పటి నుంచి ప్రభుత్వ బాలికా సదనంలో ఆశ్రయం పొంది, చదువుకుంది. ఈ క్రమంలో ఓ యువకుడు ఆమెను వివాహం చేసుకునేందుకు ముందుకురాగా, ఐసీడీఎస్‌ అధికారులు అన్నీతామై వారి వివాహాన్ని ఘనంగా నిర్వహించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌ జిల్లా మెతుకపల్లికి చెందిన కర్నకంటి రమ్య తల్లిదండ్రులు 2004లో చనిపోయారు. దీంతో ఆమె అనాథగా మారి, అక్కడి ప్రభుత్వ బాలికా సదనంలో చేరింది. పదో తరగతి పూర్తి చేసిన రమ్య హనుమకొండలోని కాలేజ్‌ ఎట్‌ హోంలో చేరి, ఇంటర్‌ చదువుకుంది. శాయంపేటలో మండల పరిషత్‌ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగం చేస్తున్న పత్తిపాక గ్రామానికి చెందిన అనబత్తుల వినయ్‌ ఐదు నెలల క్రితం రమ్యను వివాహం చేసుకుంటానని హనుమకొండలోని జిల్లా సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అన్నీ పరిశీలించిన అధికారులు ఆ ఇద్దరికి గురువారం ఆదర్శ వివాహం చేశారు. హనుమకొండకు చెందిన కడెం సబిత–శ్రీధర్‌ దంపతులు మెట్టెలు, మంగళ సూత్రం చేయించి, కన్యాదానం చేశారు. వేడుకల్లో ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మీబాయి, శిశు సంక్షేమాధికారి సబిత, సీడీపీవో భాగ్యలక్ష్మి, ఎంపీడీవో ఆమంచ కృష్ణమూర్తి, సర్పంచ్‌ చిట్టిరెడ్డి రాజిరెడ్డి తదితరులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# డీఈవో సూచనలతో మంచి ఫలితాలు

- టీఎస్‌జీహెచ్‌ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను



డీఈవో జనార్దన్‌రావును సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్‌: పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్‌ జిల్లా రాష్ట్రంలోనే 4వ స్థానంలో నిలిచిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) ఆధ్వర్యంలో గురువారం డీఈవో జనార్దన్‌రావును శాలువాతో సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను మాట్లాడుతూ.. డీఈవో సూచనలతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. 4వ స్థానం సాధించినందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెరుకు ప్రద్యుమ్నకుమార్‌, అసోసియేట్‌ అధ్యక్షుడు కొమ్మెర శ్రీనివాస్‌ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు విడపు శ్రీనివాస్‌, అసోసియేట్‌ అధ్యక్షుడు గొట్టె ప్రమోద్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌.పురుషోత్తం, డీసీఈబీ కార్యదర్శి ఎం.స్వదేశ్‌ కుమార్‌, గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మారెడ్డి, కృష్ణగోపాల్‌, దేవ శంకర్‌ పాల్గొన్నారు.

### ఎక్సైజ్‌ దాడులు

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రంలో ఎక్సైజ్‌ ఎస్సై మనీషారాథోడ్‌ తన సిబ్బందితో కలిసి గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 5 లీటర్ల గుడుంబా, కిలో పటిక స్వాధీనం చేసుకున్నారు. 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేస్తున్న కోట భూదమ్మ, రాజయ్యలను తహసీల్దార్‌ నాగరాజమ్మ ఎదుట బైండోవర్‌ చేశారు.

### డీఈవోను సన్మానించిన పీఆర్‌టీయూ నాయకులు



కరీంనగర్‌: జిల్లా పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ స్థానంలో నిలిపినందుకుగాను పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈవో జనార్దన్‌రావును గురువారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఎస్సెస్సీ ఫలితాల్లో కరీంనగర్‌ జిల్లాకు 4వ స్థానం రావడం జిల్లా కలెక్టర్‌, అదనపు కలెక్టర్లు, డీఈవో ప్రణాళికలు, వాటిని అమలు చేసిన ఉపాధ్యాయుల వల్లే సాధ్యమైందన్నారు. జిల్లా అసోసియేట్‌ అధ్యక్షుడు అన్నాడి మోహన్‌ రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు అబ్దుల్‌ జమీల్‌, జీవన్‌ రెడ్డి, ఉప్పు జలపతి, మల్లేశం, మల్లారెడ్డి, శ్యాంసుందర్‌ తదితరులు పాల్గొన్నారు.

### బధిర ఉద్యోగులకు అండగా ఉంటాం

- టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌



కరీంనగర్‌ అర్బన్‌: బధిర ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో వారికి అండగా నిలుస్తామని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో బధిర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ హియరింగ్‌ హ్యాండిక్యాప్డ్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ ఉమ్మడి కరీంనగర్‌ అధ్యక్షుడు బద్దం లక్ష్మారెడ్డి, నాయకులు బాబుజాన్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పరీక్షలు బాగా రాయాలని చెప్పేది

- ‘పది’లో 9.5 జీపీఏ సాధించిన ప్రజ్ఞాంత్‌ రెడ్డి
- ఏడేళ్ల క్రితం తండ్రి, పరీక్షలకు నాలుగు రోజుల ముందే తల్లి మృతి



అమ్మ రజితతో ప్రజ్ఞాంత్‌ రెడ్డి (ఫైల్‌)

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): ఏడేళ్ల క్రితం నాన్న చనిపోయాడు.. పదోతరగతి పరీక్షలకు నాలుగు రోజుల ముందే అమ్మ రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. అమ్మానాన్నను కోల్పోయిన బాధను దిగమింగుకొని, పరీక్షలకు సిద్ధమయ్యాడు కరీంనగర్‌ అలకాపురి కాలనీకి చెందిన ప్రజ్ఞాంత్‌ రెడ్డి. గత బుధవారం విడుదలైన ఫలితాల్లో 9.5 జీపీఏ సాధించాడు. మార్చి 31న కరీంనగర్‌ పద్మనగర్‌ చౌరస్తాలో రోడ్డు ప్రమాదంలో ఆ విద్యార్థి తల్లి రజిత మృతి చెందిన విషయం తెలిసిందే. అతను నగరంలోని సిద్ధార్థ పాఠశాలలో చదివాడు. అమ్మ బతికున్న రోజుల్లో పదోతరగతి పరీక్షలు బాగా రాయాలని చెప్పేదని, ఆ మాటలే నన్ను ప్రభావితం చేసి, 9.5 జీపీఏ తెచ్చుకునేందుకు కారణమయ్యాయని తెలిపాడు. తాను ఐఐటీలో చదవాలనేది అమ్మ కోరిక అని, అందులో సీటు సాధించడమే లక్ష్యమని పేర్కొన్నాడు.

# విద్యుత్‌ చౌర్యం కేసులో జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్‌): చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన పంకెర్ల రాజుకు విద్యుత్‌ చౌర్యం కేసులో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి రూ.32,940 జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించారని విద్యుత్‌ విజిలెన్స్‌ ఇన్‌స్పెక్టర్‌ స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజు తన ఇంటికి అక్రమంగా విద్యుత్‌ వినియోగిస్తూ అధికారులకు పట్టుబడ్డాడు. వారు మొదటి నేరంగా పరిగణించి, రూ.1,000 జరిమానా విధించి, వదిలేశారు. కానీ రాజు రెండోసారి విద్యుత్‌ చౌర్యానికి పాల్పడగా పట్టుకున్నారు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఎదుట విద్యుత్‌ చౌర్యానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ఎస్సైలు ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేశ్‌, సిబ్బంది ఉన్నారు.

### ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

మానకొండూర్‌: మండలంలోని చెంజర్ల శివారులో ఆర్టీసీ బస్సును ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఆర్టీసీ బస్సు కరీంనగర్‌ వైపు నుంచి వరంగల్‌ వైపు ప్రయాణికులతో వెళ్తోంది. చెంజర్ల శివారులో లారీ డ్రైవర్‌ అజాగ్రత్తగా లారీ నడిపి, బస్సును ఢీకొట్టాడు. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేశారు. ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



# ఆస్తుల రక్షణలో అప్రమత్తంగా ఉండాలి

- సింగరేణి చీఫ్‌ సెక్యూరిటీ అధికారి హన్మంతరావు



సీహెచ్‌పీ ప్రాంతంలో పరిశీలిస్తున్న జీఎం హన్మంతరావు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చీఫ్‌ సెక్యూరిటీ అధికారి హ్మనంతరావు అన్నారు. గురువారం ఆర్జీ–1 ఏరియాలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మూసివేసిన మేడిపల్లి ఓపెన్‌ కాస్ట్‌ ప్రాంతాన్ని పరిశీలించారు. బేస్‌ వర్క్‌షాప్‌, సర్వీస్‌ క్యాంటీన్‌, బంకర్‌ ఏరియాల్లోని పాత కేబుళ్లు, స్క్రాప్‌ను తొందరగా తరలించాలన్నారు. సింగరేణి స్థలాలను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మేడిపల్లి మేనేజర్‌ మల్లికార్జున్‌, సీనియర్‌ సెక్యూరిటీ ఆఫీసర్‌ వీరారెడ్డి, జూనియర్‌ ఇన్‌స్పెక్టర్‌, జె.ఉమేశ్‌, చంద శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

# కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలి

గోదావరిఖని(రామగుండం): 2022–23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి, అందులో 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని బీఎంఎస్‌ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్‌ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనిపై ఏర్పాటు చేసిన గేట్‌ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బోర్డ్‌ ఆఫ్‌ డైరెక్టర్ల సమావేశంలో రూ.32,830 కోట్ల టర్నోవర్‌ ప్రకటించారన్నారు. అదే వాస్తవ లాభాలను ప్రకటించడంలో యాజమాన్యం జాప్యం చేస్తోందని ఆరోపించారు. రక్షణ విషయంలో కోలిండియా యాజమాన్యం వైఫల్యం చెందుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ధన్‌బాద్‌లోని డీజీఎంఎస్‌ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు వడ్డేపల్లి కుమారస్వామి, వై.సారంగపాణి, మాదాసి రవీందర్‌, యాదగిరి నరేశ్‌, నీలం శ్రీనివాస్‌, ముదాం సత్తయ్య, ప్రమోద్‌ కాషాల్‌ తదితరులు పాల్గొన్నారు.

# భారీ యంత్రాల్లో క్యాబిన్‌ను మార్చండి

- ఆర్జీ–2 జీఎం మనోహర్‌

గోదావరిఖని(రామగుండం): ఓసీపీలో నడుస్తున్న భారీ యంత్రాల కంపెనీలు ఎల్‌అండ్‌టీ, కోమట్స్‌ ప్రతినిధులతో ఆర్జీ–2 జీఎం మనోహర్‌ గురువారం సమావేశమయ్యారు. బేస్‌ వర్క్‌షాప్‌లో కోమట్స్‌ యంత్రాల పనితీరును పరిశీలించారు. వాటి సామర్థ్యం, రక్షణ పరమైన ఇబ్బందులు తదితర అంశాలపై చర్చించారు. మన దేశ రోడ్డు రవాణా విధానానికి అనుగుణంగా భారీ యంత్రాల్లో క్యాబిన్‌ కుడివైపు ఉండేలా మార్పులు చేయాలన్నారు. అలాగే ఆపరేటర్లకు రక్షణకు సంబంధించిన ఏర్పాట్లపై కంపెనీ ప్రతినిధులకు తగు సూచనలు చేశారు. సమావేశంలో ప్రాజెక్టు ఇంజినీర్‌ దుర్గాప్రసాద్‌, అధికారులు పాల్గొన్నారు.

# హనుమాన్‌ పెద్ద జయంతికి సర్వం సిద్ధం

- ముస్తాబైన కొండగట్టు
- నేటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు



అంజన్న ఆలయం

జగిత్యాల: హనుమాన్‌ పెద్ద జయంతి ఉత్సవాలకు కొండగట్టు అంజన్న ఆలయం ముస్తాబైంది. ఈనెల 12 నుంచి 15 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. అంజన్న ఆలయంతో పాటు ఉప ఆలయాలకు సైతం రంగులు వేసి సిద్ధం చేశారు. దిగువ కొండగట్టు, దొంగలమర్రి జేఎన్‌టీయూ మార్గంలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది రానున్నారు. ఇప్పటికే కొంత మంది దీక్షాపరులు ఆలయానికి చేరుకున్నారు. నడకమార్గంలో రానుండటంతో వారికి ప్రమాదాలు జరగకుండా రోడ్డు వెంట రేడియం స్టిక్కర్లు, క్యూలైన్‌ వంటివి ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చలువపందిళ్లు, మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**పర్యవేక్షణకు అధికారులు**

అంజన్న సన్నిధిలో జరిగే ఉత్సవాలకు భక్తులకు ఇక్కట్లు కలగకుండా పర్యవేక్షణకు కలెక్టర్‌ షేక్‌ యాస్మిన్‌ బాషా విభాగాలను ఏర్పాటు చేసి అధికారులను నియమించారు. వివిధ శాఖల అధికారులు, ఎంపీవోలతో కో ఆర్డినేటింగ్‌ ఇన్‌చార్జిలను నియమించారు. ప్రధాన ఆలయం, క్యూలైన్‌, కొత్త, పాత కోనేరుల వద్ద ఏర్పాట్లు, అన్నదానం, కేశఖండనం, దీక్షమండపం, బేతాళస్వామి ఆలయం, ఆలయ కార్యాలయం, సానా గెస్ట్‌హౌస్‌, పార్కింగ్‌ ఏరియాలు, మెడికల్‌ క్యాంప్‌, వాటర్‌ పాయింట్స్‌, వలంటీర్లకు సౌకర్యాలు, రవాణా, విద్యుత్‌, అగ్నిమాపక రూట్‌మ్యాప్‌, బందోబస్తు, పారిశుధ్య విభాగాలుగా చేశారు. ఒక్కోదానికి తహసీల్దార్లు, ఆర్డీవోలను ఇన్‌చార్జిలుగా నియమించారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు**

హనుమాన్‌ పెద్ద జయంతి వేడుకలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజూ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సాంస్కృతిక ప్రదర్శనలు జరుగనున్నాయి.

**స్వామివారికి పోచంపల్లి పట్టు వస్త్రాలు**

మల్యాల(చొప్పదండి): కొండగట్టు అంజన్న జయంతి ఉత్సవాల సందర్భంగా స్వామివారికి సమర్పించే పట్టు వస్త్రాలు చేనేత మగ్గంపై తయారు చేసి సిద్ధం చేశారు. వారం క్రితం స్థానిక హరిత హోటల్‌లో చేనేత మగ్గంపై పోచంపల్లి పట్టు వస్త్రాలను తయారు చేయడం ప్రారంభించారు. సికింద్రాబాద్‌ శ్రీగణపతి ఆలయం ట్రస్టీ రాష్ట్ర పద్మశాలీ సంఘం కార్యదర్శి ఎస్‌ఎస్‌.జయరాజు ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను గుర్రం శ్రీను, గుర్రం సంతోష్‌కుమార్‌, జానయ్య, కరుణాకర్‌, గణేశ్‌ తయారు చేశారు.

**14న హనుమాన్‌ జయంతి**

14న జయంతిని పురస్కరించుకుని ఉదయం 9.30 గంటలకు మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం, సహస్ర నాగవల్లి దళ అర్చన, పట్టు వస్త్ర ప్రధానం, 10.30 గంటలకు యాగశాలలో మహాపూర్ణాహుతి, స్నపన తిరుమంజనం, ఉంజల సేవ, మంత్ర పుష్పము, మహానివేదన, తీర్థ ప్రసాద వితరణ, సామూహిక భజన, ఆరాధన, సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారి కుంకుమార్చన, ఓడి బియ్యం, సహస్ర దీపాలంకరణ, గరుడ వాహన సేవ, మహదాశీర్వాదము, సామూహిక భజన, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించనున్నటు ఆలయ ఫౌండర్‌ ట్రస్టీ తిరుకోవెళూరు మారుతీస్వామి తెలిపారు.

# ఆర్జీ–3 జీఎంను కలిసిన సివిల్‌ జీఎం



సివిల్‌ జీఎంను సత్కరిస్తున్న జీఎం, అధికారులు

కమాన్‌పూర్‌(మంథని): సింగరేణిలో నూతన సివిల్‌ (కార్పొరేట్‌) జీఎంగా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ గురువారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను జీఎంతోపాటు అధికారులు సత్కరించారు. ఎస్‌వోటూ జీఎంలు బైద్య, రఘుపతి, ఏరియా ఇంజినీర్‌ సీతారామం, ఫైనాన్స్‌ ఏజీఎం శ్రీనివాసులు, రక్షణ అధికారి వెంకటరమణ తదితరులున్నారు.

## క్లుప్తంగా

### డ్రెయినేజీ పనులకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్మద

కరీంనగర్ కార్పోరేషన్: నగరంలోని 11వ డివిజన్ పాత గ్యాస్‌గోదాం ప్రాంతంలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైపులైన్ పనులకు కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఈ వాణి, కాలనీవాసులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన కరీంనగర్ మండలం బొమ్మకల్‌కు చెందిన విద్యార్థులను గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంపీసీలో కాయితోజు పూజ 994/1000, కాంరెడ్డి సాయిప్రియ 993/1000 మార్కులు సాధించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ చార్టర్ అధ్యక్షుడు పురుమల్ల శ్రీనివాస్, అధ్యక్షుడు చింతల కిషన్, సభ్యులు రమణారెడ్డి, రాంరెడ్డి, నర్సింహారెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, చక్రాధర్ తదితరులు పాల్గొన్నారు.

### 'కేటీఆర్ అహంకార మాటలతో బీఆర్‌ఎస్ పతనం'



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

విద్యానగర్(కరీంనగర్): బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారపూరిత మాటలతో ఆ పార్టీ పతనం ప్రారంభం కాబోతుందని ప్రజా మిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. గురువారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని పట్టుకొని ఒక టూరిస్ట్‌లా వచ్చిపోయిందని ఎగతాళి చేసి మాట్లాడటం అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. తెలంగాణ వచ్చిన తొమ్మిదేళ్లలో ఏం అభివృద్ధి సాధించారో తేల్చాలన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని తెలిపారు. అకాల వర్షాలతో న ష్టపోయిన రైతులకు కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ స మావేశంలో దళిత నాయకులు చంద్రయ్య, నాయిని ప్రసాద్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు అజయ్, ప్రసాద్, రియాజ్ పాల్గొన్నారు.

### హన్మాన్ దీక్షాపరులకు బిక్ష



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో గురువారం హన్మాన్ దీక్షాపరులకు కాంగ్రెస్ నాయకులు మెన్నేని రోహిత్ రావు ఆధ్వర్యంలో బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుర్ర హరీశ్ గౌడ్, నరేశ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### చికిత్సపొందుతూ వృద్ధుడు మృతి

కరీంనగర్‌రూరల్: వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న అనగోని మల్లయ్య(92) గురువారం మృతి చెందాడు. ఆరెపల్లికి చెందిన అనగోని మల్లయ్య కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు ఇంట్లో గడ్డి మందు తాగి పడిపోగా కుటుంబసభ్యులు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మధ్నాహ్నం మృతిచెందాడు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని కొడుకు పర్శరాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### బాల్యవివాహాలపై అవగాహన

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో ఓ మైనర్ బాలికకు ఆదివారం వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారనే విషయం తెలుసుకున్న తహసీల్దార్, ఐసీడీఎస్ అధికారులు గురువారం గ్రామానికి చేరుకున్నారు. తల్లిదండ్రులకు బాల్యవివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఐసీడీఎస్ డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

### హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకొని నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గురువారం మేయర్ సునీల్‌రావు సౌజన్యంతో బోగ శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మేయర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ బాధ్యులు చిలకపాటి హనుమంతారావు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

### హోమం



హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని వీరహన్మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో హనుమాన్‌హోమం నిర్వహించి దీక్షాపరులకు బిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి లక్ష్మి-శ్రీనివాస్ దంపతులతో పాటు పలువురు దీక్షాపరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌రూరల్

# శ్రద్ధ పెట్టారు.. సాధించారు!

- 'పది' ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యుత్తమ జీపీఏలు
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా రాణింపు
- స్టడీ హవర్స్, తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే అంటున్న విద్యార్థులు



విజయ సంకేతంతో విద్యార్థినులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): శ్రద్ధ పెట్టి పట్టుదలతో ప్రభుత్వ పాఠశాలలో చదివారు.. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా జీపీఏ గ్రేడ్‌లు సాధించి మేము సైతం అంటూ వారితో సమానంగా నిలిచారు కరీంనగర్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. బుధవారం పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. కాగా ప్రభుత్వ పాఠశాలలు సైతం అత్యుత్తమ జీపీఏ గ్రేడ్‌లు సాధించాలనే ఉద్దేశ్యంతో పకడ్బందీ ప్రణాళికతో విద్యార్థులను సన్నద్ధం చేసి అత్యుత్తమ జీపీఏ గ్రేడ్‌లు సాధించారు. ఆర్థిక భారంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రైవేటు విద్యార్థులకు దీటుగా అత్యుత్తమ మార్కులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో ఉత్తమ గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులను 'సాక్షి' పలకరించగా వారి మనోభావాలను వెల్లడించారు.

### రోజూ 8 గంటలు చదివా..



పదో తరగతిలో 10జీపీఏ సాధించేందుకు చాలా కష్టపడ్డా. రోజుకు 6నుంచి 8గంటలు చదివా. కాని 9.8జీపీఏ గ్రేడ్ వచ్చింది. అయినా చాలా ఆనందంగా ఉంది. ఇందులో తల్లిదండ్రులు, టీచర్ల ప్రోత్సాహం ఉంది. ఇంటర్‌లో టాప్ ర్యాంక్‌లో నిలిచేందుకు కృషి చేస్తా.

- ఎస్.అక్షయ, 9.8జీపీఏ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సవరన్, కరీంనగర్

### స్టడీ హవర్స్ ఉపయోగపడ్డాయి



పదో తరగతి పరీక్షల సందర్భంగా చివరి నెలలో నిర్వహించిన స్టడీ క్లాస్‌లు మాకు చాలా ఉపయోగపడ్డాయి. ప్రభుత్వం స్నాక్స్ ఇచ్చి ప్రోత్సహించింది. సందేహాలను స్టడీ హవర్స్‌లో క్లియర్ చేసుకున్నాం. 9.7జీపీఏ సాధించినందుకు సంతోషంగా ఉంది.

- వి.రాజరాజేశ్వరీ, 9.7 జీపీఏ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సుభాష్‌నగర్, కరీంనగర్

### ఆటలతోపాటు చదువులో..



అథ్లెటిక్స్ 2కే లాంగ్ రన్ ఈవెంట్ నాది. ఐదు సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రాణించా. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 9.5 జీపీఏ గ్రేడ్ సాధించా. సంతోషంగా ఉంది. మంచి గ్రేడ్ రావాలని బాగా కష్టపడ్డా. స్కూల్‌లో నిర్వహించిన పరీక్షలతోనే మంచి గ్రేడ్ సాధించగలిగాను.

- తపన్ మహదేవ్, 9.5 జీపీఏ, ప్రాంతీయ క్రీడా పాఠశాల, కరీంనగర్

### టీచర్ల ప్రోత్సాహంతో..



స్కూల్‌లో టీచర్లు, ఇంట్లో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మంచి జీపీఏ సాధించా. కొన్ని సబ్జెక్టుల్లో రాణించలేకపోయినప్పటికీ స్కూల్‌లో టాపర్ లిస్టులో ఉండగలిగాను. ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో ఉన్నతస్థాయిలో నిలవాలని ఉంది.

- వి మహేశ్వరీ, 9 జీపీఏ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సుభాష్‌నగర్, కరీంనగర్

### పటిష్టమైన ప్రణాళికతో..



ఉపాధ్యాయులు ఇచ్చిన పటిష్టమైన ప్రణాళికతో మేము చదివాం. ప్రాక్టీస్ చేసుకోవడానికి స్టడీ అవర్స్ ఉపయోగపడ్డాయి. అన్ని సబ్జెక్టులకు ఇచ్చిన స్పెషల్ స్టడీ మెటీరియల్ ఉపయోగపడింది. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని ఉంది.

- నాంపల్లి ఆకాంక్ష, 9.8 జీపీఏ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సప్తగిరికాలనీ, కరీంనగర్

### సంతోషంగా ఉంది



మా నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్య లభిస్తుందని నన్ను సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. తాను అనుకున్న దానికంటే ఇక్కడ చాలా బాగా బోధించారు. ఆటల్లో కూడా జాతీయస్థాయి క్రీడల్లో రాణించా. బాసర ట్రిపుల్ ఐటీకి సెలెక్ట్ అవుతానని నమ్మకం కలిగింది. సంతోషంగా ఉంది. - గిరి సాత్విక్, 9.8 జీపీఏ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సప్తగిరికాలనీ, కరీంనగర్

### గ్రంథాలయ అభివృద్ధికి రూ.3 కోట్లు



మాట్లాడుతున్న చైర్మన్ అనిల్

కరీంనగర్‌కల్చరల్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆమోదించబడిన బడ్జెట్ నుంచి రూ.3,18,00,000లను గ్రంథాలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిల్డింగ్ నిర్మాణం, పబ్లిక్ రీడింగ్ రూంల ఏర్పాటు, ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు. కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించిన మేరకు ఖర్చులపై వివరించిన పద్దుల ప్రకారం నిబంధనలకనుగుణంగా ఖర్చు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి సరిత, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ జయశంకర్, విద్యాశాఖ పక్షాన కృపారాణి, అడిషనల్ డీపీఆర్వో శారద తదితరులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ యజమానుల సంఘం కార్యవర్గం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించిన సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో ట్రాక్టర్ యజమానుల సంఘం కార్యవర్గ ఎన్నికలు గురువారం ఉత్కంఠభరితంగా జరిగాయి. అధ్యక్ష పదవి కోసం కస్తూరి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బోకూరి లింగారెడ్డిలు పోటీపడగా మొత్తం 88 ఓట్లలో 56 ఓట్లతో కస్తూరి శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా డి.అనిల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వరి శ్రీనివాస్, కోశాధికారిగా రాచకొండ కిషన్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని సర్పంచ్ శ్రీధర్, కరీంనగర్ సింగిల్‌విండో డైరెక్టర్ సాయిల్ల మహేందర్, వార్డుసభ్యులు బోనగిరి హన్మంతరావు తదితరులు అభినందించారు.

## అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా

- మేయర్ సునీల్‌రావు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్

కరీంనగర్ కార్పోరేషన్: నగరంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం 1వ డివిజన్ తీగలగుట్టపల్లిలో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు, 29, 46 డివిజన్లలోని పాస్‌పోర్టు ఆఫీస్, పాతబజార్‌లో రూ.35లక్షలతో చేపట్టిన రోడ్లు, డ్రెయినేజీలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మొదటి ప్రాధాన్యతగా నగర ప్రజలకు తాగునీరు అందించాలనే సంకల్పంతో పైపులైన్ పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. స్టార్ హాస్పటల్స్ నుంచి రైల్వే ట్రాక్ కాలనీలన్నిటికీ రెండు రోజుల్లో నీటి సరఫరా చేస్తామని తెలిపారు. 2వ డివిజన్ విద్యారణ్యపురి కాలనీలో కూడా ఈనెలాఖరులోగా తాగునీటి సరఫరా చేస్తామన్నారు. ఆరెపల్లి నుంచి సీతారాంపూర్‌కు నూతనంగా తాగునీటి పైపులైన్ వేశామని, ట్రయల్ రన్ చేసి తాగునీరు అందిస్తామని తెలిపారు. గతంలో వర్షపు నీటితో ఇండ్లు మునిగిపోతున్నాయని కార్పొరేటర్లు తెలపడంతో బొమ్మ వెంకన్న భవనం నుంచి పెద్ద డ్రెయినేజీ నిర్మాణం కూడా పూర్తి చేశామన్నారు. సరస్వతీ శిశుమందిర్ చౌరస్తా, పాస్‌పోర్టు ఆఫీస్ చౌరస్తాలో స్థల అనుకూలతను బట్టి జంక్షన్‌లను అభివృద్ధి చేస్తామని, టవర్ సర్కిల్ ఆధునికీకరణ పనులన్నీ దాదాపుగా చివరి దశకు చేరాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, వంగల శ్రీదేవి పవన్, గుగ్గిళ్లపు మంజుల రమేశ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, ఆయా డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

**ప్రతీ వీధిలో ఎల్‌ఈడీ లైట్లు**

నగరంలోని ప్రతీ వీధిలో ఎల్‌ఈడీ లైట్లు, చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు అమరుస్తున్నామని మేయర్ సునీల్ రావు అన్నారు. 25వ డివిజన్‌లో రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం రాత్రి ప్రారంభించారు. 60 డివిజన్‌లలో ఇప్పటివరకు 550కు పైగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. మరో 250 సెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ ఎడ్ల సరిత అశోక్, అధికారులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో సుందరకాండ హనుమత్ మహాయజ్ఞం



మాట్లాడుతున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నుంచి 14వ తేదీ వరకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శ్రీమద్రామయణ పారాయణ సహిత సుందరకాండ హనుమత్ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. గురువారం ప్రముఖ శ్రీమాన్ వేదాంతాచార్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మహాయజ్ఞం వివరాలు వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు పారాయణం, చివరి రోజు పూర్ణాహుతి నిర్వహించడం జరుగుతుందన్నారు. సుమారు 25 మంది రుత్వికులతో జిల్లాలో ప్రథమంగా ఈ మహాయజ్ఞం నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రుత్వికులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం: మండలంలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయని కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వెంకటేశ్వర్లపల్లెలో రెండు బైకులు ఢీకొనడంతో హుజూరాబాద్‌కు చెందిన గొస్కుల శృతి, కేశవపట్నంలో కారు ఢీకొనడంతో చింతలపల్లికి చెందిన చింతిరెడ్డి రాజిరెడ్డికి గాయాలయ్యాయన్నారు. బాధితులను ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

### చిత్ర కథ: ఇంత నిర్లక్ష్యమా.. ఏసీ లేని ఐసీయూ



నగరంలోని ప్రభుత్వ ప్రధానాసుపత్రి అత్యవసర విభాగం(ఐసీయూ) జనరల్‌వార్డు గా మారిపోయింది. అత్యవసర పరిస్థితిల్లో ఉన్న రోగులను చేర్చే ఈ ఐసీయూ విభాగంలో ఏసీ తప్పనిసరి. కొన్ని రోజులుగా ఐసీయులో ఏసీ పనిచేయకపోవడం, వెంటిలేషన్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

## హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బెజ్జంకి శ్రీకాంత్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లో ఈనెల 14న నిర్వహిస్తున్న హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని హిందూవాహిని జిల్లా సంయజక్ శ్రీకాంత్ అన్నారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14న సాయంత్రం నాలుగు గంటలకు వైశ్యభవన్ నుంచి ఏక్తా యాత్ర ప్రారంభమవుతుందని, ఈ యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ పాల్గొంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో హిందూవాహిని బాధ్యులు రాజు, బీమ్ తరుణ్, రామకృష్ణ, నాగేశ్వర్, ప్రవీణ్, తేకర్, సందీప్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో ఈనెల 14న నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్రలో హిందువులంతా పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. గురువారం రేకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 15 ఏళ్ల నుంచి బండి సంజయ్ చేపడుతున్న ఈ యాత్ర వల్ల హిందువుల ఐక్యత పెరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా పశ్చిమ జోన్ అధ్యక్షుడు లక్ష్మీరాజం, కార్యవర్గ సభ్యులు రావుల భాస్కరాచారి, ఆంజనేయులు, జాడి కనకయ్య పాల్గొన్నారు.

## ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ



వందశాతం ఉత్తీర్ణత సాధించిన జూబ్లీనగర్ జెడ్పీస్కూల్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు ఎస్సెస్సీ ఫలితాల్లో అత్యంత ప్రతిభను ప్రదర్శించాయి. మొత్తం 372 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 361మంది ఉత్తీర్ణులయ్యారు. పది పాఠశాలల్లో మూడు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన వెల్ది హరిప్రసాద్, జడ రాహుల్, పల్లినేని సుశాంత్‌రావులు 10జీపీఏ సాధించారు. నగునూరు జెడ్పీ పాఠశాలలో 78మంది విద్యార్థులకు 77మంది, జూబ్లీనగర్‌లో 15మందికి 15మంది, చామనపల్లిలో 46మందికి 44, మొగ్దుంపూర్‌లో 12మందికి 11, దుర్శేడ్‌లో 64మందికి 59, బొమ్మకల్‌లో మొత్తం ఏడుగురు, మైనార్టీ గురుకుల పాఠశాల-1లో 55మందికి 50, పాఠశాల-2లో మొత్తం 41మంది, మొగ్దుంపూర్‌లోని పాఠశాల-3లో45 మందికి 44, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో 64మందికి 63 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాధికారి మదుసూధన్‌చారి తెలిపారు. 10జీపీఏ ముగ్గురు, 9.8జీపీఏ ఇద్దరు, 9.0 జీపీఏ నుంచి 9.7జీపీఏ వరకు 14మంది సాధించినట్లు వివరించారు.

### ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో..



ఎ.వైష్ణవి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలోని తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల (ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్) విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలో ప్రతిభ చాటారు. 76 మంది పరీక్షకు హాజరు కాగా ఒక్కరు 10జీపీఏ, 44 మంది 9.8, 27మంది 8.9, నలుగురు 7.0 జీపీఏతో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వైష్ణవి 10 జీపీఏతో పాఠశాల టాపర్‌గా నిలవగా, బి.సాయిప్రేమల, సీహెచ్. అక్షయ, జి.అక్షిత, డి.విద్యశ్రీలు 9.8 జీపీఏ మార్కులు పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జేజే థెరిస్సా, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఉమాకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మానకొండూర్ రూరల్: మండలంలోని వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007–08 పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈకార్యక్రమంలో గురువులు సంపత్‌కుమార్, వేణుగోపాల్, వేణుమాధవ్, కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### జన సైనికులు, ఫ్యాన్స్‌కు పవన్ వెన్నుపోటు

రామ్ గోపాల్ వర్మ ట్వీట్



సాక్షి, అమరావతి: సొంత ఫ్యాన్స్‌నే కాకుండా, తన కాపుల్ని, తనని తానే జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కళ్యాణ్ వెన్నుపోటు పొడిచేసుకున్నారని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ట్విటర్‌లో వ్యాఖ్యానించారు. ఆ రోజు ఎన్టీఆర్‌ను చంద్రబాబు వెన్నుపోటు పొడిచిన దానికన్నా దారుణంగా ఈరోజు పవన్ కళ్యాణ్ తన జన సైనికులను, ఫ్యాన్స్‌ని వెన్నుపోటు పొడిచి చంపేశారని గురువారం రాత్రి ఆయన ట్వీట్ చేశారు.

### ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు 15కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ–6) గజ్జల ఉదయ్‌కుమార్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఈ నెల 15కు వాయిదా వేసింది. ఈ కేసులో గతనెల 14న ఉదయ్‌ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టు అనుమతితో ఆరు రోజులు కస్టడీలోకి తీసుకుని విచారించింది. అరెస్టయిన రెండు రోజులకే ఉదయ్‌కుమార్ సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సీబీఐ కోర్టు మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా న్యాయస్థానం ఆదేశాల మేరకు కేసు డైరీని సీబీఐ సమర్పించింది. అనంతరం న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది.

# సీఎం రేసులో లేను

## టీడీపీతో పొత్తు ఖాయమని పవన్‌కల్యాణ్ సంకేతాలు

- సీఎం పదవి కావాలని అడగాలంటే ఆ స్థాయి ఉండాలి కదా అంటూ వ్యాఖ్యలు
- నాకు సీఎం పదవి ఇస్తానని టీడీపీ ఎలా చెబుతుంది?
- జనసేన బలం తెలిశాక టీడీపీ అధ్యక్షుడి స్థానంలో నేనున్నా ఆ మాట చెప్పను
- అభిమానులు నిరాశ పడదానికి ఇదేమి సినిమా కాదు: జనసేన అధినేత



సాక్షి, అమరావతి/సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను అసలు ముఖ్యమంత్రి పదవి రేసులోనే లేనని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పరోక్షంగా తేల్చిచెప్పేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడం ఖాయమంటూ సంకేతాలిస్తూ, పొత్తుల్లో జనసేన పార్టీకే ముఖ్యమంత్రి పదవి కావాలని అడగడానికి ఓ స్థాయి ఉంటుంది కదా అంటూ వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ నేత నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ గురువారం మీడియాతో మాట్లాడారు. టీడీపీతో పొత్తు చర్చలు జరుగుతున్నాయి కదా, అవి ఎంతవరకు వచ్చాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'ఖచ్చితంగా పొత్తులు పెట్టుకుంటాం. మాట్లాడతాం. (బీజేపీని ఉద్దేశించి) కొంతమంది ఒప్పుకోకపోవచ్చు. ఒప్పిస్తాం. వాస్తవాలు, గణాంకాలు చూపి ఒప్పిస్తాం'.. అంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల చంద్రబాబు–పవన్ భేటీ తర్వాత కొంతమంది జనసేన నేతలు మీరు తగ్గడం ఏమిటని, మీరు ముఖ్యమంత్రిగా అయితే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని, మీరు సీఎం అభ్యర్థిగా ఉండాలి కదా అని మాట్లాడడాన్ని పవన్ తప్పుబట్టారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

**30–40 సీట్లు వచ్చి ఉంటే సీఎం పదవి అడిగే వాళ్లమేమో..**

ముఖ్యమంత్రి స్థాయిలో ఉంటే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని అనేవాళ్లు ఎవరైనా సరే, అలాంటి ఆలోచనతో ఉంటే వారు ఒకటి గుర్తుపెట్టుకోవాలి.. జనసేన గత ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేసింది. ఎన్ని గెలిచాం? పొత్తుల్లో ఇతర పార్టీలను సీఎం స్థానం కోసం డిమాండ్ చేయాలంటే కనీసం 30–40 స్థానాలు ఉండాలి. అప్పుడే ఆ వాదనకు బలం ఉండేది. ఇక తాను ఇప్పటివరకూ ఎవరికైనా పెద్దన్న పాత్ర వహించాలని చెప్పానంటే అది బాధ్యత వహించడం అని అర్థం. అంతేగానీ, ఒక కులానికి సంబంధించిన వ్యవహారం కాదు. రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారమది.

**నాతో నడిచే వాళ్లే నా వాళ్లు..**

ఇప్పుడు మీరు మాట్లాడిన మాటలకు మీ అభిమానులు, జనసేన కార్యకర్తల నుంచే విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంటుందేమోనని ఒక విలేకరి (సాక్షి కాదు) అన్నప్పుడు.. 'విమర్శలు వస్తాయని నాకు భయాలు లేవు. అభిమానులు నిరాశ పడడానికి ఇదేమి సినిమా కాదు. కార్యకర్తలైనా సరే.. నాతో నడిచేవారే నా వాళ్లు. అర్థంచేసుకునే వాళ్లు అర్థంచేసుకుంటారు'.. అంటూ పవన్ వ్యాఖ్యానించారు.

**సీఎం పదవి కావాలని కండిషన్లు పెడితే జరగవు..**

ఒక మాట చెబుతున్నా.. పోయిన ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేశాం. 30–40 స్థానాల్లో కూడా గెలిపించలేకపోయారు. అలాంటప్పుడు మన వాదన (సీఎం పదవి కావాలనే)కు పస ఉండదు. సినిమా ల్లో నన్ను ఎవరూ సూపర్‌స్టార్ చేయలేదు. నేను సాధించుకున్నదే. రాజకీయాల్లో కూడా టీడీపీ కావొచ్చు. బీజేపీ కావొచ్చు.. నన్ను సీఎంను చేస్తామని ఎందుకంటారు. నేను టీడీపీ అధ్యక్షుడిని అయినా ఆ మాటలు అనను. మనం బలం చూపించి, సత్తా చూపించి పదవి తీసుకోవాలి. కండిషన్లు పెడితే, అవి జరగవు. సీఎం పదవి అన్నది తానై వరించాలి తప్ప నేను దాని కోసం వెంపర్లాడను. పొత్తులకు జనసేన పార్టీ పెట్టే కండిషను వైఎస్సార్‌సీపీని అధికారం నుంచి దించాలి అంతే. అలాగే, పొత్తులతో ప్రభుత్వం ఏర్పడాలి. నాదెండ్ల మనోహర్ మాట్లాడిన మాటలపై ఎవరైనా అనుచితంగా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలి. ఓటు చీలనివ్వను అంటే ప్రధానంగా బలాలు ఏ పార్టీలకు ఉన్నాయో ఆ పార్టీలు కలవాలన్నది నా ఉద్దేశం. ప్రధాన పార్టీలకు సంబంధించే ఆ వ్యాఖ్యలు చేశాను. ఇక ఎన్నికలు ముందే వస్తాయని అనిపిస్తోంది. అందుకని జూన్ నుంచి రాష్ట్రంలోనే ఉండి పర్యటిస్తా.

# చంద్రబాబు పల్లకీ మోయడమే పవన్ ఎజెండా

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- కాపుల ఓట్ల కోసం పవన్‌ను ఎరగా వేసిన చంద్రబాబు
- పవన్ చెబుతున్నట్లు ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదు..



సాక్షి, అమరావతి/శంషాబాద్ (హైదరాబాద్) : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పల్లకీ మోయడమే తన ఎజెండా అని జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కల్యాణ్ చాటి చెప్పారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో, తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలలో కులాల గురించి ఆలోచించడం తప్పని, అయితే చంద్రబాబు అదే చేస్తారని ధ్వజమెత్తారు. టీడీపీకి దూరమైన కాపు సామాజిక వర్గానికి పవన్ కల్యాణ్‌ను ఎరగా వేసి.. ఓట్లు రాబట్టాలని చంద్రబాబు పథకం వేస్తున్నారని ఆరోపించారు. కానీ.. ఆ పథకం చెల్లుబాటు కాదన్నారు. కులాలపరంగా ప్రజలు ఓట్లు వేయరని.. చేసిన సేవ, విశ్వసనీయత ఆధారంగానే ఓట్లు వేస్తారని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 స్థానాల్లో విజయం సాధించడం.. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడమే అందుకు నిదర్శనమని గుర్తు చేశారు. తాను సీఎం అయితే చూడాలనుకున్న అభిమానులు, కాపు సామాజికవర్గం కలలను చంద్రబాబుకు పవన్ కల్యాణ్ తాకట్టు పెట్టారన్నారు. తమ కలలను పవన్ కల్లలుగా మార్చిన నేపథ్యంలో అభిమానులు, కాపులు వారి వెంట నడవరని స్పష్టం చేశారు. చంద్రబాబు రాజకీయ కుతంత్రంలో పవన్ కల్యాణ్ ఇష్టపూర్వకంగా బలి పశువుగా మారారని చెప్పారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

**చంద్రబాబు కోసమే జనసేన**

- సీఎం వైఎస్ జగన్ కంటే ముందే పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. చంద్రబాబు కోసమే జనసేనను స్థాపించారు. 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీకి మద్దతు పలికారు. 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడం ద్వారా చంద్రబాబును అధికారంలోకి తేవాలనే లక్ష్యంతో విడిగా పోటీ చేశారు.
- జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులను చంద్రబాబే ఖరారు చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే ధ్యేయంగా పవన్ పని చేస్తున్నారు. రాజకీయ ప్రస్థానంలో సీఎం వైఎస్ జగన్‌లా ప్రజలతో మమేకమై.. వారి మన్ననలుపొంది, రాజకీయ శక్తిగా ఎదగాలని పవన్ ఎన్నడూ ఆలోచించ లేదు. తాను రాజకీయ శక్తిగా ఎదిగితే చంద్రబాబుకు ఇబ్బంది అవుతుందని పవన్ భావించారేమో.

**ఒంటరిగా పోటీ చేసే సత్తా లేకే..**

- గత ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ.. గెలిచింది 23 స్థానాల్లోనే. జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లో గెలిచింది ఒక్క స్థానమే. ప్రస్తుతం రాష్ట్రంలో ఒంటరిగా 175 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి పెట్టలేని దుస్థితిలో చంద్రబాబు ఉన్నారు. టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యం నింపడానికే పొత్తులు అంటూ పవన్‌తో చంద్రబాబు మాట్లాడిస్తుంటారు.
- 2019 ఎన్నికల్లో 30 స్థానాల్లో గెలిపించి ఉంటే.. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ జనసేన అభ్యర్థులను పోటీకి పెట్టేవాడినని పవన్ అనడం అవివేకం. జనసేన ఓటమి బాధ్యత ప్రజలపై వేయడం దుర్మార్గం. ముఖ్యమంత్రి పదవి రేసులో తాను లేనన్న పవన్.. మారీచులైన రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 నాయుడులతో కలిసి చంద్రబాబును తక్షణమే సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే తన ధ్యేయమని చాటిచెప్పుకున్నారు.
- పవన్ చెబుతున్నట్టుగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదు. ప్రభుత్వ సానుకూల ఓటు ఉంది. టీడీపీ తరఫున పోటీ చేయడానికే అభ్యర్థులు దొరకకే ముందస్తు ఎన్నికలంటూ బాబు డ్రామాలాడుతున్నారు. ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయం.

# అప్పులంటూ అబద్ధాలా?

- ఆర్టిస్ట్ జీవీ రావుకు ఆర్థిక నిపుణుడి ముద్ర
- అలాంటి వ్యక్తి నోటితో బాబు కోసం తప్పుడు లెక్కలు వల్లె
- ఏపీ సీఎం ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపాటు

సాక్షి, అమరావతి : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై ఈనాడు, దాని ఆర్థిక నిపుణుడు జీవీ రావు కథనం పచ్చి అబద్ధాలతో కూడుకున్నదని ఏపీ ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపడ్డారు. ఎటువంటి గణాంకాలు లేకుండా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ఆంధకారం అయిపోయిందంటూ జీవీ రావు చేసిన వ్యాఖ్యలను నిర్ధారించుకోకుండానే ఈనాడు ప్రచురించడం తీవ్ర అభ్యంతరకరమని, దారుణమని ధ్వజమెత్తారు. ఎవరికీ పరిచయం లేని వ్యక్తిని ఆర్థిక నిపుణుడంటూ అర్థం లేకుండా మాట్లాడించి.. తప్పుడు కథనాన్ని అచ్చేయడం డ్రామోజీరావు కుట్రలో భాగమని స్పష్టం చేశారు. గణాంకాలను చూపకుం



డానే రాష్ట్రం శ్రీలంక, పాకిస్తాన్ అయిపోయిందనడం తగదని చెప్పారు. గురువారం ఆయన సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ఆర్‌బీఐ, కాగ్ గణాంకాలను పేర్కొంటూ అప్పులపై వాస్తవాలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**ఎవరు ఏం చెబితే అది రాసేస్తారా?**

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మూడేళ్లుగా ప్రతిపక్షాలు, వాటి అనుబంధ మీడియా చేస్తున్న దుష్ప్రచారం కొనసాగింపులో భాగంగానే ఎవరికీ పరిచయం లేని వ్యక్తికి ఆర్థిక నిపుణుడనే ముద్ర వేసి నోటికి వచ్చినట్లు మాట్లాడించారు. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని చెప్పించి, దాన్ని ఈనాడులో ప్రముఖంగా ప్రచురించారు. ఆర్థిక రంగంపై కనీస అవగాహన లేని ఒక చిన్న యాక్టర్ తప్పుడు విశ్లేషణను ఈనాడు బాధ్యతారాహిత్యంగా ఎలా ప్రచురిస్తుంది?
- అప్రకటిత రుణాలు తెచ్చారని జీవీ రావు చెబితే, కనీసం వాస్తవాలు ఏమిటో తెలుసుకోకుండా ఈనాడు ఎలా రాస్తుంది? రూ. 10 లక్షల కోట్ల అప్పులు ఎక్కడున్నాయి? ఎవరు ఏం చెప్పినా, నిర్ధారించుకోకుండానే రాసేస్తారా? అలా రాయడం ఈనాడు దుర్బుద్ధి కాదా? లేక ఈనాడు రామోజీ రావే అలా అబద్ధాలు చెప్పించి, రాయించారా?
- ఆర్‌బీఐ, కాగ్ లెక్కల ప్రకారం బడ్జెట్, బడ్జెట్ బయట, ప్రభుత్వ పూచీ కత్తు, ప్రభుత్వ రంగ సంస్థల అప్పులన్నీ కలిపి రూ.6,51,789.07 కోట్లే. రూ.పది లక్షలు కోట్లు అప్పులని చెప్పడం దుష్ప్రచారం కాదా? మరి మిగతా అప్పులు ఎక్క డున్నాయో ఆ నిపుణుడు, ఈనాడు చెబితే బాగుంటుంది. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగంగానే అవాస్తవ కథనాలు రాస్తుండటం నిజం కాదా?
- ప్రభుత్వానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ పబ్లిక్ డొమెయిన్‌లో ఉన్నాయి. వాటిని విశ్లేషించి, అవగాహనతో మాట్లాడితే స్వాగతిస్తాం. కానీ ఏ విశ్లేషణ చేయకుండా, ఎక్కడా లెక్కలు చెప్పకుండా తప్పుడు మాటలు మాట్లాడించి, ప్రచురించడం దారుణం.
- వృత్తిపరంగా అవకతవకలకు (ఒక కంపెనీ తరఫున ఆడిట్లో అవకతవకలు) పాల్పడటంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఇండియా జీవీ రావును రెండేళ్ల పాటు సస్పెన్షన్ చేసింది. అలాంటి వ్యక్తి ఆర్థిక నిపుణుడంటూ ఈనాడు తెరపైకి తెచ్చి తప్పుడు లెక్కలు చెప్పించడం కుట్రలో భాగమే.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

## పేపర్లలో వచ్చిన ఫొటోలను పరిగణనలోకి తీసుకోలేం

**మార్గదర్శి పిటిషన్‌లో హైకోర్టు స్పష్టీకరణ**

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అవకతవకలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సీఐడీ అధికారులు చేస్తున్న తనిఖీలపై పత్రికల్లో వచ్చిన ఫొటోలను పరిగణనలోకి తీసుకోలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి తనిఖీలు జరిపితే.. సంస్థ రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సీఐడీని ఆదేశించింది. తనిఖీల పేరిట రోజువారీ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని మార్గదర్శి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీపీ ఏబీ లలితా గాయత్రి వాదనలు వినిపించారు. తనిఖీల సమయంలో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించడంలేదని చెప్పారు. చట్ట ప్రకారమే తనిఖీలు జరిగాయన్నారు. పారదర్శకంగా సాగుతున్న దర్యాప్తును అడ్డుకునేందుకు మార్గదర్శి ఇప్పటికే పలు పిటిషన్లు వేసిందన్నారు. పత్రికలో ఏవో ఫొటోలను ప్రచురించి ఖాతాదారులను అడ్డుకుంటున్నామని చూపించే యత్నం చేస్తోందని తెలిపారు. అలాంటి ఫొటోలను, ప్రచురణలను పరిగణనలోకి తీసుకోవద్దని కోర్టును కోరారు. ఏపీలో నమోదవుతున్న కేసులపై ఈ కోర్టు నుంచి ఉపశమనం పొందాలని భావిస్తోందని తెలిపారు. పరిధి లేని పిటిషన్లను విచారణకు స్వీకరించవద్దని, పిటిషన్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా...



గుర్తించిన స్థలాల్లో సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

- భారీ వృక్షజాతి మొక్కల పెంపకం
- వృక్షమాల రివర్‌బ్యాంక్ కన్జర్వేషన్ పేరుతో కార్యక్రమం

పాతమంచిర్యాల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం హరితహారం, అడవుల అభివృద్ధి లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గ్రామాలు, పట్టణాలు గ్రీనరీగా కనిపించాలని పట్టణ పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే వృక్షమాల రివర్‌బ్యాంక్ కన్జర్వేషన్ పేరుతో నదీ తీరప్రాంతాలు, సాగునీటి కాలువలు, చెరువులు, కుంటల గట్లపై భారీ వృక్షజాతికి చెందిన మొక్కల పెంపకం చేపట్టాలని గ్రామీణాభివృద్ధి శాఖ, ఉపాధిహామీ అధికారులు నిర్ణయించారు. సాగునీటి కాలువలు, నదులకు సమీపంలో ఉన్న భూముల్లో మద్ది, తానికాయ, వేప, సీతాఫలం అల్లనేరేడు, తుమ్మ, ఇప్ప, యూకలిప్టస్ మొక్కల పెంపకం చేపట్టనున్నారు. దీనిద్వారా వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే భూమి కోతకు గురికాకుండా, సాగునీటి కాలువల సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశాలు అన్యాక్రాంతం కాకుండా నిరోధించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రభుత్వ ఆస్తులు దురాక్రమణకు గురికాకుండా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. పండ్ల మొక్కలు నాటడం వలన ఆయా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. జిల్లాలో 57 కిలోమీటర్ల పొడవునా మొక్కలు నాటే కార్యక్రమానికి గత నెలలో ఉపాధిహామీ అధికారులు సర్వే నిర్వహించి నివేదికలు తయారు చేశారు. జైపూర్ మండలంలో రెండెకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్ చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని దండేపల్లి, బెల్లంపల్లి, కన్నెపల్లి, వేమనపల్లి, కాసిపేట, లక్సెట్టిపేట, భీమిని, చెన్నూర్, నెన్నెల, జైపూర్, హాజీపూర్, భీమారం మండలాల్లో గుర్తించిన ఖాళీస్థలాల్లో 21,550 మొక్కలు నాటాలని నిర్ణయించారు. మార్చి నుంచి ఆగస్టు వరకు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు వచ్చాయని అధికారులు తెలిపారు.

**పర్యావరణ సమతుల్యత కాపాడేందుకే...**

వృక్షమాల రివర్‌బ్యాంక్ కన్జర్వేషన్‌లో భాగంగా నాటనున్న మొక్కలతో వరదల వలన భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. అంతేకాకుండా పచ్చదనంతో పాటు అధికంగా పండ్ల మొక్కలు పెంచితే ఫలసాయం ఆయా గ్రామ పంచాయతీలకు ఉపయోగపడుతుంది.

– బి.శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, మంచిర్యాల

## రాష్ట్రస్థాయిలో 'సావర్‌ఖేడా'కు ప్రశంసలు

- ప్రధానోపాధ్యాయుడు రంగయ్య పనితీరు స్ఫూర్తిదాయకం
- శాలసిద్ధి శిక్షణలో కొనియాడిన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన



రంగయ్య సేవలపై వివరిస్తున్న కమిషనర్ దేవసేన

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని సావర్‌ఖేడా గ్రామం మరోసారి రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకుంది. సావర్‌ఖేడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్య పనితీరును హైదరాబాద్‌లోని టీఎస్ఐఆర్‌డీలో హెచ్ఎంలు, ఎస్‌వోలకు నిర్వహిస్తున్న శాలసిద్ధి శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మద్యాన్ని పూర్తిగా నిర్మూలించినట్లు తెలిపారు. గత నెల 24న గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తాను పాల్గొన్నానని, రాత్రి 8 దాటినా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఓపికగా వేచి ఉన్నారని పేర్కొన్నారు. శాలసిద్ధి కార్యక్రమాల గురించి తెలియాలంటే హెచ్ఎంలు ఆ పాఠశాలకు వెళ్లాలని సూచించారు. పాఠశాల విధులు ముగిసిన తర్వాత కూడా గ్రామాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు సమయాన్ని వెచ్చిస్తున్న రంగయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పూర్వ విద్యార్థులతో సూపర్ 100 కార్యక్రమాన్ని చేపట్టి, దాతల సహకారంతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు.

## బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ



తనిష్క్

ఆసిఫాబాద్‌రూరల్: కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి రేకల తనిష్క్ అంతర్జాతీయ బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, పీడీ తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో కేరళలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన తనిష్క్ జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 8 నుంచి 10 వరకు భూటాన్‌లో జరిగిన సౌత్ ఏషియా సాఫ్ట్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్(అండర్ 17)లో పాల్గొన్న భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన తనిష్క్ బెస్ట్ క్యాచర్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఆసిఫాబాద్ మండలం తుంపెల్లికి చెందిన తనిష్క్ తండ్రి తిరుపతి ఆటోడ్రైవర్ పనిచేస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం జిల్లాకే గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## ఐదుగురు ఎస్సైల బదిలీ



మంచిర్యాలక్రైం: జిల్లాలో పని చేస్తున్న ఐదుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| ఎస్.రవికుమార్ | వీఆర్, మంచిర్యాల | బెల్లంపెల్లి 2 టౌన్ |
| ఏ.ఆంజనేయులు | బెల్లంపల్లి 2టౌన్ | దేవాపూర్ |
| ఏ.విజేందర్ | దేవాపూర్ | సుల్తానాబాద్ |
| ఎం.మానస | శ్రీరాంపూర్ | వీఆర్, మంచిర్యాల |
| కే.రామకృష్ణ | టాస్క్‌ఫోర్స్ మంచిర్యాల | పొత్కపల్లి |

# కేటీఆర్‌పైనే అనిల్ కుటుంబం ఆశలు..!



అనిల్ మృతదేహంపై పడి ఏడుస్తున్న సౌజన్య (ఫైల్)



కొడుకులు అయాన్, అరయ్



వీల్‌చైర్‌లో తండ్రి మల్లయ్య

- ఇప్పటివరకు అందని సాయం
- మంచానికే పరిమితమైన తండ్రి
- సౌజన్యకు ప్రభుత్వ ఉద్యోగంతోనే భరోసా

బోయినపల్లి(చొప్పదండి): జమ్ముూకాశ్మీర్‌లో జరిగిన హెలీకాప్టర్ ప్రమాదంలో చనిపోయిన మల్కాపూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ అనిల్ కుటుంబం ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తోంది. అనిల్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి కేటీఆర్.. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఈనెల 5న భరోసా ఇచ్చారు. వారం రోజులు కావస్తున్నా ఇప్పటివరకే అటు కేంద్రంనుంచిగానీ.. ఇటు రాష్ట్రంగానీ సహాయానికి సంబంధించిన ప్రకటన రాలేదు. ఈ క్రమంలోమంత్రి కేటీఆర్ ప్రకటనపైనే అందరి దృష్టి ఉంది.

**11 ఏళ్లు సైన్యంలో..**

మల్కాపూర్‌కు చెందిన పబ్బాల లక్ష్మి, మల్లయ్య కుమారుడు అనిల్ డిగ్రీ వరకు చదుకుని 11 ఏళ్ల క్రితం ఆర్మీలో చేరారు. అనిల్‌కు ఏడేళ్ల క్రితం మండలంలోని కోరెం గ్రామానికి చెందిన సౌజన్యతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు అయాన్ (6), అరయ్(3) సంతానం. అనిల్ సోదరులు శ్రీనివాస్, మహేందర్ వ్యవసాయం చేసుకుని జీవిస్తారు. తండ్రి మలయ్య అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. 45రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన అనిల్ తండ్రి కాలుకు సర్జరీ చేయించాడు. ఇలాంటి తరుణంలో అనిల్ మృతి చెందడం ఆ కుటుంబాన్ని తీరని వేదనలోకి నెట్టింది. అనిల్ కుమారులు చిన్నపిల్లలు కావడం.. తండ్రి మంచానికే పరిమితమవడం.. భర్త చనిపోయిన విషయాన్ని ఇంకా జీర్ణించుకోలేక నిత్యం రోదిస్తున్న ఆయన భార్య సౌజన్యను చూసినవారికే కన్నీళ్లు ఆగడం లేదు.

**మంత్రిపైనే ఆశలు..**

అనిల్ కుటుంబాన్ని ఆదుకోవడం ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌తోనే సాధ్యమవుతుందని గ్రామస్తులు అంటున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన ప్రకటన చేయడం.. మంత్రి గంగుల కమలాకర్ సైతం సీఎం కేసీఆర్ ఆదేశాలతోనే ఇక్కడికి వచ్చానని చెప్పడం ఆ కుటుంబానికి చిరుదీపంలా కనిపిస్తోంది. అనిల్ భార్య సౌజన్య డిగ్రీ చదువుకుంది. భర్త ప్రోత్సాహంతో ఇటీవల ఎస్సై రాత పరీక్ష కూడా రాసింది. మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుని సౌజన్యకు ఉద్యోగం ఇప్పించాలని, సైనికుడికి అందించే అన్నిరకాల సహాయం అందించాలని గ్రామస్తులు అంటున్నారు. అనిల్ అంత్యక్రియల్లో పాల్గొన్నప్పటి నుంచి ఇద్దరు ఆర్మీ జవాన్లు ఇక్కడే ఉండి డాక్యుమెంట్లు సిద్ధం చేస్తున్నారని, సౌజన్య బ్యాంకు అకౌంట్, తదితర ధ్రువీకరణపత్రాలు సేకరిస్తున్నారని తెలిసింది. అలాగే కుటుంబంలో ఏమైనా గొడవలుంటే సరి చేయాలని ఆర్మీ ఉన్నతాధికారులు, ఎస్పీ ఆదేశించినట్లు సమాచారం.

# ఏమ్మా.. వసతులెలా ఉన్నాయ్

- ఇటుకబట్టీల వలసకూలీలతో ఆరా
- సఖి కేంద్ర నిర్వహణ ఎలా ఉంది
- టోల్‌ఫ్రీ నంబర్లను విస్తృతంగా ప్రచారం చేయండి
- మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ సునీత



పాఠశాలను సందర్శించిన కమిషన్



ఇటుకబట్టీలో కూలీలతో మాట్లాడుతున్న సునీత

పెద్దపల్లిరూరల్: ఏమ్మా.. ఇక్కడ మీకు వసతులెలా ఉన్నాయ్. పనికి తగ్గట్టుగా కూలీ డబ్బులు ఇస్తున్నారా. పిల్లలకు చదువు చెబుతున్నారా.. అంటూ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి పెద్దపల్లి మండలం రంగాపూర్ శివారులోని ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి ఆరా తీశారు. వసతులు కల్పించారని కూలీలు తెలిపారు. పిల్లల కోసం బడి పెట్టించారని చెప్పగా.. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలకు ఆరోగ్య సేవలను అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దపల్లిలోని సఖి కేంద్రం నిర్వహణ తీరుపై సమీక్ష నిర్వహించారు. సఖికేంద్రం ద్వారా 1,129 కేసులు నమోదయ్యాయని, అందులో 902 కేసులను పరిష్కరించామని నిర్వాహకులు తెలిపారు. కష్టాల్లో ఉన్న మహిళలే సఖి కేంద్రానికి వస్తారని, వారితో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. గ్రామాల్లో పర్యటించి టోల్‌ఫ్రీ నంబర్లపై విస్తృతప్రచారం చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్లో కలెక్టర్ సంగీత, ఇతర అధికారులతో సమీక్షించారు. మహిళలు పనిచేసే చోట వేధింపుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతీ కార్యాలయాల్లో, ప్రైవేట్ వాణిజ్య సముదాయాల్లో అంతర్గతకమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా కమిటీలు ఏర్పాటుచేసేలా కార్యాచరణ చేపడతామని కలెక్టర్ సంగీత చెప్పారు. మహిళల కేసుల్లో పరిహారం త్వరితంగా అందేలా చూడాలన్నారు. మహిళా కమిషన్ సభ్యులు కఠారి రేవతిరావు, షాహిన్ అఫ్రోజ్, ఈశ్వరీబాయి, లక్ష్మి, డీఆర్‌వో నర్సింహమూర్తి, ఆర్డీవో వెంకటమాధవరావు, జిల్లా సంక్షేమాధికారి రవుఫ్‌ఖాన్, తదితరులు ఉన్నారు.

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

# సేవకు విశ్రాంతి లేదు

రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవలూ అంతే ముఖ్యం. 'నీకేం కాదు, ధైర్యంగా ఉండు' అని నర్సు చెప్పే మాట రోగిలో భవిష్యత్తుపైన ఆశలు చిగురింపజేస్తుంది. విధుల్లో ఉన్నా, లేకపోయినా తమ చుట్టూ ఉన్నవారికి నర్సమ్మగా సేవలు అందిస్తూనే ఉంటుంది. తన సేవాగుణాన్ని చాటుకుంటూనే ఉంటుంది. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ముప్పై, నలభై ఏళ్లుగా రోగులకు సేవలు అందించిన వారిని కలిస్తే వారు పంచుకున్న విషయాలు ఇవి.

## దేవుడిచ్చిన అవకాశం



ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌లో .. దాదాపు నలభై ఏళ్ల నర్సుగా, నర్సింగ్ టీచర్‌గా విధులు నిర్వర్తించాను. కర్నూల్‌లోనూ చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా వర్క్ చేశాను. ఏడాది క్రితం రిటైర్ అయ్యాను. కొంత కాలం క్రితం మాకు తెలిసిన వారి అమ్మాయికి హార్ట్‌లో హోల్ ఉందని తెలిసింది. ఏ డాక్టర్‌ను కలిస్తే ఎలాంటి చికిత్స అందుతుంది, ఎలాంటి గైడెన్స్ అవసరం అనే విషయాలు చెప్పడంతో పాటు కొన్ని నెలలు వారింట్లోనే ఉన్నాను. టైమ్‌కు మందులు, ఫుడ్ చార్ట్ ప్రకారం ఫాలో అవడంలాంటి జాగ్రత్తల మూలంగా ఆ అమ్మాయి సేవ్ అయ్యింది. ఇదొక్కటే కాదు హైదరాబాద్, రాం కోఠిలోని మా కాంప్లెక్స్, కాలనీలలో తెలిసిన వారు ఎవరికి ఆరోగ్య సమస్య వచ్చినా, ఏ డాక్టర్ని కలవాలి అని అడగడంతో పాటు, జాగ్రత్తలు చెప్పమని కోరుతారు. ప్రెగ్నెంట్ ఉమన్ కనిపిస్తే చాలు – వారు అడగకపోయినా వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో కనుక్కుంటాను. ఇన్నేళ్లపాటు వర్క్‌లో ఉన్నాను కాబట్టి నాకు తెలిసినవారి జాబితా ఎక్కువ. ఇతర రాష్ట్రాలలోనూ ఉన్నారు. వారు కూడా ఏ రాత్రి ఏ వైద్య సలహా అవసరం వచ్చినా అడుగుతుంటారు. సేవ అనేది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను. అదే ఎంతో మంది రోగులకు స్వస్థత చేకూర్చేలా చేసిందనుకుంటాను. సేవకు ఎప్పుడూ రిటైర్‌మెంట్ ఉండదని నాకు ప్రతిరోజూ ఒక్క సంఘటనైనా రుజువు చేస్తుంటుంది.

**- పంకజ రుతు, రాంకోటి,**
హైదరాబాద్

## ఊరటనివ్వడమే ఆనందం



గాంధీలో స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ట్యూటర్‌గా రిటైర్ అయ్యాను. ఆ తర్వాత ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగుల ఆరోగ్య సలహాల కోసం ఆరేళ్ల వర్క్ చేశాను. మూడేళ్లుగా ఇంటి వద్దే ఉంటున్నాను. కానీ, ఉద్యోగంలో లేను అనే ఆలోచన ఎప్పుడూ రాదు. మా ఏరియాలో నేను అందరికీ తెలుసు. నాకు దాదాపుగా అందరూ పరిచయమే. ఆ విధంగా మా ఏరియాలో ఎవరికి ఆరోగ్య సమస్య వచ్చినా పిలుస్తారు. సలహాలు అడుగుతారు. హాస్పిటల్ నుంచి వారు వచ్చాక వెళ్లి కలుస్తాను. ఏ మందులు ఎలా వాడాలో చెబుతుంటాను. మా ఏరియాలో ఎవరికైనా చంటిపిల్లలు పుడితే, వారు పిలవకపోయినా వెళతాను. ప్రసవం అయ్యాక తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చంటిపిల్లలను ఎలా చూసుకోవాలో సూచనలు ఇస్తుంటాను. ఎవరైనా చనిపోతే వెళ్లి, డెడ్‌బాడీని ఎలా కేర్ చేయాలో, ఎందుకు అవసరమో చెబుతుంటాను. మా ఏరియాలో ఈ మధ్య ఒక అన్నకు యాక్సిడెంట్ అయ్యి కాలు విరిగింది. హాస్పిటల్ నుంచి వచ్చాక నెల రోజుల పాటు రోజూ వారి ఇంటికి వెళ్లడం, కాలుకు వాపు రాకుండా జాగ్రత్తలు చెప్పడం, డ్రెస్సింగ్ చేయడం, మందులు వాడటం గురించి చెబుతుండేదాన్ని. ఇప్పుడు ఆ అన్న నడుస్తున్నారు. సమస్య నుంచి తేరుకున్నాక వారి మొహాల్లో కనిపించే రిలీఫ్ నాకు ఎంతో ఆనందానిస్తుంది.

**- నీరజాక్షి, వికారాబాద్**

## విధుల్లోలేని సమయాల్లోనూ..



నిమ్స్‌లో విధులను నిర్వర్తిస్తున్నాను. మరో రెండేళ్లలో రిటైర్‌మెంట్ ఉంది. అయితే, హాస్పిటల్ వరకే మా సేవలు ఉండవు. నర్సింగ్ సేవకు రోజుకు ఇన్ని గంటలే అనే నియమం ఉండదు. స్వచ్ఛందంగానూ మా కాలనీలోనూ, కాంప్లెక్స్‌లోనూ, తెలిసినవారికి అవసరమైన వారికి సేవలు ఇస్తుంటాను. ఈ మధ్య కాలంలో మా కాంప్లెక్స్‌లో ఒక పెద్దాయనకు పక్షవాతం వచ్చింది. పూర్తిగా బెడ్‌కే పరిమితం అయ్యాడు. ప్రతిరోజూ డ్యూటీకి వెళ్లడానికి ముందు వారింటికి వెళ్లి, ఆ రోజు అతని పరిస్థితి ఎలా ఉందో కనుక్కొని, ఆ రోజు షెడ్యూల్‌ను కచ్చితంగా ఫాలో అయ్యారో లేదో అడిగి తెలుసుకుంటాను. ఆ రోజు ఎలాంటి కేర్ తీసుకోవాలో చెబుతాను. మిగతావాళ్లు తమ ఆరోగ్యస్థితి గురించి అడిగితే చెబుతుంటారు. అలాంటప్పుడు వారికి డాక్టర్ ప్రిస్కిప్షన్ చూసి ఇంజక్షన్స్ వంటివి అవసరం ఉన్నవారికి చేస్తుంటాను. ఎవరికి ఆరోగ్యసమస్య వచ్చి, సాయం కోరినా అందుబాటులో ఉండటం కూడా సేవగా భావిస్తాను.

**- అరుణ పాల్వాయి,**
మియాపూర్, హైదరాబాద్

**- నిర్మలారెడ్డి,**
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

పేరెంటింగ్

# ఓడినప్పుడు అండగా నిలవండి



పరీక్షల రిజల్ట్స్ వచ్చాయి.
అందరూ గెలవరు.
కొందరు ఓడుతారు.
గెలవడానికి ఎన్ని కారణాలో
ఓడటానికి అన్ని కారణాలు.
తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు
ఒక క్షణం పిల్లలు తెచ్చిన ఫలితాలతో
డిస్టర్బ్ అయినా దండించే సందర్భం ఇది కాదు.
పిల్లల ఓటమిని అర్థం చేసుకోవడమే
ఇప్పుడు అవసరం.
వారిని గమనించి
తిరిగి ముందుకు నడపడమే అవసరం.
ఓడిన పిల్లలకు అండగా నిలవండి.

కొందరు లెక్కలేని పిల్లలు ఉంటారు. వీరు ఎగ్జామ్స్ బాగానే రాసినా రిజల్ట్స్ తేడాగా వస్తే పట్టించుకోరు. ఫెయిల్ అయితే మరీ కొంపలు మునిగినట్టుగా కూచోరు. నెక్స్ట్ టైమ్ చూసుకుందాం అన్నట్టు ఉంటారు. ఈజీగా ఉంటారు. కాని కొందరు పిల్లలు పరీక్షలు ఎలా రాశారో ఇంట్లో కచ్చిత అంచనాతో చెప్పరు. ఫెయిల్ అవుతామేమోనని భయపడుతూ ఉంటారు. ఫెయిల్ అయితే ఇక పూర్తిగా ముడుచుకుపోతారు. తల్లిదండ్రుల ముందుకు రారు. బంధువుల్లో పరువుపోయిందని బాగా బెంబేలు పడతారు. ఎవరితోనూ కలవరు. ఇక భవిష్యత్తు ముగిసినట్టే భావిస్తారు. వీరితోనే సమస్య. వీరు ఏ క్షణమైనా పేలే బుడగలాంటివారు. ఇలాంటి వారితో తల్లిదండ్రులు చాలా అప్రమత్తంగా ఉండాలి. స్నేహితుల్ని, బంధువుల్ని అప్రమత్తం చేయాలి. ఈ దశ నుంచి వారిని సక్రమంగా బయటపడేయాలి.

### ఫెయిల్ ఎందుకు?

ఈ ప్రశ్న పిల్లల్ని అడిగే ముందు పెద్దలే ప్రశ్నించుకోవాలి. పిల్లల్ని సరైన బడి/కాలేజీలోనే చేర్చారా? అక్కడ పాఠాలు సరిగా జరిగాయా? సిలబస్ పూర్తి చేశారా? నోట్స్ సరిగా ఇచ్చారా? స్టూడెంట్ ఆ సబ్జెక్ట్స్ ఎలా ఫాలో అవుతున్నాడో ఎందులో వీక్ ఉన్నాడో టీచర్లు ఇంటికి ఫీడ్ బ్యాక్ ఇచ్చారా? పిల్లలకు ట్యూషన్ అవసరమైతే సరైన ట్యూషన్ పెట్టించారా? పిల్లలు చదివే వాతావరణం ఇంట్లో ఉందా? వారు చదువుకునే వీలు లేకుండా అస్తమానం పనులు చెప్తూ, టీవీ మోగిస్తూ, ఇంట్లో నాన్ సీరియస్ వాతావరణం పెట్టారా? పరీక్షల సమయంలో సిలబస్‌ను సరిగా విభజించుకుని చదవగలిగాడా? ఎగ్జామ్‌లో ఇచ్చిన ప్రశ్నలకు టైమ్ మేనేజ్‌మెంట్ చేయగలిగాడా? ఎగ్జామ్ భయంతో ఏమీ రాయలేకపోయాడా?... ఇవన్నీ ఫెయిల్ అవడానికి కారణాలు. టెన్త్ వరకూ అందరికీ తప్పదు కాని ఇంటర్ విషయానికి వచ్చేసరికి ఇష్టమైన కోర్సులో చేర్చారా? చదవే ఆసక్తి, శక్తి ఉన్న సబ్జెక్ట్స్‌లోనే చేర్చారా?... ఇవీ ముఖ్యమైన విషయాలే.

### ఏం చేయకూడదు?

పిల్లలు ఫెయిల్ అయ్యారని తెలియగానే ముందు వారికి నొప్పి కలిగే మాట ఏదీ మాట్లాడకూడదు. వారితో మాట్లాడటం మానేయకూడదు. కొట్టడం ఇంకా చెడ్డ చర్య. ఎవరితో పోల్చకూడదు. బాగా మంచి మార్కులతో పాసైన వారిని చూపించి వీరిని హేళన చేయకూడదు. భోజనాల దగ్గర 'మింగుదూ రా' లాంటి మాటలు పొరపాట్న కూడా మాట్లాడకూడదు. తోబుట్టువులను ఉసిగొల్పకూడదు. కొంత మంది తల్లిదండ్రులు ఏడ్చి, నెత్తి బాదుకుని భయభ్రాంతం చేస్తారు. ఏమాత్రం కూడదు. ఆడపిల్లైతే 'పెళ్లి చేసి పారేస్తాం' అని మగపిల్లలైతే 'నాలుగు గేదెలు కొనిస్తాం. మేపుకో' అని అనడం చాలా ప్రతికూల ప్రభావం చూపుతుంది.

> పిల్లలు ఫెయిల్ అయ్యారని తెలియగానే ముందు వారికి నొప్పి కలిగే మాట ఏదీ మాట్లాడకూడదు. వారితో మాట్లాడటం మానేయకూడదు. కొట్టడం ఇంకా చెడ్డ చర్య. ఎవరితో పోల్చకూడదు. బాగా మంచి మార్కులతో పాసైన వారిని చూపించి వీరిని హేళన చేయకూడదు. భోజనాల దగ్గర 'మింగుదూ రా' లాంటి మాటలు పొరపాట్న కూడా మాట్లాడకూడదు. తోబుట్టువులను ఉసిగొల్పకూడదు.

### ఏం చేయాలి?

'మరో అవకాశం ఎప్పుడూ ఉంటుంది. మరేం పర్వాలేదు' అని చెప్పాలి. 'నీకు ఎలాంటి సపోర్ట్ కావాలి? ఈ పరీక్షలు పాస్ కావడంలో నీకు ఎదురైన సమస్య ఏమిటి?' అని తెలుసుకోవాలి. ఒకవేళ పిల్లవాడు బాగా రాశాననే నమ్మకం ఉంటే రీవాల్యుయేషన్‌కు వెళ్లాలి. ప్రతి స్టూడెంట్‌కు ఎవరో ఒక టీచర్/లెక్చరర్ మీద గురి ఉంటుంది. కొంత చనువు ఉంటుంది. అలాంటి వారి దగ్గరకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ చేయించాలి. ఇది తాత్కాలిక అడ్డంకి అని దీనిని దాటి ముందుకు పోవచ్చని భరోసా ఇవ్వాలి. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధిస్తావ్ అని చెప్పాలి. స్నేహితులతో కూడా ఇవే మాటలు చెప్పించాలి. ఆరోగ్యం, ఆయుష్షు ఉంటే జీవితంలో చాలా సాధించవచ్చని ఆశ కల్పించాలి. ఈ సమయంలో వారిని ఒంటరిగా వదలకూడదు. చదువు ముఖ్యమే కాని చదువు కంటే జీవితం ముఖ్యమనే విషయం బోధపరచాలి. తల్లిదండ్రులు కూడా అదేసంగతి తెలుసుకోవాలి. 'తక్కువ మార్కులతో పాసైన వారు ఎక్కువ మార్కులతో పాసైనవారిని భవిష్యత్తులో జీతానికి పెట్టుకోవచ్చు'. చెప్పలేం కదా.

ఫ్యాషన్

# ఎనీటైమ్ ఇక్కత్ స్టైల్









వేసవి అనగానే మనకు కాటన్స్ ప్రధానంగా గుర్తుకు వస్తాయి. కంఫర్ట్ సరే స్టైల్ మాటేమిటి.. అనుకునేవారికి ఇక్కత్ కాంబినేషన్‌తో అట్రాక్ట్ చేస్తున్నాయి. మోడర్న్ లుక్‌తో స్టైల్‌లో సాటిరావనిపిస్తున్నాయి. సీజనల్‌గానే కాదు హుందాతనంలోనూ మాకు మేమే పోటీ అంటున్నాయి.





కాటన్స్ అనగానే వయసుపైబడినవారు వేసుకునేవి... అనే ఆలోచన ఈ రోజుల్లో మారిపోయింది. ఖాదీ కాటన్, ఇక్కత్ కాంబినేషన్‌లో షార్ట్ కుర్తీస్, జాకెట్స్, స్కర్ట్స్, ఫ్రాక్స్, టాప్స్ ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటాయి. కూల్, కంఫర్ట్ లుక్‌తో క్యాజువల్, అఫిషియల్ వేర్‌గానూ ఆకట్టుకుంటున్నాయి. ఎనీ టైమ్ స్టైల్ అంటూ ఈ సీజన్‌లో తమ స్పెషాలిటీ చాటుతున్నాయి.

కాకర డయాబెటిస్‌ను నియంత్రిస్తుంది.
వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుంది.
అంటువ్యాధులు... వాపులను తగ్గిస్తుంది.
రక్తాన్ని శుద్ధి చేస్తుంది... మంచి ఊపిరినిస్తుంది.
కళ్లు... ఎముకలు... లివర్ పనితీరును మెరుగుపరుస్తుంది.
సెల్ డ్యామేజ్‌ని అడ్డుకుని చర్మానికి మేలు చేస్తుంది.
ఇన్ని 'మేళ్లు' చేయడం కాకరకాయకే సాధ్యం.
అందుకే... ఈ చేదు రుచులను స్వాగతిద్దాం.
ఈ వారం మన 'వంటిల్లు'ను కాకరకు వేదిక చేద్దాం.

వంటిల్లు



# కాకర కరకర

## చిప్స్...



**కావలసినవి:** కాకరకాయలు – పావు కేజీ ; మజ్జిగ – 50 మిలీ ; చింతపండు – అంగుళం ముక్క ; ఉప్పు – టీ స్పూన్ ; మిరప్పొడి– అర టీ స్పూన్ ; నూనె– 2 టేబుల్ స్పూన్‌లు ; ఆవాలు – అర టీ స్పూన్ ; పచ్చి శనగపప్పు – టీ స్పూన్ ; వెల్లుల్లి రేకలు – 4 ; ఎండుమిర్చి –2.

**తయారీ:** ● కాకరకాయలను శుభ్రంగా కడిగి మొదలు, చివరలు తీసేసి చక్రాలుగా (మరీ పలుచగా కాదు, కొంచెం మందంగా) తరగాలి. ఈ ముక్కలను మందపాటి పాత్రలో వేసి అందులో మజ్జిగ, ఉప్పు, చింతపండు వేసి సన్నమంట మీద ఐదు నిమిషాల సేపు (తేమ ఇగిరి పోయేవరకు) ఉడికించాలి. ● మందపాటి బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, పచ్చి శనగపప్పు, ఎండుమిర్చి, వెల్లుల్లి రేకలు వేసి వేగిన తర్వాత ఉడికించి పెట్టుకున్న కాకరకాయ ముక్కలను వేసి వేయించాలి. చివరగా కారం చల్లి దించేయాలి. ఇందులో పల్లీల పొడి లేదా కొబ్బరి కారం కూడా చల్లుకోవచ్చు. ఇది పప్పు, సాంబార్, రసంలోకి చక్కటి సైడ్ డిష్. ● కాకరకాయ చిప్స్‌ను నిల్వ చేసుకోవాలంటే... మజ్జిగలో ఉడికించిన తర్వాత ముక్కలను ఒకరోజు ఎండ బెట్టి ఆ తర్వాత నూనెలో వేయించుకోవాలి. ఇలా చేస్తే వారం పాటు తాజాగా ఉంటాయి.

## తోరన్...



**కావలసినవి:** కాకరకాయలు – అర కేజీ ; పచ్చి కొబ్బరి తురుము – పావు కేజీ ; పచ్చి మిర్చి– 10 (సన్నగా తరగాలి) ; బెల్లం లేదా బెల్లం పొడి– 3 టేబుల్ స్పూన్‌లు ; ఉప్పు – టీ స్పూన్ ; పసుపు– అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; నూనె– 5 టేబుల్ స్పూన్‌లు.

**తయారీ:** ● కాకరకాయలను శుభ్రంగా కడగాలి. చివరలు తొలగించి కాయను నిలువుగా చీల్చాలి. ● స్పూన్‌తో కాయలోని గింజలను, మెత్తటి భాగాన్ని తీసేయాలి. కాయ పై భాగాలను చిన్న ముక్కలుగా తరగాలి. ● ఈ ముక్కలను మందపాటి పాత్రలో వేయాలి. అందులో బెల్లం, పచ్చిమిర్చి తరుగు, కొబ్బరి తురుము వేసి (నీరు పోయకుండా) సన్నమంట మీద ఉడికించాలి. కొద్దిగా వేడెక్కిన తర్వాత పసుపు, పసుపు, నూనె కూడా వేసి కలిపి మూత పెట్టి ఐదు నిమిషాల సేపు ఉడకనివ్వాలి. ఆ తరవాత తరచూ కలుపుతూ ఉడికించాలి. అవసరం అనిపిస్తే మరికొద్దిగా నూనె వేయాలి. కరివేపాకు వేసి కలిపి మూత పెట్టి మగ్గనివ్వాలి. ఈ కేరళ కర్రీ అన్నంలోకి రొట్టెల్లోకి కూడా మంచి కాంబినేషన్.

## పవక్కై తీయర్ కర్రీ ...



**కావలసినవి:** కాకరకాయలు – 2 (ముక్కలు తరగాలి) ; ఉల్లిపాయలు – పది (సాంబారు ఉల్లిపాయలు) ; పసుపు – అర టీ స్పూన్ ; చింతపండు రసం– టేబుల్ స్పూన్ ; చింతపండు – ఒక కణుపు ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; కొబ్బరి నూనె లేదా వంట నూనె – టీ స్పూన్ ; ఆవాలు – పావు టీ స్పూన్ ; కరివేపాకు రెమ్మ – 1 ; ఎండుమిర్చి – 2.

**మసాలా కోసం:** మెంతులు – అర టీ స్పూన్ ; ధనియాలు – టేబుల్ స్పూన్ ; ఎండుమిర్చి – 1 ; తాజా కొబ్బరి తురుము – కప్పు.

**తయారీ:** ● కాకరకాయ ముక్కల్లో చింతపండు, ఉప్పు, పసుపు వేసి ఒక మోస్తరుగా ఉడికించాలి. ఇలా చేయడం వల్ల చేదు విరిగిపోతుంది. ● ప్రెషర్ కుకర్‌లో కాకర ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, చింతపండు రసం, ఉప్పు, పసుపు వేసి మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ● ప్రెషర్ తగ్గేలోపు మసాలా సిద్ధం చేసుకోవాలి. ● ఒక బాణలిలో మెంతులు, ధనియాలు, ఎండుమిర్చి వేసి సన్న మంట మీద దోరగా వేగిన తర్వాత కొబ్బరి తురుము వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● ఈ దినుసులన్నీ చల్లారిన తర్వాత తగినంత నీటిని కలుపుతూ మెత్తగా పేస్ట్ చేయాలి. ● కుకర్ మూత తీసి మసాలా వేసి కలిపి మళ్లీ వెలిగించి మూత పెట్టకుండా ఉడికించాలి. అవసరాన్ని బట్టి మరికొంత నీటిని కలిపి రుచి చూసుకుని చిక్కదనం సరిపోయే వరకు పెద్ద మంట మీద ఉడికించి దించేయాలి.
– బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, ఎండుమిర్చి, కరివేపాకు వేయించి కర్రీలో వేసి కలిపితే పావక్క తీయాల్ రెడీ.

## స్టఫ్‌డ్..



**కావలసినవి:** కాకరకాయలు – పావు కేజీ ; పసుపు – అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ ; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు.

**స్టఫ్ కోసం:** మీగడ లేదా తరిగిన పనీర్– 2 టేబుల్ స్పూన్‌లు మిరప్పొడి– టీ స్పూన్ ; ఉప్పు– టీ స్పూన్ ; చాట్ మసాలా పొడి లేదా గరం మసాలా పొడి– టేబుల్ స్పూన్ ; ఆమ్‌చూర్ పౌడర్– టీ స్పూన్.

**తయారీ:** ● కాకరకాయలను కడిగి మొదలు, చివరలు తీసేసి ఒక్కో కాయను ముక్కలుగా (ఫొటోలో కనిపిస్తున్నట్లు) చేయాలి. ● ఒక పాత్రలో నీటిని మరిగించి, మరుగుతున్న నీటిలో పసుపు, ఉప్పు, కాకరకాయ ముక్కలను వేసి మూతపెట్టి మంట ఆపేయాలి. ● ఐదారు నిమిషాల తర్వాత నీటిలో నుంచి కాకరకాయ ముక్కలను తీసి ఒక ప్లేట్‌లో పెట్టాలి. ● స్టఫ్ కోసం తీసుకున్న దినుసులన్నింటినీ ఒక పాత్రలో వేసి బాగా కలపాలి. కాకరగింజలను తొలగించి ఆ స్థానంలో ఈ మిశ్రమాన్ని స్టఫ్ చేయాలి. ● బాణలిలో నూనె వేడి చేసి స్టఫ్ చేసిన కాకరకాయ ముక్కలను వేసి వేయించాలి.

**గమనిక:** స్టఫ్ కోసం ఉల్లి, వెల్లుల్లి కారం కూడా వాడుకోవచ్చు.



## ఫైనల్లో బెర్త్ కోసం బరిలో భారత బాక్సర్లు

ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ముగ్గురు భారత బాక్సర్లు కీలకపోరుకు సిద్ధమయ్యారు. తెలంగాణకు చెందిన హుసాముద్దీన్ (57 కేజీలు), హరియాణాకు చెందిన దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) సెమీఫైనల్ బౌట్‌లలో పోటీపడనున్నారు. 2022 యూరోపియన్ చాంపియన్ బిలాలా బెనామా (ఫ్రాన్స్)తో దీపక్; సైడెల్ హోర్టా (క్యూబా)తో హుసాముద్దీన్; 2022 ఆసియా చాంపియన్ అస్లాన్‌బెక్ షింబెర్గనోవ్ (కజకిస్తాన్)తో నిశాంత్ దేవ్ తలపడతారు. సెమీఫైనల్లో గెలిస్తే ఫైనల్ చేరి స్వర్ణ-రజత పతకాల బరిలో ఉంటారు. ఓడితే కాంస్య పతకాన్ని గెల్చుకుంటారు. భారత కాలమానం ప్రకారం నేడు సాయంత్రం గం. 5:30కు దీపక్ బౌట్ ఉంది. ఆ తర్వాత హుసాముద్దీన్, నిశాంత్ దేవ్ బౌట్‌లు జరుగుతాయి. ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ఈ బౌట్‌లను ప్రత్యక్షంగా తిలకించవచ్చు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటి వరకు భారత్ నుంచి ఒక్కరే ఫైనల్‌కు అర్హత సాధించారు. 2019లో అమిత్ పంఘాల్ (52 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకం గెల్చుకున్నాడు.

# సరబ్‌జోత్-దివ్య జోడీకి స్వర్ణం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్-దివ్య థడిగోల్ సుబ్బరాజు (భారత్) ద్వయం విజేతగా నిలిచింది. స్వర్ణ-రజత పతక ఫైనల్ పోరులో సరబ్‌జోత్-దివ్య జోడీ 16-14తో జొరానా అరునోవిచ్-దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయంపై విజయం సాధించింది. సరబ్‌జోత్ కెరీర్‌లో ఇది రెండో ప్రపంచకప్ స్వర్ణంకాగా... బెంగళూరుకు చెందిన దివ్యకు ప్రపంచకప్ టోర్నీలలో తొలి పతకం కావడం విశేషం. మొత్తం 55 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్-దివ్య ద్వయం 581 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ-రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. భారత్‌కే చెందిన ఇషా సింగ్-వరుణ్ తోమర్ జంట 578 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచి పతక మ్యాచ్‌లకు అర్హత పొందడంలో విఫలమైంది. టాప్-4లో నిలిచిన జోడీలు పతక మ్యాచ్‌లకు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో రెండు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

# 'బ్లాక్‌డే' పాటించిన రెజ్లర్లు



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్ల నిరసన జంతర్ మంతర్ వద్ద కొనసాగుతోంది. నిరసనకు 18వ రోజైన గురువారం రెజ్లర్లు 'బ్లాక్‌డే'గా పాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీరంతా నల్ల బ్యాండ్‌లు ధరించి తమ అసంతృప్తిని ప్రదర్శించారు. 'ఈ రోజు మేం బ్లాక్‌డే పాటించాం. దేశం మొత్తం మాకు అండగా నిలుస్తోంది కాబట్టి విజయం సాధిస్తామని నమ్ముతున్నాం. న్యాయం దక్కే వరకు మా నిరసన కొనసాగుతుంది' అని బజరంగ్, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ అన్నారు.

## శ్రీకాంత్‌కు విదేశీ కోచ్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్నాడు. ఇండోనేసియాకు చెందిన వీంపి నహార్డి ఇక నుంచి శ్రీకాంత్‌కు శిక్షణ ఇస్తాడు. 2021 డిసెంబర్‌లో భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్‌గా ఉన్న అగుస్ ద్వి సాంతోసో తిరిగి వెళ్లిపోయాక భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్ లేకుండా పోయాడు. కోచ్ కావాలని భారత స్పోర్ట్స్ అథారిటీకి గత జనవరిలో ప్రతిపాదన పంపించినా ఎలాంటి చర్యలు లేకపోవడం... ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలు మొదలుకావడంతో తానే కోచ్‌ను నియమించుకున్నానని శ్రీకాంత్ తెలిపాడు.

## భారత్‌కు క్లిష్టమైన 'డ్రా'





దోహా: ఏషియన్ కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు కఠినమైన 'డ్రా' ఎదురైంది. వచ్చే ఏడాది జనవరిలో ఖతర్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్ 'బి'లో ఆస్ట్రేలియా (ప్రపంచ 29వ ర్యాంక్), ఉజ్బెకిస్తాన్ (74వ ర్యాంక్), సిరియా (90వ ర్యాంక్) జట్లతో కలిసి భారత్ (101వ ర్యాంక్) ఉంది. వచ్చే ఏడాది జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. 67 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో భారత జట్టు 1964లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత భారత్ 1984లో, 2011లో, 2019లో ఈ టోర్నీకి అర్హత సాధించినా గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

# జై జైస్వాల్...


చహల్

### 47 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98 నాటౌట్

- 9 వికెట్లతో రాజస్తాన్ ఘన విజయం
- ఈడెన్‌లో కోల్‌కతా చిత్తు
- చహల్‌కు 4 వికెట్లు




యశస్వి జైస్వాల్

తొలి ఓవర్లో 6, 6, 4, 4, 2, 4... ఇలా దూకుడు మొదలు పెట్టిన యశస్వి జైస్వాల్ ఆగలేదు... తొలి 6 బంతుల్లో 26 పరుగులు రాబట్టిన అతను తర్వాతి 7 బంతుల్లో మరో 24 పరుగులు కొట్టేశాడు. అంతే...13 బంతుల్లో ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో కొత్త రికార్డు సృష్టించాడు. 3 ఓవర్లలోపే యశస్వి హాఫ్ సెంచరీ అయిపోయింది. మరో 3 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 78 పరుగులు. అక్కడే మ్యాచ్‌లో ఎవరు గెలవబోతున్నారో అర్థమైపోయింది! ఇక మిగిలింది యశస్వి ఎంత దూరం, ఎలా వెళతాడనేది... సెంచరీ వరకు చేరగలిగాడు కానీ రెండు పరుగుల తేడాతో శతకం చేజారింది. అయితేనేం ఐపీఎల్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడిన జైస్వాల్ రాజస్తాన్ జట్టును గెలిపించాడు... మరో ఎండ్‌లో కెప్టెన్ సామ్సన్ మెరుపు బ్యాటింగ్‌తో పని సులువైంది. రాజస్తాన్ 41 బంతులు మిగిలి ఉండగానే నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది.

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | పా | నె.ర. |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 11 | 8 | 3 | 0 | 16 | 0.951 |
| చెన్నై | 12 | 7 | 4 | 1 | 15 | 0.493 |
| రాజస్తాన్ | 12 | 6 | 6 | 0 | 12 | 0.633 |
| ముంబై | 11 | 6 | 5 | 0 | 12 | -0.255 |
| లక్నో | 11 | 5 | 5 | 1 | 11 | 0.294 |
| బెంగళూరు | 11 | 5 | 6 | 0 | 10 | -0.345 |
| కోల్‌కతా | 12 | 5 | 7 | 0 | 10 | -0.357 |
| పంజాబ్ | 11 | 5 | 6 | 0 | 10 | -0.441 |
| హైదరాబాద్ | 10 | 4 | 6 | 0 | 8 | -0.472 |
| ఢిల్లీ | 11 | 4 | 7 | 0 | 8 | -0.605 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

### ఐపీఎల్‌లో నేడు

ముంబై × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్తాన్ పండగ చేసుకుంది. నైట్‌రైడర్స్ బ్యాటింగ్ చేసినంత సేపూ నెమ్మదిగా అనిపించిన పిచ్‌పైనే పరుగులు వరద పారించి కీలక విజయాన్ని అందుకుంది. గురువారం జరిగిన పోరులో రాజస్తాన్ 9 వికెట్ల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (42 బంతుల్లో 57; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. యుజువేంద్ర చహల్ 25 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి కోల్‌కతాను కట్టడి చేశాడు. అనంతరం రాజస్తాన్ 13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 151 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 98 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (29 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగి జట్టును లక్ష్యానికి చేర్చారు.

వెంకటేశ్ అయ్యర్ బ్యాటింగ్‌ను మినహాయిస్తే కోల్‌కతా ఇన్నింగ్స్ ఆసాంతం పేలవంగా సాగింది. వెంకటేశ్ కూడా మరీ విధ్వంసకరంగా ఆడకపోయినా... పరిస్థితిని బట్టి తనవంతు పాత్ర పోషించాడు. వెంకటేశ్ 42 బంతుల్లో 57 పరుగులు చేయగా ... ఇతర ఆటగాళ్లంతా కలిసి 78 బంతుల్లో 89 పరుగులు చేయగలిగారంటే అతని ఇన్నింగ్స్ విలువ తెలుస్తుంది.

**ధనాధన్...**

ఆశ్చర్యకరంగా పార్ట్‌టైమ్ బౌలర్, కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా మొదటి ఓవర్ వేశాడు. ఆ ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టి ప్రత్యర్థిని యశస్వి కఠినంగా శిక్షించాడు. సమన్వయ లోపంతో జోస్ బట్లర్ (0) రనౌట్ కావడంతో రాయల్స్ తొలి వికెట్ కోల్పోయింది. అయితే జట్టుపై అది ఎలాంటి ప్రభావం చూపించలేదు. యశస్వి, సామ్సన్ కలిసి వేగం తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరి షాట్లకు నైట్‌రైడర్స్ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. సామ్సన్ 16 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను నేలపాలైంది. అనంతరం అనుకూల్ వేసిన ఓవర్లో 3 సిక్సర్లతో సామ్సన్ చెలరేగాడు. చివర్లో యశస్వి సెంచరీ విషయంలో కాస్త ఉత్కంఠ నెలకొంది. యశస్వి 94 పరుగుల వద్ద ఉండగా రాయల్స్‌కు 3 పరుగులు కావాలి. 13వ ఓవర్ చివరి బంతికి పరుగు తీయని సామ్సన్ సిక్సర్ కొట్టమన్నట్లుగా సైగ చేస్తూ యశస్వికి అవకాశం ఇచ్చాడు. అయితే తర్వాతి బంతికి ఫోర్ మాత్రమే రావడంతో యశస్వి 98 పరుగుల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది. అయితే దానిని పట్టించుకోకుండా అతను విజయానందాన్ని ప్రదర్శించాడు.



**1** ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసిన క్రికెటర్‌గా యశస్వి (13 బంతుల్లో) నిలిచాడు. గతంలో ఈ రికార్డు కేఎల్ రాహుల్, కమిన్స్ (14 బంతుల్లో) పేరిట ఉంది.

**187** ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చహల్ రికార్డు నెలకొల్పాడు. డ్వేన్ బ్రేవో (161 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును చహల్ (143 బంతుల్లో 187 వికెట్లు) సవరించాడు.

### స్కోరు వివరాలు

**కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** జేసన్ రాయ్ (సి) హెట్‌మైర్ (బి) బౌల్ట్ 10; గుర్బాజ్ (సి) సందీప్ శర్మ (బి) బౌల్ట్ 18; వెంకటేశ్ (సి) బౌల్ట్ (బి) చహల్ 57; నితీశ్ రాణా (సి) హెట్‌మైర్ (బి) చహల్ 22; రసెల్ (సి) అశ్విన్ (బి) ఆసిఫ్ 10; రింకూ సింగ్ (సి) రూట్ (బి) చహల్ 16; శార్దుల్ (ఎల్బీ) (బి) చహల్ 1; అనుకూల్ (నాటౌట్) 6; నరైన్ (సి) రూట్ (బి) సందీప్ 6; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 149. వికెట్ల పతనం:** 1-14, 2-29, 3-77, 4-107, 5-127, 6-129, 7-140, 8-149. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-15-2, సందీప్ శర్మ 4-0-34-1, అశ్విన్ 4-0-32-0, రూట్ 2-0-14-0, యజువేంద్ర చహల్ 4-0-25-4, ఆసిఫ్ 3-0-27-1.

**రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** యశస్వి (నాటౌట్) 98; బట్లర్ (రనౌట్) 0; సామ్సన్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 151. వికెట్ల పతనం:** 1-30. **బౌలింగ్:** నితీశ్ రాణా 1-0-26-0, హర్షిత్ రాణా 2-0-22-0, శార్దుల్ ఠాకూర్ 1.1-0-18-0, వరుణ్ చక్రవర్తి 3-0-28-0, సునీల్ నరైన్ 2-0-13-0, సుయశ్ 3-0-22-0, అనుకూల్ 1-0-20-0.

# సినిమా



"ఓ నటుడుగా నన్ను నేనెప్పుడూ విమర్శించుకుంటూనే ఉంటాను... అభినందించుకోను. ఎప్పటికప్పుడు తప్పులు వెతుకుతూనే ఉంటాను.. నటుడిగా నన్ను నేను మెరుగుపరచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాను" అని అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'కస్టడీ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగచైతన్య చెప్పిన విశేషాలు.

## ఆ విషయం ఓ సవాల్‌గా మారింది
- నాగచైతన్య

- తమిళ చిత్రం 'మానాడు' విడుదల కాకముందే వెంకట్ ప్రభుగారు నాకు 'కస్టడీ' స్టోరీ చెప్పారు. అయితే 'మానాడు' విడుదలై, హిట్ సాధించిన తర్వాత, ఈ సినిమానే మేం తెలుగులో రీమేక్ చేస్తే బాగుంటుందన్నట్లుగా కొందరు నిర్మాతలు అభిప్రాయపడ్డారు. కానీ 'కస్టడీ' స్టోరీ నన్ను ఎగ్జయిట్ చేసింది. పైగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొంతవరకు పూర్తయింది. దీంతో 'కస్టడీ'ని సెట్స్‌పైకి తీసుకెళ్లాం. ఈ సినిమాలో భాగంగా కొందరు పోలీసులను కలిశాను. వారి కథలు నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి.
- ఈ సినిమాలో నేను పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్ర చేశాను. నా కెరీర్‌లో ఎప్పుడూ చేయనటువంటి కొన్ని కొత్త యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా కోసం చేశాం. కథ రీత్యా ఈ తరహా యాక్షన్ సీక్వెన్స్‌లు అవసరం అయ్యాయి. అయితే కొన్ని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం కొంత రిహార్సల్స్ చేశాం. ఈ సినిమాలోని వాటర్ సీక్వెన్స్ కోసం మూడు రోజులు రిహార్సల్స్ చేసి, దాదాపు 15 రోజులు షూట్ చేశాం. ఈ ఎపిసోడ్ ఓ హైలైట్‌గా ఉంటుంది.
- సినిమా మొదలైన తొలి ఇరవై నిమిషాలు కూల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే స్క్రీన్‌పైకి అరవింద్ స్వామిగారు వస్తారో అప్పట్నుంచి స్టోరీ మలుపు తీసుకుని ఆడియన్స్‌ను స్క్రీన్‌పై నుంచి చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్, అరవింద్ స్వామి, ప్రియమణి వంటి సీనియర్స్ నటించారు. వారి నుంచి నేను కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఇచ్చిన డైలాగ్స్‌ను తనదైన స్టైల్లో ఇంప్రూవ్ చేసి చెబుతుంటారు అరవింద్ స్వామి గారు. ఇది నాకు చాలా కొత్తగా అనిపించింది. వెంకట్‌గారు ఏ స్క్రిప్ట్ అయితే నాకు చెప్పారో అదే తీశారు. ఆయన స్క్రీన్‌ప్లే స్టయిల్ తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది. ఈ చిత్రంలో కమర్షియల్ ఎలిమెంట్స్ స్టోరీకి తగ్గట్లుగానే ఉంటాయి. ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అవుట్‌పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నాను. పోలీస్ బ్యాక్‌డ్రాప్ సినిమాల్లో నాకు 'ఘర్షణ', నాన్నగారి 'శివమణి', 'జేమ్స్ బాండ్' యాక్షన్ ఫ్రాంచైజీ చిత్రాలు ఇష్టం.
- నిర్మాత శ్రీనివాసా చిట్టూరిగారు సెట్స్‌లో కూల్‌గా ఉంటారు. 'కస్టడీ' నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించబడింది. ఈ సినిమా 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. ఇళయరాజాగారు, యువన్ శంకర్‌రాజాగార్లు ఇచ్చిన మ్యూజిక్ 'కస్టడీ'కి ప్లస్. 'కస్టడీ'ని వేరే సినిమాతో పోల్చవద్దు. 'కస్టడీ' చిత్రం 'కస్టడీ'యే.
- నేను తెలుగు డబ్బింగ్ కోసం దాదాపు పది రోజులు తీసుకుంటాను. కానీ తమిళ 'కస్టడీ' సినిమాకు డబ్బింగ్ పూర్తి చేయడానికి నెలరోజుల టైమ్ పట్టింది. నా సొంత వాయిస్ అయితే ఆడియన్స్‌కు యాక్టర్‌గా చేరువ కావొచ్చు. మన పెర్ఫార్మెన్స్ కూడా మెరుగ్గా కనిపిస్తుంది. అందుకే తమిళంలో డబ్బింగ్ చెప్పాను.
- నేను ఫలానా రకమైన సినిమాలు చేస్తేనే ఆడియన్స్‌కు నచ్చుతాయని అదే ట్రాక్‌లోకి వెళితే ఓ యాక్టర్‌గా అది నా బలహీనత అవుతుంది. ఈ విషయంలో నన్ను నేను కన్విన్స్ చేసుకోలేను. గతంలో నేను చేసిన కొన్ని లవ్‌స్టోరీలు వర్కౌట్ అయ్యాయి. అలా అని అవే సినిమాలు చేస్తుంటే ఓ యాక్టర్‌గా ఎదగలేను. చైతన్య ఎలాంటి సబ్జెక్ట్ అయినా బాగా చేస్తాడని ఆడియన్స్‌తో అనిపించుకోవాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులకు ఏ రకమైన సినిమాలు నచ్చుతున్నాయో తెలుసుకోవడం చాలెంజ్‌లా మారింది. కానీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా ఇస్తే వారి ఆదరణ ఓ రేంజ్‌లో ఉంటుంది.
- నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి త్వరలో అధికారికంగా చెబుతాను. 'ధూత' వెబ్ సిరీస్ రిలీజ్ అమెజాన్ చేతిలో ఉంది. ఈ ఏడాదే స్ట్రీమింగ్ స్టార్ట్ కావొచ్చు.

**మా తాతగారు, నాన్నగారు గొప్ప గొప్ప సినిమాలు చేశారు. కొన్ని స్టాండర్డ్స్ క్రియేట్ చేశారు. కొందరు వారితో మాకు పోలికలు పెడుతుంటారు. అయితే ఈ విషయాన్ని నేను ఓ ప్రెజర్‌లా తీసుకోను. చాలెంజ్‌లా స్వీకరించి, నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఆ స్థాయికి నేను రీచ్ అవుతానా? లేదా అనేది నాకు తెలియదు. కానీ నా శక్తివంచన లేకుండా కష్టపడుతూనే ఉంటాను.**


**నా గురించిన కొన్ని వార్తలు వస్తూనే ఉన్నాయి (విడాకుల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ..). డిఫరెంట్ వార్తలు రాస్తున్నారు. కానీ ఆడియన్స్ ఫూల్స్ కాదు. తెలివైనవారు. ఏది జెన్యూన్ న్యూస్.. ఏది కాదనేది వారికి తెలుసని అనుకుంటున్నాను. నేను అయితే నవ్వుకుని వదిలేస్తున్నాను.**

## గేమ్ స్టార్ట్

'ది కేరళ స్టోరీ' వంటి వివాదాత్మక సినిమా తర్వాత హీరోయిన్ అదా శర్మ ఓ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. 'హేట్ స్టోరీ 2' ఫేమ్ విశాల్ పాండ్య దర్శకత్వంలో శ్రేయాస్ తల్పాడే హీరోగా నటిస్తున్న చిత్రం 'ది గేమ్ ఆఫ్ గిర్గిట్'. ఈ చిత్రంలో అదా శర్మ నటిస్తున్నట్లు చిత్రయూనిట్ గురువారం ప్రకటించింది. ఇటీవల కాలంలో యువతలో బాగా ప్రాచుర్యం పొందిన 'బ్లూ వేల్ గేమ్' (బ్లూ వేల్ ఛాలెంజ్) నేపథ్యంలో థ్రిల్లర్‌గా ఈ కథ సాగుతుంది. ఇందులో అదా శర్మ పోలీస్ పాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ- ''గతంలో 'కమాండో' సినిమాలో భావనా రెడ్డి అనే పోలీస్ పాత్ర చేశాను. ఆ పాత్ర మంచి ప్రజాదరణ పొందింది. ఇప్పుడు 'ది గేమ్ ఆఫ్ గిర్గిట్'లో గాయత్రి భార్గవ్ అనే పోలీస్ పాత్ర చేస్తున్నాను. నా పాత్ర సరదాగా, విభిన్నంగా ఉంటుంది'' అన్నారు.


అదాశర్మ

## ఓ సరదా ప్రయాణం


నాగశౌర్య


నాగశౌర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగబలి'. ఈ చిత్రం ద్వారా పవన్ బాసం శెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న 'రంగబలి'ని జూలై 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. నాగశౌర్య ట్రెండీ గెటప్‌లో కనిపిస్తున్న ఓ పోస్టర్ ద్వారా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే కథతో 'రంగబలి' ఫన్ రైడ్ (సరదా ప్రయాణం) గా ఉండబోతోంది. ఇందులో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.. ఇందుకు ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్ మణి.

## ప్రపంచంలో జరుగుతున్నదే మళ్ళీ పెళ్లిలో చూపిస్తున్నాం
- వీకే నరేశ్

''ఓ మనిషి చావు చివరి దశలో ఉన్నప్పుడు చేయాల్సిన పనులు ఏవైనా మిగిలి ఉన్నాయా? ఏమైనా ప్రదేశాలను చూడాలనుకుని చూడలేక పోయామా? మనవల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందా? అనే మూడు అంశాల గురించి ఓసారి ఆలోచిస్తాడు. కానీ ఏ మనిషి జీవితంలో అయినా ఈ మూడు ఆశలు తీరనవిగా ఉండకూడదు. ఇదే 'మళ్ళీ పెళ్లి' సినిమా బేసిక్ కాన్సెప్ట్'' అన్నారు నటుడు వీకే నరేశ్. ఎమ్.ఎస్. రాజు దర్శకత్వంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. విజయకృష్ణా మూవీస్ పతాకంపై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో విజయకృష్ణా మూవీస్ లోగోను వీకే నరేశ్, పవిత్రాలు రీ లాంచ్ చేశారు. ఎమ్ఎస్ రాజు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వీకే నరేశ్ మాట్లాడుతూ- ''ప్రపంచంలో జరుగుతున్న అంశాలనే ఈ చిత్రంలో బోల్డ్‌గా చూపించాం. ఇది నా జీవితానికి సంబంధించిన సబ్జెక్ట్ కాదు'' అని అన్నారు. ''సినిమాలో ఉన్నట్లే జీవితంలో కూడా ఫస్టాఫ్, సెకండాఫ్ ఉంటాయి. ఎవరైనా సెకండాఫ్ చాలా బాగుండాలని కోరుకుంటారు.. అదే 'మళ్ళీ పెళ్లి' కాన్సెప్ట్. ఆడియన్స్‌ను చీట్ చేయడం లేదు. తప్పుని తప్పుగానే చూపిస్తున్నాం.'' అన్నారు ఎమ్ఎస్ రాజు. ''ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు ఎమ్ఎస్ రాజుగారి నుంచి చాలా నేర్చుకున్నాను'' అన్నారు పవిత్రా లోకేశ్. ఈ కార్యక్రమంలో సంగీతదర్శకులు సురేష్ బొబ్బిలి, అరుల్‌దేవ్, ఎడిటర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.



నరేశ్, పవిత్రా లోకేశ్, ఎమ్ఎస్ రాజు

## హ్యాపీ ఎండింగ్


యశ్ పూరి

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా నటించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో హామ్స్ టెక్ ఫిల్మ్స్, సిల్లీ మాంక్స్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. అజయ్ ఘోష్, విష్ణు ఓయ్, ఝాన్సీ, అనిత చౌదరి, హర్ష రోషన్, జియా శర్మ నటించిన ఈ సినిమాకు సంగీతం: రవి నిడమర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ రామానుజం.

## వాస్తవ ఘటనతో...


నిష్మా, ఇషాన్, శక్తి

ఇషాన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'అంతం కాదిది ఆరంభం'. శక్తి మహీంద్రా, నిష్మా, ప్రణాళి హీరోయిన్స్. ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ దశరథ్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. తమని ట్రాప్ చేసి, నగ్న వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు? అనేదే ఈ చిత్రకథ'' అన్నారు. సిరాజ్ మాట్లాడుతూ- ''ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలతో ఇషాన్ ఈ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించాడు'' అన్నారు. సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య, రచయిత రాంబాబు గోసాల, షేర్ స్టూడియో అధినేత దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: టి. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కర్రి మోహన్.

## హీరో ఆఫ్ ఇండియా!


అంకిత, కిషోర్

కిషోర్ తేజ, అంకిత మూలేర్ జంటగా ఆకుల రాఘవ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హీరో ఆఫ్ ఇండియా'. తుమ్మలపల్లి రామసత్య నారాయణ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ లాంచ్ చేశారు. జె. భానుప్రసాద్ స్వరపరచిన మొదటి పాటని తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, రెండో పాటని నిర్మాత సాయి వెంకట్ లాంచ్ చేశారు. ''తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, అమెరికాలోనూ మా సినిమాను రిలీజ్ చేస్తున్నందుకు హ్యాపీ'' అన్నారు తుమ్మలపల్లి రామసత్యనారాయణ.

స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
| 36 | 18 |
| 61,904 | 18,297 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 12,335 | △ | 28 |
| డోజోన్స్ | 33,293 | ▽ | 238 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,727 | ▽ | 14 |
| డాక్స్ | 15,835 | ▽ | 61 |
| షాంఘై | 3,309 | ▽ | 10 |
| నికాయ్ | 29,127 | △ | 4 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

| బులియన్ రూ.లలో – ముంబై | |
|---|---|
| బంగారం (24 క్యారట్) | 61,585 △ 90 |
| బంగారం (22 క్యారట్) | 61,339 △ 90 |
| వెండి (కిలో) | 74,795 ▽ 1,466 |



# ఐషర్ మోటార్స్‌కు ఆకర్షణీయ లాభం

- 49 శాతం వృద్ధితో రూ.906 కోట్లు
- షేరుకు రూ.37 చొప్పున డివిడెండ్

**న్యూఢిల్లీ:** ఐషర్ మోటార్స్ ఆకర్షణీయ ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 49 శాతం వృద్ధితో రూ.906 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం రూ.3,193 కోట్ల నుంచి రూ.3,804 కోట్లకు వృద్ధి చెందింది. మార్చి త్రైమాసికంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. 2,14,685 యూనిట్లు అమ్ముడుపోయాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలతో పోలిస్తే 18 శాతం పెరిగాయి. మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో ఐషర్ మోటార్స్ కన్సాలిడేటెడ్ లాభం రూ.2,914 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.1,677 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం రూ.10,298 కోట్ల నుంచి రూ.14,442 కోట్లకు వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 38 శాతం అధికంగా 8,34,895 యూనిట్లుగా నమోదయ్యాయి. మొదటి సారి లక్ష




యూనిట్లను ఒక ఆర్థిక సంవత్సరంలో ఎగుమతి చేసినట్టు సంస్థ ప్రకటించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల వ్యయాలకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, ఉత్పత్తుల అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్టు ఐషర్ మోటార్స్ తెలిపింది. ఒక్కో షేరుకు రూ.37 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ఎలాంటి మార్పు లేకుండా రూ.3,407 వద్ద ముగిసింది.

# స్వల్ప నష్టాల్లో మార్కెట్లు

సెన్సెక్స్ 36, నిఫ్టీ 18 పాయింట్లు డౌన్

**ముంబై:** దేశీ సూచీలు గురువారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 36 పాయింట్లు క్షీణించి 61,904 వద్ద, నిఫ్టీ 18 పాయింట్లు తగ్గి 18,297 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో కీలకమైన 62,000 మార్కును కూడా దాటినప్పటికీ తర్వాత పడిపోయింది. రోజులో 62,168–61,823 పాయింట్ల గరిష్ట, కనిష్ట స్థాయిల మధ్య తిరుగాడింది. ద్రవ్యోల్బణ గణాంకాలు శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో ముందు రోజున ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించడం .. సూచీల స్వల్ప నష్టాలకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. కొన్ని దిగ్గజ సంస్థల ఆర్థిక ఫలితాలు బలహీనంగా ఉండటం సైతం దేశీ సూచీలపై ప్రభావం చూపినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ (రీసెర్చ్) వినోద్ నాయర్ తెలిపారు. గురువారం నిఫ్టీ సూచీలో 21 షేర్లు నష్టాల్లో, 29 షేర్లు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ విషయానికొస్తే.. నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పోస్టు నుంచి ఏఎం నాయక్ తప్పుకుంటున్నట్లు ప్రకటించడంతో లార్సన్ అండ్




టూబ్రో సంస్థ షేర్లు అత్యధికంగా 5 శాతం క్షీణించాయి. ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, టీసీఎస్ మొదలైనవి నష్టపోయాయి. హిందుస్తాన్ యూనిలీవర్, ఎన్‌టీపీసీ, మారుతీ మొదలైనవీ లాభపడ్డాయి. ఆసియాలో దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ సూచీలు నష్టాల్లోను, జపాన్ సూచీలు లాభాల్లోనూ ముగిశాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. గురువారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ. 837 కోట్ల కొనుగోళ్లు జరపగా, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ. 200 కోట్లు విక్రయించారు. కాగా, డాలరుతో పోలిస్తే రూపాయి 15 పైసలు క్షీణించి 82.09 వద్ద క్లోజయ్యింది.

# ఏషియన్ పెయింట్స్ లాభం హైజంప్

- రూ.1,258 కోట్లుగా నమోదు
- ఆదాయాల్లోనూ చక్కని వృద్ధి
- షేరుకు రూ.21.25 డివిడెండ్

**న్యూఢిల్లీ:** ఏషియన్ పెయింట్స్ మార్చి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్‌గా రూ.1,258 కోట్ల లాభాన్ని ప్రకటించింది. ఆదాయం 11 శాతం వృద్ధితో రూ.8,751 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.874 కోట్లుగా, ఆదాయం రూ.7,890 కోట్లుగా ఉన్నాయి. మొత్తం వ్యయాలు సైతం 7 శాతానికి పైగా పెరిగి రూ.7,182 కోట్లుగా నమోదయ్యాయి. ఇక 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఏషియన్ పెయింట్స్ నికర లాభం 36 శాతం వృద్ధితో రూ.4,195 కోట్లకు ఎగసింది. ఆదాయం 19 శాతం వృద్ధితో రూ.34,368 కోట్లుగా ఉంది. మార్చి త్రైమాసికంలో అంతర్జాతీయ ఆదాయం 3 శాతం మేర క్షీణించి రూ.794 కోట్లుగా నమోదైంది. కన్సాలిడేటెడ్ స్థాయిలో రూ.34వేల కోట్ల ఆదాయాన్ని అధిగమించినట్టు ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈవో అమిత్ సింగిల్ తెలిపారు. ప్రస్తుతం తాము హోమ్ డెకరేషన్ విభాగంలో ఏకైక అతిపెద్ద కంపెనీగా అవతరించినట్టు




చెప్పారు. ఇక ఒక్కో షేరుకు రూ.21.25 చొప్పున 2022–23 సంవత్సరానికి తుది డివిడెండ్ కింద ఇవ్వాలని కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. మధ్యంతర డివిడెండ్ కింద లోగడ ఒక్కో షేరుకు రూ.4.40 చొప్పున చెల్లించడం గమనార్హం.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఏషియన్ పెయింట్స్ ధర రూ.3,139 వద్ద క్లోజయింది.

## రిలయన్స్-మెట్రో డీల్ పూర్తి





**న్యూఢిల్లీ:** భారత్‌లో తమ వ్యాపార విభాగాన్ని రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్ఆర్‌వీఎల్)కు విక్రయించే ఒప్పంద ప్రక్రియ పూర్తయినట్లు జర్మనీ రిటైల్ సంస్థ మెట్రో తెలిపింది. ఈ డీల్ కింద 31 హోల్‌సేల్ స్టోర్లు, మొత్తం రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియో ఉన్నట్లు వివరించింది. వ్యాపార బదిలీ ప్రక్రియ జరిగే సమయంలో మెట్రో ఇండియా స్టోర్లన్నీ అదే బ్రాండ్‌తో కొనసాగుతాయని, ఉద్యోగులు.. కస్టమర్ల విషయంలో పెద్ద మార్పులేమీ ఉండబోవని సంస్థ పేర్కొంది. భారత్‌లో మెట్రో కార్యకలాపాలను రూ. 2,850 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ఆర్ఆర్‌వీఎల్ గతేడాది డిసెంబర్ 22న ప్రకటించింది. ఇప్పటికే భారీగా కార్యకలాపాలు విస్తరిస్తున్న ఆర్ఆర్‌వీఎల్.. తాజాగా మెట్రో కొనుగోలుతో దేశీయంగా రిటైల్ రంగంలో మరింత పట్టు సాధించనుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆర్ఆర్‌వీఎల్ రూ. 2.30 లక్షల కోట్ల ఆదాయం ఆర్జించింది. అటు మెట్రో ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 29.8 బిలియన్ యూరోల అమ్మకాలు నమోదు చేసింది.

# ఓటీటీ పరిశ్రమ.. సూపర్ హిట్!

- 2030 నాటికి రూ.30వేల కోట్లకు
- ప్రస్తుత మార్కెట్ రూ.10వేల కోట్లు
- ఏటా 20 శాతం చొప్పున వృద్ధి
- పరిశ్రమ వర్గాల అంచనా

**న్యూఢిల్లీ:** ఓవర్ ది టాప్ (ఓటీటీ) కంటెంట్ పరిశ్రమ శరవేగంగా వృద్ధి చెందుతోంది. ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ విలువ రూ.10,000 కోట్లుగా ఉంటే, 2030 నాటికి రూ.30,000 కోట్లకు చేరుకుంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2024 మార్చి నాటికి రూ.12,000 కోట్లకు చేరుకుంటుందని, ఏటా 20 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని ఐఎన్10మీడియా సీవోవో, సీఐఐ దక్షిణ్ స్టీరింగ్ కమిటీ సభ్యుడైన అనూప్ చంద్రశేఖరన్ తెలిపారు. ఓటీటీ పరిశ్రమపై చెన్నైలో దక్షిణాది మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సీఐఐ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ''ప్రస్తుతం డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో విడుదలవుతున్న వాటితో పోలిస్తే.. వచ్చే 12 నెలల్లో దక్షిణాది భాషల్లో పెద్ద సంఖ్యలో వెబ్ సిరీస్‌లు విడుదల కానున్నాయి''అని స్టార్/డిస్నీ ఇండియా బిజినెస్ హెడ్ కృష్ణన్ కుట్టి తెలిపారు.




**దక్షిణాది సినిమాల జోరు**

దేశం మొత్తం మీద దక్షిణాది సినిమాలు అత్యధిక ఆదాయాన్ని సృష్టిస్తున్నాయి. 2022లో దక్షిణాది సినిమాలు రూ.7,000 కోట్ల ఆదాయాన్ని నమోదు చేశాయి. అంతకుముందు ఏడాది ఆదాయంతో పోలిస్తే రెట్టింపు అయింది. అంతేకాదు గతేడాది దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమ ఆదాయంలో దక్షిణాది సినిమాల వాటాయే 50 శాతంగా ఉండడం గమనార్హం. ఈ వివరాలను సీఐఐ దక్షిణాది విభాగం రూపొందించిన నివేదికలో పేర్కొంది. 'తమిళం, తెలుగు, కన్నడ, మలయాళంతో కూడిన దక్షిణాది చిత్ర పరిశ్రమ ఆదాయం 2022లో రూ.7,836 కోట్లుగా ఉంది. 2021లో ఆదాయం రూ.3,988 కోట్లే. 2022లో మొత్తం భారత సినీ పరిశ్రమ ఆదాయం రూ.15,000 కోట్లు. దక్షిణాదిలోనూ తమిళ సినిమా రూ.2,950 కోట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. ఆ తర్వాత రూ.2,500 కోట్లతో తెలుగు సినీ పరిశ్రమ ఉంటే, కన్నడ పరిశ్రమ ఆదాయం రూ.1,570 కోట్లు, మలయాళ పరిశ్రమ ఆదాయం రూ.816 కోట్లు. ముఖ్యంగా కన్నడ నాట కేజీఎఫ్:చాప్టర్ 1, కాంతార సినిమాలు బంపర్ వసూళ్లతో పరిశ్రమ రూపాన్ని మార్చేశాయి'అని నివేదిక తెలిపింది. మలయాళ పరిశ్రమ స్థానికంగా, విదేశాల్లోనూ ఆదాయాన్ని పెంచుకుంది. దర్శకుడు రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' ఒక్కటే రూ. 1,200 కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. కమల్ హాసన్ విక్రమ్, మణిరత్నం పొన్నియన్ సెల్వన్ సినిమాలు తమిళనాట ఆదాయాన్ని పెంచాయి. 2022 లో దక్షిణాదిన 916 సినిమాలు విడుదలయ్యాయి. థియేటర్, ఓటీటీలో విడుదలైనవీ ఇందులో ఉన్నాయి.

## కంటెంట్‌కు డిమాండ్

స్క్రిప్ట్‌ను అందించేందుకు తాము ఒక నెల సమయం తీసుకుంటున్నామని అర్హ మీడియా అండ్ బ్రాడ్‌కాస్టింగ్ సహ వ్యవస్థాపకుడు అజిత్ ఠాకూర్ తెలిపారు. ప్రస్తుతం ఏటా వివిధ ప్లాట్‌ఫామ్‌ల కోసం 60 ఒరిజినల్స్ అవసరం ఉంటోందన్నారు. నిర్మాతలు దీన్ని అవకాశంగా తీసుకోవాలని కోరారు. ''తమిళం, తెలుగు ఓటీటీపైనే జీ ఓటీటీ ఇప్పుడు ప్రధానంగా దృష్టి సారించింది. ప్రస్తుతం కన్నడ ఓటీటీ మార్కెట్ చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. మలయాళం ఓటీటీ పరిశ్రమకు కావాల్సిన కంటెంట్‌ను ప్రస్తుతం నిర్మాతలు అందించే స్థితిలో ఉన్నారు''అని జీ5 ఓటీటీ చీఫ్ క్లస్టర్ ఆఫీసర్ సిజు ప్రభాకరన్ వివరించారు.

## హ్యుందాయ్ రూ.20,000 కోట్ల పెట్టుబడి

**న్యూఢిల్లీ:** వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా భారత్‌లో రూ.20,000 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు వెల్లడించింది. తమిళనాడులో వచ్చే 10 ఏళ్లలో ఈ మొత్తాన్ని దశలవారీగా వెచ్చించనున్నట్టు తెలిపింది. ఎలక్ట్రిక్ వెహికిల్స్ అభివృద్ధి, వాహనాల ప్లాట్‌ఫామ్స్ ఆధునీకరణకు ఖర్చు చేయనున్నట్టు ప్రకటించింది. దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా తమిళనాడు ప్లాంటును ఈవీల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు హ్యుందాయ్ మోటార్ ఇండియా




ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్ తెలిపారు. 1,78,000 యూనిట్ల వార్షిక తయారీ సామర్థ్యంతో బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు హ్యుందాయ్ తెలిపింది. అయిదేళ్ల వ్యవధిలో ప్రధాన రహదారుల్లోని కీలక ప్రదేశాలలో 100 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. హ్యుందాయ్ వార్షిక తయారీ సామర్థ్యం 8.5 లక్షల యూనిట్లకు పెంచాలని నిర్ణయించింది.

**యువర్స్**

• టెక్... టాక్

### మోటో వాచ్

మోటోరోలా త్వరలో మోటో వాచ్ 200 తీసుకురానుంది. దీని వివరాలు...



డిస్‌ప్లే: 1.78 అంగుళాలు బ్యాటరీ: 355 ఎంఏహెచ్ • 5 ఏటీయం వాటర్ ప్రూఫ్; • హార్ట్‌రేట్ మానిటర్ • ఎస్పీవో2 మీటర్ • బ్లూటూత్: 5.3 ఎల్ఈ; • బిల్ట్-ఇన్ జీపీఎస్ • మైక్రోఫోన్, స్పీకర్ కలర్స్: బ్లాక్ అండ్ గోల్డ్

### వివో ఎక్స్90 ప్రో



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
రిజల్యూషన్: 2800×1260 పిక్సెల్స్
రిఫ్రెష్‌రేట్: 60 హెచ్‌జడ్, 120 హెచ్‌జడ్ బ్లూటూత్: 5.3
బ్యాటరీ: 4,870 ఎంఏహెచ్
కలర్: లెజెండరీ బ్లాక్
• ఫింగర్‌ప్రింట్ సెన్సర్ • ఫ్రంట్ కెమెరా: 32–మెగా పిక్సెల్స్

### ఇన్‌స్టా రీల్స్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి...

థర్డ్–పార్టీ యాప్‌తో అవసరం లేకుండా స్మార్ట్‌ఫోన్ (ఆండ్రాయిడ్, ఐవోఎస్)లో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి... • ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేసిన తరువాత డౌన్‌లోడ్ చేయాలనుకున్న 'రీల్' ప్లే చేయాలి. • షేర్ ఐకాన్(పేపర్ ప్లేన్) క్లిక్ చేయాలి. • యాడ్ రీల్స్–క్లిక్ • నెక్స్ట్ పేజీ టాప్ రైట్ కార్నర్‌లో 3 డాట్స్ క్లిక్ చేయాలి. 'సేవ్ నౌ' సెలెక్ట్ చేసుకోవాలి • ఇప్పుడు 'రీల్' ఇన్‌స్టాగ్రామ్ ఫోల్డర్‌లోకి డౌన్‌లోడ్ అవుతుంది.



• గేమింగ్


### ఖతం పార్టీ



రోల్‌ప్లేయింగ్ వీడియో గేమ్ 'డార్కెస్ట్ డంజెన్-2' ఇటీవల విడుదలైంది. 2021లో వచ్చిన 'డార్కెస్ట్ డంజెన్'కు సీక్వెల్‌గా వచ్చిన గేమ్ ఇది. గత గేమ్‌లాగే దీనిలోనూ రోగ్ లైక్ ఎలిమెంట్స్, మల్టిపుల్ క్యారెక్టర్స్ ఉంటాయి. ప్రతి క్యారెక్టర్‌కు తనదైన బలం ఉంటుంది. ఈ గేమ్ అంతిమలక్ష్యం దుష్టశక్తి ఉన్న కొండ దగ్గరికి చేరుకోవడం. ప్రపంచాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలనుకుంటున్న దుష్టశక్తి నుంచి ప్రపంచాన్ని రక్షించడం. ఒరిజినల్‌లోని 2డీ-ఇలస్ట్రేటెడ్ క్యారెక్టర్స్‌ను 3డీ మోడల్స్‌లో అప్‌గ్రేడ్ చేశారు. అయితే గేమ్‌కు సంబంధించిన జనరల్ టోన్ మాత్రం సేమ్ టు సేమ్.

ప్లాట్‌ఫామ్స్: విండోస్ మోడ్స్: సింగిల్ ప్లేయర్
జానర్: రోల్ ప్లేయింగ్ రోగ్ లైక్

# యంత్ర తంత్రం



ఉపాయాలు ఊరకే రావు.
గట్టిగా ఆలోచిస్తేనే వస్తాయి.
ఈ నలుగురు కుర్రాళ్లు అలాగే ఆలోచించారు.
శానిటేషన్, హెల్త్‌కేర్, కెమికల్ ఇండస్ట్రీ,
ఆయిల్ అండ్ గ్యాస్ సెక్టార్‌లకు ఉపయోగపడే
రోబోటిక్స్‌కు రూపకల్పన చేశారు. శాస్త్రానికి
సామాజిక ధర్మం జోడించి 'జెన్ రోబోటిక్స్'తో
ఘన విజయం సాధించారు...

• సక్సెస్ స్టోరీ



ఎడమ నుంచి... అరుణ్ జార్జ్, రషీద్, విమల్ గోవింద్, నిఖిల్

సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేసే క్రమంలో ఎంతో మంది అమాయకులు బలైపోతున్నారు. ప్రకటిత గణాంకాల కంటే మృతుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని సఫాయి కర్మాచారి ఆందోళన (ఎస్‌కేఏ) అనే స్వచ్ఛంద సంస్థ చెబుతోంది. మాన్యువల్ స్కావేంజింగ్‌ను నిషేధించాలని ఆ సంస్థ డిమాండ్ చేస్తుంది.

కేరళలో ముగ్గురు స్కావెంజర్లు చనిపోయిన విషాదం ఇంజనీరింగ్ చేస్తున్న అరుణ్ జార్జ్, నిఖిల్ ఎన్‌పీ, రషీద్ కె, విమల్ గోవింద్ ఎంకేలను బాగా కదిలించింది.

'ఈ సమస్యకు పరిష్కారం కనుక్కోవాలి' అని గట్టిగా అనుకున్నారు. మలప్పురం(కేరళ) జిల్లాలోని కుట్టిపురం ఎంఈఎస్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో 'రోబోటిక్ స్కావెంజర్' ఆలోచన చేశారు. మొదట కాలేజీ ప్రాజెక్ట్‌గా ఆ ఆలోచనను పట్టాలెక్కించారు.

చదువులు పూర్తై ఉద్యోగాల కోసం కార్పొరేట్ ప్రపంచంలోకి అడుగు పెట్టాక కూడా వారిని 'రోబోటిక్ స్కావెంజర్' ఆలోచన వదల్లేదు. దీంతో ఉద్యోగాలు వదులు కొని 'జెన్ రోబోటిక్స్' అనే స్టార్టప్ మొదలుపెట్టారు.

రోబోటిక్ స్కావెంజర్ 'బ్యాండికూట్'తో ఈ స్టార్టప్ ప్రస్థానం మొదలైంది. 50 కిలోల బరువు ఉండే 'బ్యాండికూట్' రిమోట్–కంట్రోల్డ్ రోబోట్. 360 డిగ్రీల మోషన్స్‌లో పనిచేస్తుంది. సింగిల్ షిఫ్ట్‌లో పది నుంచి పన్నెండు మురుగు కాలువలను శుభ్రపరుస్తుంది. ఒక్కొక్క మురుగు కాలువను, మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయడానికి 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతుంది.

స్కై స్క్రాపర్స్‌కు సంబంధించిన గ్లాస్ ఫేసాడ్‌లను శుభ్రం చేసే 'జీ-బిటల్' రోబోట్ కూడా మెగా హిట్ అయింది. ఇక 'వెల్‌బోర్' అనేది ఆయిల్ అండ్ గ్యాస్, కెమికల్ ఇండస్ట్రీలకు సంబంధించిన పెద్ద ట్యాంకులను శుభ్రపరుస్తుంది.

'బ్యాండికూట్'తో మొదలైన జెన్ రోబోటిక్స్ ప్రయాణం హెల్త్‌కేర్, కెమికల్ ఇండస్ట్రీ, ఆయిల్ అండ్ గ్యాస్ సెక్టార్... మొదలైన వాటికి విస్తరించింది.

'శానిటేషన్‌కు సంబంధించి పరిష్కరించుకోవాల్సిన పెద్ద సమస్యలు ఎన్నో ఉన్నాయి. వాటిపై దృష్టి పెడుతున్నాం' అంటున్నాడు కో–ఫౌండర్స్‌లో ఒకరైన విమల్.

'మరి ఈ యంత్రాల వల్ల కార్మికుల ఉపాధి దెబ్బతింటుంది కదా?' అనే సందేహం అందరికీ వస్తుంది.

దీన్ని దృష్టిలో పెట్టుకొని కార్మికులు సులభంగా ఆపరేట్ చేసేలా ఈ యంత్రాలను రూపొందించారు. మూడు వేల మందికి పైగా కార్మికులు ఈ యంత్రాల ద్వారా ఉపాధి పొందుతున్నారు.

'పారిశుద్ధ్య పనుల్లో మార్పు తీసుకురావడానికి సేఫ్టీ అండ్ డిగ్నిటీ నినాదంతో సాంకేతికతను ఉపయోగించుకుంటున్నాం. పారిశుద్ధ్య కార్మికులకు ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలు చేయాలనుకుంటాం' అంటున్నాడు ఫౌండర్స్‌లో ఒకరైన విమల్ గోవింద్.

తిరువనంతపురం కేంద్రంగా మొదలైన 'జెన్ రోబోటిక్స్' పదిహేడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పనిచేస్తోంది. బ్రిటన్, ఇండోనేషియ, మలేషియాలతో పాటు ఆఫ్రికన్ దేశాలకు విస్తరించింది.

'ఈ యువ బృందం పాషన్, సామాజిక దృష్టి మమ్మల్ని ఆకట్టుకుంది' అంటున్నాడు 'జెన్ రోబోటిక్స్' ఇన్వెస్టర్ 'యూనికార్న్ ఇండియా వెంచర్స్' ఫౌండర్, మెనేజింగ్ పాట్నర్ అనీల్ జోషి.

> 50 కిలోల బరువు ఉండే రోబోటిక్ స్కావెంజర్ 'బ్యాండికూట్' రిమోట్–కంట్రోల్డ్ రోబోట్. 360 డిగ్రీల మోషన్స్‌లో పని చేస్తుంది. సింగిల్ షిఫ్ట్‌లో పది నుంచి పన్నెండు మురుగు కాలువలను శుభ్రపరుస్తుంది.

• యంగ్ టాలెంట్

# మేఘన విజయం



• మేఘన కౌర్

ముంబైకి చెందిన మేఘన కౌర్ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పెద్ద పేరు తెచ్చుకుంది. తన యూట్యూబ్ ఛానల్ 'షీ ట్రబుల్‌మేకర్' బాగా పాపులర్ అయింది. హిందీ, ఇంగ్లిష్, పంజాబీ, సింధీ భాషలు మాట్లాడే మేఘనకు ప్రయాణాలు చేయడం, బ్యాడ్మింటన్ ఆడడం, పుస్తకాలు చదవడం అంటే ఇష్టం.

అమెరికన్ సింగర్ జస్టిన్ బీబర్ పాటలు వినడం అంటే బోలెడు ఇష్టం.

ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయం తెలుసుకోవడానికి ఉత్సాహం చూపే మేఘన జంతుప్రేమి. సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

'క్రియేటర్ ఎకనామీ ఊపందుకున్న ఈ సమయంలో మీదైన సొంత శైలి ఏర్పాటు చేసుకోవడానికి ఏం చేస్తారు?' అని అడిగితే–

'నా నుంచి ఆడియెన్స్ ఏం ఆశిస్తున్నారనే దాని గురించి ఆలోచించడంతో పాటు, నేను ఆడియెన్స్‌లో ఒకరిగా మారి నన్ను నేను విశ్లేషించుకుంటాను. సబ్జెక్ట్ విషయంలో రెలవెంట్‌గా ఉండడం అనేది ముఖ్యమైనది. అందుకే ఆడియెన్స్‌తో ఎప్పటికప్పుడు కనెక్ట్ అవుతాను. మారుతున్న ట్రెండ్స్‌పై ప్రత్యేక దృష్టి పెడతాను. సబ్జెక్ట్ విషయానికి వస్తే అతి తెలివి ఎప్పుడూ ప్రదర్శించవద్దు. ఎందుకంటే ఆడియెన్స్ మనకంటే తెలివైన వాళ్లు' అంటుంది మేఘన.

ఎంతవారికైనా ట్రోలింగ్ తప్పదు. సోషల్ మీడియా స్టార్ ఇన్‌ఫ్లూయెన్సర్ అయిన మేఘన ట్రోలింగ్‌పై ఇలా అంటుంది...

'నేను ఎమోషన్ పర్సన్. చిన్న విషయాలకే చిన్నబుచ్చుకుంటాను. అలాంటి నేను ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ప్రయాణం మొదలుపెట్టిన కొత్తలో ట్రోలింగ్ వల్ల చాలా ఇబ్బంది పడ్డాను. దాన్ని తట్టుకోవడం నా వల్ల కాదు అనిపించింది. అయితే ఆ తరువాత నాకు నేను ధైర్యం చెప్పుకున్నాను. ఒక్క హేట్ కామెంట్ ఉన్నచోట పది ప్రశంసలు కనిపిస్తాయి. మరి ఆ ఒక్క కామెంట్‌ను చూస్తూ బాధ పడడం ఎందుకు! అందుకే పాజిటివ్ కామెంట్స్‌పైనే ఎక్కువ దృష్టి పెడతాను. వాటి ద్వారా శక్తిని గ్రహిస్తాను. సక్సెస్‌ఫుల్ కంటెంట్ క్రియేటర్‌గా రాణించడానికి మొదట ఉండాల్సింది సహనం. ఆ తరువాతే ఏదైనా!'

> ఒక్క హేట్ కామెంట్ ఉన్న చోట పది ప్రశంసలు కనిపిస్తాయి. మరి ఆ ఒక్క కామెంట్‌ను చూస్తూ బాధ పడడం ఎందుకు! అందుకే పాజిటివ్ కామెంట్స్ పైనే ఎక్కువ దృష్టి పెడతాను.

• ఇంగ్లిష్ ఇడియమ్స్

**టాక్ త్రూ యువర్ హ్యాట్**

ఒక విషయంపై అవగాహన లేకపోయినా, అర్థం కాకపోయినా ఏదో ఒకటి మాట్లాడి అపహాస్యానికి గురయ్యే వారిని ఉద్దేశించి చెప్పే మాట ఇది.

**టాక్ టర్కీ**

ఒక విషయం గురించి నిర్మొహమాటంగా, సూటిగా చర్చించే సందర్భంలో ఉపయోగిస్తారు.

**టీతింగ్ ప్రాబ్లమ్స్**

ఒక వ్యాపారం లేదా ప్రాజెక్ట్ మొదలుపెట్టినప్పుడు ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలు.

**బీ ఏ టాల్ ఆర్డర్**

నెరవేర్చడం అసాధ్యం అనుకున్న పని, కష్టతరమైన డిమాండ్... మొదలైన సందర్భాల్లో వాడే మాట ఇది.

ఉదా: బిల్డింగ్ ది బ్రిడ్జి ఇన్ టైమ్ ఫర్ ది ఒలింపిక్స్ విల్ బీ ఏ టాల్ ఆర్డర్

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. 


COMET EV












DIGITAL KEY SHARING
SMART TECH KEY




HOME CHARGING BOX